మంగళవారం
24•9•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 90
• పేజీలు : 14+ 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

తెలంగాణ హరితహారం భేష్

అటవీశాతం పెంపునకు చర్యలు ముదావహం

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారం అద్భుతం. ఈ కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలనునాటి సంరక్షిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు. రాష్ట్ర ప్రభుత్వం అడవుల శాతాన్ని పెంపొందించడంపై దృష్టిసారించడం మంచి విషయం. అసోంలోని బ్రహ్మపుత్ర నది ఒడ్డున 550 హెక్టార్లలో అడవిని పెంచేందుకు నాకు దాదాపు 30 ఏండ్లు పట్టింది. అటవీ విస్తీర్ణం పెరిగేకొద్దీ, ఏనుగులు, పులులు రావడం మొదలైంది.

- ఫారెస్ట్‌మ్యాన్ ఆఫ్ ఇండియా జాదవ్ పాయెంగ్

3

నమస్తే తెలంగాణ
ముల్కనూరు ప్రజాగ్రంథాలయం
కథలపోటీ
ఫలితాలు 3వ పేజీలో

కాళేశ్వరం విజయవంతం

మధ్య గోదావరి పునర్జీవం అద్భుతం

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు విజయవంతమైంది. గోదావరి నదికి మధ్యలో పునర్జీవం తీసుకురావడం అద్భుతం. కాళేశ్వరం ఫలాలు సంపూర్ణంగా అందేందుకు మరికొంత సమయం పడుతుంది. నీటివినియోగంలో క్రమశిక్షణ ఉండాలి. కోయినా నీటిని మళ్లించడం ద్వారా కృష్ణా నదిలో జలకళ ఉట్టిపడుతుందంటే ఆ మేరకు కచ్చితంగా చర్యలు తీసుకోవాలి.

- వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్‌సింగ్

3

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

మొబైల్ యాప్‌తో జనగణన

- 2021లో జనాభాను లెక్కించడంలో డిజిటల్ సాంకేతికత వినియోగం
- మున్సిపల్ వార్డులు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధులపై మరింత స్పష్టత వచ్చే అవకాశం
- ఆధార్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు కార్డు స్థానంలో ఒకే గుర్తింపు కార్డు
- కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడి

దేశవ్యాప్తంగా 2021లో చేపట్టబోయే జనగణనను మొబైల్ యాప్ ద్వారా జరుపాలని నిర్ణయించినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సంప్రదాయ పద్ధతులైన పేపర్, పెన్ను వినియోగానికి స్వస్తి పలుకుతామన్నారు. దేశమంతటా పౌరులకు బహుళ ప్రయోజనాలు కల్పించేందుకు ఆధార్, పాస్‌పోర్ట్, బ్యాంక్ ఖాతా, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపు కార్డుల స్థానంలో ఒకే ఒక్క గుర్తింపుకార్డును తీసుకురానున్నట్లు షా చెప్పారు. దీనికోసం జాతీయస్థాయిలో చేపట్టే జన గణన దోహదపడుతుందని షా తెలిపారు. దీంతో మున్సిపల్ వార్డులు, అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పరిధులు సైతం మరింత స్పష్టత సంతరించుకోనున్నాయని తెలిపారు.

4

బ్యాంకుల సమ్మె వాయిదా

- బ్యాంకుల విలీనంపై సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ
- కేంద్ర ఆర్థిక కార్యదర్శి హామీ

వివరాలు వాణిజ్యంలో

బాలాకోట్‌లో మళ్లీ ఉగ్ర శిక్షణ

- భారత్‌లోకి చొరబడేందుకు సిద్ధంగా 500 మంది
- ఉగ్రవాదులను ఏరివేసేందుకు భారత బలగాలు సిద్ధం
- కశ్మీర్ ఇప్పటికీ స్తంభించిందన్న వార్తల్లో నిజం లేదు
- ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్

III

ఆగని పెట్రో మంట

- ఢిల్లీలో 29 పైసలు పెరిగిన పెట్రోల్, డీజిల్‌పై 19 పైసల వడ్డన
- హైదరాబాద్‌లో పెట్రోల్‌పై 31 పైసలు, డీజిల్ 21 పైసలు అధికం

9

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)

ఫారం ధర	83.00	రిటైల్ లైవ్	105.00
డ్రెస్‌డ్	152.00	స్కిన్‌లెస్	173.00

గుడ్ల ధరలు (వందకు) (రూ.)

హైదరాబాద్	387.00	రంగారెడ్డి	387.00
మెదక్	387.00	కరీంనగర్	390.00
వరంగల్	390.00	చిల్లర ధర	4.45

తక్కువ నష్టం, తక్కువ భూసేకరణతో

కృష్ణా-గోదావరి అనుసంధానం

ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనకరంగా గోదావరి నీటి తరలింపు, వినియోగం

ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ నిర్ణయం ■ ప్రగతిభవన్‌లో ఇద్దరు సీఎంల సుదీర్ఘ భేటీ



సోమవారం ప్రగతిభవన్‌లో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని సాదరంగా ఆహ్వానిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

- ఏపీలో 4వేల మంది తెలంగాణ పోలీసులకు శిక్షణ
- సీఎం కేసీఆర్ విజ్ఞప్తికి జగన్ సానుకూల స్పందన
- బ్రహ్మోత్సవాలకు సతీసమేతంగా రండి
- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఏపీ సీఎం జగన్ ఆహ్వానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండు తెలుగు రాష్ట్రాల్లో సాగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కే చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సుదీర్ఘంగా సమావేశమయ్యారు. సోమవారం సాయంత్రం ప్రగతిభవన్‌కు వచ్చిన ఏపీ సీఎం జగన్‌ను తెలంగాణ సీఎం కేసీఆర్ సాదరంగా ఆహ్వానించారు. జగన్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇద్దరు సీఎంలు ప్రగతిభవన్‌లో సమావేశమయ్యారు. వీలైనంత తక్కువ భూసేకరణతో, తక్కువ నష్టంతో గోదావరి జలాలను కృష్ణానదికి అనుసంధానం చేయాలని ఇద్దరు సీఎంలు నిర్ణయించారు. గోదావరి నీటిని కృష్ణకు తరలించే విషయం తోపాటు రెండు రాష్ట్రాలకు సంబంధించిన పలు ఇతర అంశాలపైనా ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. దాదాపు నాలుగుగంటలపాటు ఈ చర్చ

మిగతా 2వ పేజీలో

ముచ్చటగా మూడో ఏడాది..

కలీంనగర్‌లో బతుకమ్మ చీరతో మురిసిపోతున్న మహిళ

నల్లగొండలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరిగిన బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు. (ఇన్‌సెట్) బతుకమ్మ చీరెను అందజేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా, మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కూడా ఉన్నారు.

మురిసిన ఆడబిడ్డలు

రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ చీరెల పంపిణీ మొదలు

- నల్లగొండలో ప్రారంభించిన మంత్రి కేటీఆర్
- వివిధ జిల్లాల్లో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- పంపిణీకి వంద వెరైటీల్లో కోటికిపైగా చీరెలు
- అడబిడ్డలకు ప్రభుత్వ చిరుకానుక ఇది
- ఆప్తుడిగా, పెద్దన్నగా సీఎం కేసీఆర్ అందజేస్తున్నారు
- త్వరలో సింగరేణి, ఆర్టీసీ సహా అన్ని యూనిఫామ్‌లు నేతన్నలకే: కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నీలగిరి: బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులకు ప్రభుత్వం అందిస్తున్న బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. ప్రతి మహిళ తాను అందుకున్న బతుకమ్మ చీరెను చూసుకుని మురిసిపోయింది. యువతులు మొదలు.. వృద్ధ మహిళల వరకు ప్రతి ఒక్కరు బతుకమ్మ చీరెను చూసి అనందపడ్డారు. పదిరకాల డిజైన్లు, పదిరకాల రంగుల్లో.. మొత్తంగా వంద వెరైటీల్లో ఉన్న చీరెలు ఎంతో

మిగతా 3వ పేజీలో

థామస్ కుక్ దివాలా!

ఆగిన ఎయిర్‌లైన్స్, టూరిజం సేవలు.. విదేశాల్లో చిక్కుకున్న 6 లక్షల మంది పర్యాటకులు

అత్యవసర చర్యల్లో బ్రిటన్.. అద్దె విమానాల్లో స్వదేశీయుల తరలింపు

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇదే తొలిసారి.. రోడ్డునపడ్డ 22 వేల ఉద్యోగులు

బ్రిటన్ పర్యాటక, విమానయాన సేవల దిగ్గజం థామస్ కుక్ దివాలా తీసింది. రూ.15 వేల కోట్ల రుణ భారాన్ని మోస్తున్న ఈ సంస్థ.. ఆపత్కాల నిధుల సమీకరణలో విఫలమైంది. రూ.1,775 కోట్ల అత్యవసర రుణం దొరుకక సోమవారం తెల్లవారుజామున మూతబడింది. ఫలితంగా వివిధ దేశాలకు చెందిన దాదాపు 6 లక్షల మంది పర్యాటకులు ఇబ్బందుల్లో పడితే, ప్రపంచవ్యాప్తంగా 22 వేల మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారు. మరోవైపు విదేశాల్లో చిక్కుకున్న 1.5 లక్షల మంది స్వదేశీయులను అద్దె విమానాల్లో తరలించేందుకు బ్రిటన్ చర్యలు ప్రారంభించింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ స్థాయిలో పౌరులను స్వదేశానికి బ్రిటన్ తరలించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. గతకొంత కాలంగా తీవ్ర ఆన్‌లైన్ పోటీని ఎదుర్కొంటున్న థామస్ కుక్.. బుకింగ్స్‌ను ఆశించిన స్థాయిలో అందుకోలేకపోతున్నది. దీనికితోడు బ్రెగ్జిట్ కష్టాలు వచ్చిపడ్డాయి. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులు పెరిగి రూ.10 వేల కోట్ల నష్టాలకు లోనైంది. చివరకు చేతులెత్తేసింది.

వివరాలు వాణిజ్యంలో

గ్రామానికో వైకుంఠధామం

- పల్లె ప్రణాళికలో భాగంగా నిర్మాణాలు
- రాష్ట్రవ్యాప్తంగా 9,484 గ్రామాలకు మంజూరు
- ఇప్పటికే 3,789 గ్రామాల్లో పూర్తి
- ప్రభుత్వ భూములు లేని ప్రాంతాల్లో దాతల సాయంతో ముందుకు..

పల్లె ప్రగతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గ్రామాల్లో వైకుంఠధామాలు సిద్ధమవుతున్నాయి. శవాన్ని దహనం చేసేందుకు గుంటెడు జాగ లేని గ్రామాల్లో 30 రోజుల పల్లె ప్రణాళికలో భాగంగా అన్ని సౌకర్యాలతో శ్మశానవాటికలు ఏర్పాటవుతున్నాయి. ఊరు బయట, చెరువు గట్లపై శవాలను దహనం, ఖననం చేసే పరిస్థితులను తొలగించేలా రాష్ట్రవ్యాప్తంగా 9,484 గ్రామాల్లో శ్మశానవాటికల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. గతంలో నిర్మాణాలు మొదలు పెట్టిన వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తిచేశారు. స్నానాలకు ఏర్పాట్లు, నీటి వసతి, విద్యుత్తు సౌకర్యం కల్పించి వాటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. అదే విధంగా ప్రభుత్వ భూమి అందుబాటులోలేని గ్రామాల్లో దాతల సాయం కోరడంతో భూములిచ్చేందుకు చాలామంది ముందుకొస్తున్నారు. కొన్నిచోట్ల రైతులే స్వచ్ఛందంగా వచ్చి భూమిని దానం చేశారు. కొన్నిచోట్ల పంచాయతీ పాలకవర్గాలు శ్మశానవాటికల కోసం భూములను కొనుగోలు చేసేందుకు తీర్మానం చేసుకున్నాయి.

5,695 గ్రామ పంచాయతీల్లో భూమి సిద్ధం

పల్లె ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 9,484 గ్రామపంచాయతీల్లో వైకుంఠధామాల ఏర్పాటుకు ప్రభుత్వం

మిగతా 5వ పేజీలో

అంతటా ధమాల్..

తెలంగాణలో రియల్ కమాల్

మాంద్యంలోనూ రియల్‌ర్యాలీ

రాష్ట్రంలో జోరుగా రిజిస్ట్రేషన్లు.. లక్ష్యాన్ని మించి రాబడి

రంగారెడ్డి జిల్లాలో అత్యధిక డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు

రాబడిలో రెండు, మూడు స్థానాల్లో మేడ్చల్, మెదక్

రాష్ట్రంలో అనుకూల పరిస్థితులే కారణం: రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ చిరంజీవులు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

ఆర్థికమాంద్యం ప్రతికూల ప్రభావం అన్నిరంగాలపై పడిన నేపథ్యంలో దేశంలోని అధికశాతం రాష్ట్రాల్లో స్థిరాస్తిరంగం (రియల్ ఎస్టేట్) తీవ్ర మందగమనంలో ఉన్నది. కొన్ని రాష్ట్రాల్లో రియల్‌రంగం మైనస్‌లోకి జారుకుంటే.. మరికొన్నిచోట్ల స్థిరాస్తిరంగం ఢమాల్ మన్నది. కానీ తెలంగాణలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. ప్రతికూల పరిస్థితులలోనూ ఇక్కడి రియల్‌రంగంలో జోరు కొనసాగుతున్నది. ఆర్థిక మాంద్యం ప్రభావం రాష్ట్రంలోని ఇతరరంగాలపై ఉన్నా స్థిరాస్తి రాబడిలో మాత్రం వేగంతగ్గలేదు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రాష్ట్రఖజానాకు తాజా లెక్కల ప్రకారం దాదాపు రూ.3,400 కోట్లు చేరాయి. ఏప్రిల్ నుంచి కేవలం ఐదు నెలలలోనే బడ్జెట్ లక్ష్యంలో సగానికి పైగా దాటింది. గత ఆర్థికసంవత్సరం 12 నెలల్లో మొత్తం రాబడి రూ.6612 కోట్లు కాగా ఈసారి అతి తక్కువకాలంలోనే రూ.3,400 కోట్ల వరకు రాబడి సమకూరడం విశేషం. గత ఏడాది 27.73% వృద్ధిరేటు నమోదు కాగా ఈ ఆర్థికసంవత్సరం ఇప్పటికే వృద్ధిరేటు 17% దాటింది. ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వృద్ధిరేటు 6% లోపే ఉన్నట్లు తాజా గణాంకాలు చెప్తున్నాయి. ఇక తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో వృద్ధిరేటు మైనస్‌లో ఉన్నది. దేశమంతటా ఇదే పరిస్థితి అని రియల్‌రంగ నిపుణులు పేర్కొంటున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో స్థిరాస్తి లావాదేవీలు ఊహలకందని విధంగా పెరుగుతున్నాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల రాబడి నెలనెలకు భారీగా పెరుగుతున్నది. ఈ ఆర్థికసంవత్సరం మొదటి ఐదునెలల్లో రాష్ట్రం రియల్ ఆదాయంలో గణనీయంగా వృద్ధిని సాధించిందని వెల్లడైంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు నెలాఖరు వరకు రూ.2,300 కోట్ల వరకు రాబడి రాగా, ఈసారి ఎకాఎకిన అది దాదాపు రూ.2,800 కోట్లకు పెరిగింది. సెప్టెంబర్ రెండోవారానికి అది రూ.3,400 కోట్ల మార్క్ దాటింది. ఎప్పటిలాగే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచి దాదాపు 60% ఆదాయం ఖజానాకు జమైంది. గత ఏడాది ఆగస్టు వరకు 6,17,498 డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా ఈసారి అదే సమయానికి 7,30,728 డాక్యుమెంట్లు రిజిస్టర్ కావడం విశేషం. గత ఏడాది ఐదు నెలల్లో.. అంటే ఆగస్టు నెలాఖరు వరకు రూ.2.40 వేల కోట్ల వరకు రాబడి రాగా ఈసారి అదే సమయానికి రాబడి రూ.2.72 వేల కోట్లు దాటింది. ఈసారి కూడా అత్యధిక డాక్యుమెంట్లు రంగారెడ్డి జిల్లాలోనే రిజిస్టర్ అయ్యాయి. ఈ జిల్లాలో 1,53,639 స్థిరాస్తి దస్తావేజులు రిజిస్ట్రేషన్ కాగా వేయి కోట్ల రూపాయలకు పైగా రాబడి వచ్చింది. మేడ్చల్ మల్కాజిగిరిలో 71,199 డాక్యుమెంట్ల ద్వారా సుమారు రూ.500 కోట్ల రాబడి వచ్చింది. తర్వాతి స్థానాన్ని మెదక్ జిల్లా ఆక్రమించింది. మెదక్ జిల్లాలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం గత రెండేండ్లుగా బాగా పుంజుకున్నది. ఈ జిల్లాలో

మిగతా 2వ పేజీలో

హ్యూస్టన్ సభలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ

4

'అంతా బాగు'.. ఎక్కడ?

హౌడీ-మోదీలో భారత్‌లో అంతా బాగుందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై విమర్శలు

ఆరేండ్ల కనిష్ఠానికి దిగజారిన జీడీపీ వృద్ధిరేటు

45 ఏండ్ల గరిష్ఠానికి చేరిన నిరుద్యోగం.. ప్రైవేట్ పెట్టుబడుల్లో తీవ్ర క్షీణత

స్పష్టం చేస్తున్న గణాంకాలు

వాతావరణ మార్పులపై
ప్రపంచ ఉద్యమం రావాలి

ఐరాస పర్యావరణ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

మాటలు కాదు.. ఇక చేతలు కావాలని స్పష్టీకరణ

శిలాజేతర ఇంధన లక్ష్యాన్ని 450 గిగావాట్ల వరకు పెంచుతామని వెల్లడి

సోమవారం ఐక్యరాజ్యసమితి సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

సోమవారం కురిసిన వర్షానికి మహబూబ్‌నగర్ జిల్లా బలీదుపల్లికి వెళ్లే రోడ్డు మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

మూడు జిల్లాల్లో భారీ వర్షం

వచ్చే మూడ్రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు

7

epaper.ntnews.com

సోమవారం తన ఇంటికి సతీసమేతంగా వచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును శాలువా కప్పి ఆహ్వానిస్తున్న అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా ఉన్నారు.

స్పీకర్ ఇంటికి సీఎం దంపతులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులు సోమవారం స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి ఇంటికి వెళ్లారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసినవారు అక్కడే భోజనం చేశారు. సీఎం వెంట రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ఉన్నారు.

హుజూర్‌నగర్ టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి బీ ఫాం అందజేస్తున్న సీఎం కేసీఆర్

హుజూర్‌నగర్ ఉపఎన్నికకు నోటిఫికేషన్

- 30వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- అక్టోబర్ 1న పరిశీలన..
  3 వరకు ఉపసంహరణ గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. సోమవారం నుంచే నామినేషన్ల స్వీకరణ మొదలయింది. ఈ నెల 30 వరకు నామినేషన్లను స్వీకరించనుండగా.. అక్టోబర్ 1న పరిశీలన జరుగుతుంది. ఉపసంహరణకు 3వ తేదీ వరకు గడువు ఉంటుంది. అక్టోబర్ 21వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తారు. ఓట్లలెక్కింపు 24న జరుగుతుంది. 2019 జనవరి1వ తేదీ ఓటర్ల జాబితా ప్రకారం ఎన్నిక జరుగుతుందని ఈసీ స్పష్టం చేసింది. హుజూర్‌నగర్ ఉపఎన్నికకు జిల్లా రెవెన్యూ అధికారి చంద్రయ్యను రిటర్నింగ్ అధికారిగా నియమించారు. అభ్యర్థులు హుజూర్‌నగర్ ఎమ్మార్వో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది. సోమవారం మొదటి రోజు నామినేషన్లు దాఖలు కాలేదు.

కేసీఆర్ నుంచి బీఫాం అందుకున్న సైదిరెడ్డి

టీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం హుజూర్‌నగర్ ఉపఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన శానంపూడి సైదిరెడ్డికి బీ ఫాం అందజేశారు.

సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సమావేశమైన ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

టీటీడీ సభ్యుడిగా ప్రమాణం చేసిన దీవకొండ దామోదర్‌రావుకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారి. చిత్రంలో దామోదర్‌రావు సతీమణి స్వరూప రాణి, కుమారుడు రాఘవ్ కూడా ఉన్నారు.

టీటీడీ సభ్యుడిగా ప్రమాణం చేసిన జూపల్లి రామేశ్వర్‌రావు దంపతులకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారి

ప్రమాణం అనంతరం జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో సహచర సభ్యులతో దీవకొండ దామోదర్‌రావు

కృష్ణా-గోదావరి అనుసంధానం

మొదటిపేజీ తరువాయి...

జరిగింది. గోదావరి నీటిని కృష్ణకు ఎక్కడ నుంచి, ఎలా తరలించాలి? అలైన్‌మెంట్ ఎలా ఉండాలి? అనే విషయాలు చర్చించారు. జలాల తరలింపు, నీటి వినియోగం ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉండాలని, దీని కోసం ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్, పోలీసు ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. తెలంగాణలో 18 వేల మంది పోలీసులను ఒకేసారి నియమిస్తున్నందున అందులో నాలుగు వేలమందికి ఏపీలో శిక్షణ ఇవ్వాలని ఏపీ సీఎంను కేసీఆర్ కోరారు. దీనికి జగన్ సానుకూలంగా స్పందించారు. పోలీసులకు ఒకేసారి శిక్షణ ఇవ్వడం వల్ల అందరినీ ఒకేసారి విధుల్లోకి తీసుకునే వెసులుబాటు కలుగుతుంది. ఈ అంశాలతోపాటు రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఇతర విషయాలను కూడా ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఏపీ నుంచి ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, తెలంగాణ నుంచి ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రావుల శ్రవణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సతీసమేతంగా రండి

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం కేసీఆర్‌ను ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆహ్వానించారు. సోమవారం ప్రగతిభవన్ వచ్చిన సందర్భంగా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను సీఎం కేసీఆర్‌కు అందజేశారు. బ్రహ్మోత్సవాలకు సతీసమేతంగా రావాలని కోరారు.

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను సీఎం కేసీఆర్‌కు అందజేస్తున్న ఏపీ సీఎం జగన్. చిత్రంలో టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఏపీ ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తెలంగాణ ఎంపీ సంతోష్‌కుమార్ కూడా ఉన్నారు.

కొలువుదీరిన టీటీడీ పాలకమండలి

- 17 మంది కొత్త సభ్యుల ప్రమాణం
- మొత్తం 24కి చేరిన ప్రమాణస్వీకారాలు
- తొలి సమావేశంలో పలు నిర్ణయాలు
- నిధుల కేటాయింపులకు ఆమోదముద్ర

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలక మండలి కొలువుదీరింది. 28 మందిని టీటీడీ పాలకమండలి సభ్యులుగా ప్రకటించగా సోమవారం 21 మంది ప్రమాణం చేశారు. వీరిలో తెలంగాణ నుంచి 'నమస్తే తెలంగాణ' ఎండీ దీవకొండ దామోదర్‌రావు, జూపల్లి రామేశ్వర్‌రావు, పార్థసారథిరెడ్డి, వెంకట భాస్కరరావు, మూరంశెట్టి రాములు, శివకుమార్, ప్రతాప్ రెడ్డి ప్రమాణం చేశారు. మిగతా రాష్ట్రాల నుంచి పది మంది ప్రమాణం చేశారు. సోమవారం తొలుత ఎక్స్‌అఫీషియో సభ్యులైన ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఎండోమెంట్ కమిషనర్ పద్మజ ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత పాలక మండలి సభ్యులు ప్రమాణం చేశారు. ఐదు గురు సభ్యులు ఆంగ్లంలో, మిగిలినవారు తెలుగులో ప్రమాణ స్వీకరించారు. శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో 50వ బోర్డు పాలకమండలి సభ్యులతో ఈవో అనిల్‌కుమార్, జేఈవో బసంత్‌కుమార్ ప్రమాణం చేయించారు. ప్రమాణం చేసిన సభ్యులను టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సభ్యులకు శ్రీవారి దర్శనం చేయించారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు. ఇప్పటికే శనివారం ముగ్గురు సభ్యులు ప్రమాణం స్వీకరించారు. దీంతో ఇప్పటివరకు 24 మంది సభ్యుల ప్రమాణస్వీకారం పూర్తయ్యింది.

అభివృద్ధి పనులపై సమావేశం

స్వామివారి దర్శనం తర్వాత టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన అన్నమయ్య భవనంలో పాలకమండలి తొలిసమావేశం పలు సేవాకార్యక్రమాలు, అభివృద్ధి పనులపై కొనసాగింది. అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణ నిధుల కుదింపు, శ్రీవారి ప్రసాదం ముడి సరుకుల కొనుగోలుపై చర్చించారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా వీఐపీ బ్రేక్ దర్శనాలు, రూ.100 కోట్లతో తిరుపతిలో హాస్టల్ నిర్మాణం, రూ.79 కోట్లతో తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం-5 నిర్మాణంపై చర్చించి ఆమోదం తెలిపారు. తిరుపతిలోని గరుడ వారధి నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించారు. కార్యక్రమంలో టీటీడీ సీవీఎస్వో గోపీనాథ్ జెట్టి, అదనపు సీవీఎస్వో శివకుమార్‌రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు

తిరుమల రామానుజ చినజీయర్‌స్వామి అనుగ్రహంతో ఈ అవకాశాన్ని కల్పించిన ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు. స్వామివారి అనుగ్రహంతో సామాన్యభక్తులకు సేవ చేసే శక్తిని ఇవ్వాలని కోరుకుంటున్నా.

- జూపల్లి రామేశ్వర్‌రావు, పాలకమండలి సభ్యుడు

టీటీడీ పాలక మండలి సభ్యులు వీరే: 1. కే పార్థసారథి (ఎమ్మెల్యే), 2. యూవీ రమణ మూర్తిరాజు (ఎమ్మెల్యే), 3. మేడా మల్లికార్జునరెడ్డి, (ఎమ్మెల్యే), 4. పరిగెల మురళీ కృష్ణ, 5.కృష్ణమూర్తి వైద్యనాథన్, 6.నారాయణస్వామి శ్రీనివాసన్, 7. జూపల్లి రామేశ్వర్‌రావు, 8. వీ ప్రశాంతి, 9. బీ పార్థసారథిరెడ్డి, 10. డాక్టర్ నిచిత ముప్పవరపు, 11. నాదెండ్ల సుబ్బారావు, 12. డీపీ అనంత, 13.రాజేశ్ శర్మ, 14. రమేశ్‌శెట్టి, 15. గుండవరం వెంకట భాస్కరరావు, 16. మూరంశెట్టి రాములు, 17. దీవకొండ దామోదర్‌రావు, 18. చిప్పగిరి ప్రసాద్‌కుమార్, 19. ఎమ్మెస్ శివశంకరన్, 20. సంపత్ రవి నారాయణ, 21. సుధా నారాయణమూర్తి, 22. కుమారగురు (ఎమ్మెల్యే), 23. పుత్తా ప్రతాప్‌రెడ్డి, 24. కే శివకుమార్.

ఎక్స్‌అఫీషియో సభ్యులు: 1. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఎండోమెంట్), 2. దేవాదాయశాఖ కమిషనర్, 3. తుడా చైర్మన్, 4. టీటీడీ ఈవో

తెలంగాణలో రియల్ కమాల్

ముహూర్తం

సూర్యోదయం: 6.09 **గంటలకు**

సూర్యాస్తమయం: 6.08 **గంటలకు**

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, భాద్రపదమాసం, కృష్ణపక్షం దశమి సాయంత్రం 4.44 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: పునర్వసు ఉదయం 10.31 వరకు, తదుపరి పుష్యమి, అమృతఘడియలు: ఉదయం 8.13 నుంచి 9.49 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.08 నుంచి సాయంత్రం 4.38 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.32 నుంచి 9.20 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.08 నుంచి 2.56 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.59 నుంచి రాత్రి 7.35 వరకు.

మొదటిపేజీ తరువాయి...

డాక్యుమెంట్లు మేడ్చల్ జిల్లా కంటే ఎక్కువగా.. 84,580 వరకు రిజిస్ట్రేషన్ కాగా రూ.254కోట్ల వరకు రాబడి వచ్చింది. మహబూబ్‌నగర్‌లో కూడా పెద్దసంఖ్యలో 83.087 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా రాబడి దాదాపు రూ.8 కోట్ల వరకు సమకూరింది. ఇక హైదరాబాద్ సౌత్, హైదరాబాద్ రిజిస్ట్రేషన్ జిల్లాలలో ఎప్పటిలాగే డాక్యుమెంట్లు పరిమితంగా ఉన్నా రాబడి మాత్రం రూ.40 కోట్ల వరకు సమకూరింది. రంగారెడ్డి జిల్లాలో 1,41,744 డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా సుమారు రూ.830 కోట్ల రాబడి వచ్చింది. ఇది మొత్తం రాబడిలో 35.12 శాతంగా ఉన్నది. మేడ్చల్ జిల్లాలో 72,461 డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా దాదాపు రూ.530 కోట్ల ఆదాయం వచ్చింది. దాదాపు రూ.195 కోట్ల రాబడి సాధించి మెదక్ మూడోస్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన మరుసటి సంవత్సరం నుంచే రియల్ ర్యాలీ కొనసాగుతున్నది. వాస్తవానికి 2003లో భూముల విలువ పెంచిన తర్వాత ఇప్పటివరకు రివిజన్ జరుగలేదు. ప్రజలపై రిజిస్ట్రేషన్ రుసుం భారం పెరుగకుండా స్టాంప్ డ్యూటీని పెంచలేదు. అయినప్పటికీ రాబడిలో ఏటేటికాయేడు గణనీయవృద్ధి చోటుచేసుకుంటున్నది.

రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత రియల్ ర్యాలీ తీరు

సంవత్సరం	మొత్తం రాబడి (రూ.కోట్లలో)	వృద్ధిరేటు (శాతంలో)
2014-15	2,746.16	-
2015-16	3,785.95	37.87
2016-17	4,249.29	12.23
2017-18	5,177.00	21.84
2018-19	6,612.75	27.73
2019-20 (సెప్టెంబర్ 20 వరకు)	3,357.00	(ఇప్పటివరకు) 17.00

ఈసారి కూడా లక్ష్యాన్ని మించి రికార్డు రాబడి

ఆర్థికమాంద్యం ప్రభావం ఉన్నా రాష్ట్రంలో ఈసారి కూడా లక్ష్యాన్ని మించి రాబడి సాధించడానికి మెరుగైన అవకాశాలున్నాయి. రాష్ట్రంలో అన్ని రంగాల్లో జరుగుతున్న స్థిరమైన అభివృద్ధి, పెట్టుబడులకు అనువైన పరిస్థితులు రియల్‌రంగంలో రాబడి బాగా పెరుగటానికి ప్రత్యేక కారణాలు. పారిశ్రామిక ప్రగతి, సులభ వాణిజ్య విధానం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో తెలంగాణ అగ్రస్థానంలో నిలువడంతోపాటు రాష్ట్రంలో అన్ని కోణాల్లో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి కారణంగా స్థిరాస్తుల క్రయవిక్రయాలు జోరందుకుంటున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల వల్ల హైదరాబాద్‌లో నివాసానికి అత్యంత అనుకూల వాతావరణం ఏర్పడింది. అంతర్జాతీయంగా మంచి పేరు వచ్చింది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో భూముల క్రయవిక్రయాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం స్టాంప్‌డ్యూటీ, భూముల విలువ పెంచకపోయినా వృద్ధిరేటు గణనీయంగా ఉన్నది. వాస్తవానికి దేశంలో ఎక్కడా ఇంత వృద్ధిరేటు లేదు. ఈ విషయంలో తెలంగాణ వరుసగా రికార్డులను సృష్టిస్తున్నది.

- రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ టీ చిరంజీవులు

రిజిస్ట్రేషన్ జిల్లాలవారీగా డాక్యుమెంట్లు, రాబడి వివరాలు (ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు)

రిజిస్ట్రేషన్ జిల్లా	డాక్యుమెంట్లు	రాబడి (రూపాయలలో)
రంగారెడ్డి	1,53,639	1,009,33,06,257
మేడ్చల్	71,199	540,24,03,063
మెదక్	84,580	254,30,99,361
మహబూబ్‌నగర్	83,087	76,81,10,502
హైదరాబాద్	9,274	128,64,60,937
హైదరాబాద్ (దక్షిణ)	17,748	239,75,85,994
నిజామాబాద్	43,045	48,87,46,283
కరీంనగర్	52,369	79,49,32,598
వరంగల్	57,631	109,60,23,019
నల్లగొండ	1,01,034	143,62,69,271
ఖమ్మం	29,045	55,59,68,036
ఆదిలాబాద్	28,077	35,87,01,168
	7,30,728	2,722,16,06,489

(సెప్టెంబర్ 20 వరకు రాబడి రూ.3,400 కోట్లను దాటింది)

జోరుగా వానకాలం సాగు

పంట రుణాల్లో 50 శాతానికి మించి ఇవ్వని బ్యాంకు రుణాలు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ:

వానకాలం పంటల సాగు జోరుగా సాగుతున్నది. కురిసిన వర్షాలతో చెరువులు, రిజర్వాయర్లు నిండుకుండలను తలపిస్తున్నాయి. దీంతో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. సాధారణానికి మించి పంటలు సాగుకావడంతో ఎరువుల వినియోగం పెరిగింది. రైతులకు అనుకూల పరిస్థితులున్నా.. బ్యాంకర్లు రుణాలివ్వడంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సాగు వందశాతం దాటినా పంట రుణాల లక్ష్యం మాత్రం సగానికే పరిమితమైనది. వానకాలం సీజన్‌లో రికార్డు స్థాయిలో సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ సీజన్‌లో అన్ని పంటలు కలిపి సాధారణ సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, 1.09 కోట్ల ఎకరాల్లో సాగైంది. అందులో ఆహారధాన్యాల సాగు సాధారణ విస్తీర్ణం 48.25 లక్షల ఎకరాలు కాగా, 51.80లక్షల ఎకరాల్లో సాగైంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 24.11 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 31.44 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేశారు. అంటే, 130 శాతానికి నాట్లు చేరుకోవడం విశేషం. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 43.12 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 46.48 లక్షల ఎకరాల్లో (108 శాతం) ఎకరాల్లో సాగైంది. ఈ సారి సాగు విస్తీర్ణం పెరుగటంతో యూరియా వినియోగం రెట్టింపు అయ్యింది. సెప్టెంబర్‌లో 80వేల మెట్రిక్ టన్నులకు గాను, ఇప్పటివరకు 1.25 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. అంటే ఏస్థాయిలో పంటలు సాగవుతున్నాయో అర్థమవుతోంది. అయితే, వానకాలంలో రూ.29వేల కోట్ల పంట రుణాలు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ.14,588 కోట్లు ఇచ్చినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.

లోకం పోకడ

పైసా ఖర్చులేకుండా నా పండుగ షాపింగ్ అయిపోయిందోచ్!

లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఏఈ

- విద్యుత్ మీటర్ల కోసం లంచం డిమాండ్
- అధికారితోపాటు ప్రైవేట్ ఏజెంట్ అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో/యూసుఫ్‌గూడ, నమస్తే తెలంగాణ: ఇంట్లో విద్యుత్ మీటర్లు బిగించేందుకు లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖ ఏఈ, అతని ప్రైవేట్ ఏజెంట్ ఏసీబీ అధికారులకు సోమవారం పట్టుబడారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. టీఎస్ఎస్పీడీసీఎల్, యూసుఫ్‌గూడ సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఎస్ సుధాకర్‌ను యూసుఫ్‌గూడకు చెందిన ఎస్ రమేశ్ తన ఇంట్లో ఎలక్ట్రిసిటీ ప్యానల్ బోర్డు, నాలుగు అదనపు విద్యుత్ మీటర్లు ఏర్పాటుచేయాలని కోరారు. అందుకు రూ.70 వేల లంచం ఇవ్వాలని ఏఈ డిమాండ్ చేసి, లంచం డబ్బులు తన ప్రైవేట్ ఏజెంట్ ఎండీ ముంతాజ్‌కు ఇవ్వాలని చెప్పారు. యూసుఫ్‌గూడలోని రాఘవేంద్ర ఫుడ్‌కోర్టు వద్దకు వచ్చి లంచం డబ్బు తీసుకోవాలని ఏఈ, అతని ఏజెంటుకు రమేశ్ సూచించారు. ఇద్దరూ వచ్చి మొదటి విడుతగా రూ.35 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వారిని అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ అధికారులు, వారి ఏజెంట్లు లంచాలు అడిగితే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ఏసీబీ అధికారులు కోరారు.

లంచం తీసుకొంటూ ఏసీబీకి చిక్కిన యూసుఫ్‌గూడ సెక్షన్ ఏఈ సుధాకర్, అతడికి సహకరించిన ప్రైవేట్ ఏజెంట్ ముంతాజ్

రాష్ట్రానికి ఏడు జాతీయ పురస్కారాలు

- దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సశక్తికరన్ విభాగంలో ఎంపిక
- రూ.8 నుంచి రూ.50 లక్షల వరకు అందనున్న నగదు పురస్కారం
- రాఘవాపూర్‌కు నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గౌరవ్ గ్రామసభ అవార్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఈ ఏడాది దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సశక్తికరన్ అవార్డు కింద రాష్ట్రానికి ఏడు పురస్కారాలు లభించాయి. ఈ పురస్కారానికి ఎంపికైనవాటిలో ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లా మంథని, వెల్గటూర్ మండల కేంద్రాలు, మంథని మండలంలోని మల్లాపూర్, సిద్దిపేట జిల్లా ఇర్కోడు, మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం నాగపూర్ గ్రామ పంచాయతీలున్నాయి. వీటితోపాటు 2019 నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గౌరవ్ గ్రామసభ(ఎన్డీఆర్‌జీజీఎస్పీ) అవార్డును పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలం రాఘవపూర్ పంచాయతీ దక్కించుకున్నది. సాంఘిక, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న గ్రామ పంచాయతీలకు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఈ పురస్కారాలను అందజేస్తున్నది. ఈ పురస్కారాలను ఎక్కడ, ఎప్పుడు అందజేస్తారనేది నిర్ణయించలేదు. ఈ అవార్డుల్లో భాగంగా జిల్లా పరిషత్‌కు రూ. 50 లక్షలు, మండల పరిషత్‌కు రూ. 25 లక్షలు, గ్రామపంచాయతీలోని జనాభాకు అనుగుణంగా రూ. 8 లక్షల నుంచి 12 లక్షల వరకు నగదు పురస్కారాన్ని అందజేస్తారు. కేంద్రం నుంచి ఆయా పథకాల కింద అందిన నిధులకు సంబంధించి గత ఏడాది యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించిన గ్రామపంచాయతీలకు అవార్డు మొత్తాన్ని విడుదల చేస్తామని, యూసీలు(జీఎఫ్ఆర్12సీ) మంత్రిత్వశాఖకు పంపించాల్సిందిగా కేంద్రపంచాయతీరాజ్‌శాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ సంజీబ్‌కుమార్ పట్‌జోషి సూచించారు.

తనను పీఏసీ సభ్యుడిగా ఎంపిక చేసినందుకు సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

తనను బీసీ వెల్ఫేర్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేసినందుకు సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

అమీర్‌పేట దుర్ఘటనపై మంత్రి కేటీఆర్ సీరియస్

- స్వతంత్ర ఇంజినీరింగ్ నిపుణులతో పరిశీలించాలని అధికారులకు ఆదేశం
- మౌనిక కుటుంబసభ్యులకు రూ.20 లక్షల పరిహారం: ఎల్‌అండ్‌టీ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ మెట్రో అధిక నాణ్యత, భద్రతా ప్రమాణాలతో కూడినదని సంపాదించిన ఖ్యాతిని కొనసాగించాలని, భద్రతకు పూర్తిస్థాయి ప్రాధాన్యం ఇవ్వాలని పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ సోమవారం అధికారులను ఆదేశించారు. అమీర్‌పేట మెట్రో స్టేషన్ వద్ద ఆదివారం జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన మౌనిక కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనను ప్రభుత్వం ఎంతో సీరియస్‌గా తీసుకొన్నదని, స్వతంత్ర ఇంజినీరింగ్ నిపుణులు క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదం అనుకోకుండా జరిగినదే అయినప్పటికీ తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉన్నదన్నారు. అన్ని స్టేషన్ల నిర్మాణాలు, సౌకర్యాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి తగిన పరిహారం చెల్లించాలని చెప్పారు. మంత్రి కేటీఆర్ సూచనమేరకు రంగంలోకి దిగిన ఎల్ అండ్ టీ యాజమాన్యం మౌనిక కుటుంబసభ్యులతో చర్చలు జరిపిందని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రూ.20 లక్షల పరిహారం చెల్లించే ఒప్పందంపై కుటుంబసభ్యులు సంతకాలు చేశారని ఆయన వివరించారు.

నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం

కథల పోటీ ఫలితాలు విడుదల

- ప్రథమ బహుమతి రూ.50 వేలు
- వచ్చే నెలలో ముల్కనూరులో బహుమతుల ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీ ఫలితాలు విడుదలయ్యాయి. తెలుగు కథకు పట్టాభిషేకం చేసే ఉద్దేశంతో ప్రథమ బహుమతి కింద ఏకంగా రూ.50వేలు ప్రకటించడం విశేషం. 'తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సమకాలీన జీవన వైవిధ్యాల నేపథ్యంలో కథలను ఆహ్వానించగా విశేష ఆదరణ లభించింది. తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా ముంబై, ధార్వాడ్, కోల్‌కతాతోపాటు అమెరికా నుంచి కూడా కథలు పోటీకి వచ్చాయి. పోటీకి వచ్చిన 294 కథల నుంచి ఐదుగురు జడ్జీలతో కూడిన ప్యానల్ వివిధ క్యాటగిరీల్లో 22 కథలను ఉత్తమ కథలుగా ఎంపిక చేసింది. విజేతలకు వచ్చే నెలలో వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు ప్రజాగ్రంథాలయంలో బహుమతులను ప్రదానం చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బహుమతి పొందిన కథలు వరుసగా 'నమస్తే తెలంగాణ' ఆదివారం అనుబంధం 'బతుకమ్మ'లో ప్రచురితమవుతాయి. మిగిలిన కథల్లో కొన్నింటిని 'బతుకమ్మ'లో సాధారణ ప్రచురణకు స్వీకరించనున్నారు. ఆ కథల వివరాలు త్వరలోనే 'బతుకమ్మ'లో ప్రచురితమవుతాయి. ఈ 22 ఉత్తమ కథలతో కూడిన సంకలనం పుస్తకరూపంలో కూడా రానున్నది. నవ్యతకు, సృజనాత్మకతకు పెద్ద పీటవేసిన ఈ కథల పోటీ ఇచ్చిన ఉత్సాహంతోనే త్వరలో నవలల పోటీ కూడా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

విజేతలు

ప్రథమ బహుమతి (రూ. 50,000)

1. విత్తనం: పెద్దింటి అశోక్‌కుమార్, సిరిసిల్ల

రెండు ద్వితీయ బహుమతులు (రూ.25,000)

1. హరామ్: హుమాయున్ సంఘీర్, హైదరాబాద్
2. ఒట్టిపోయిన అడవి: శిరంశెట్టి కాంతారావు, భద్రాద్రి కొత్తగూడెం

మూడు తృతీయ బహుమతులు (రూ.10,000)

1. బేబక్క: పుట్టగంటి గోపీకృష్ణ, కర్ణాటక
2. అమ్మ పండుగ: ఎగుర్ల గణేశ్, జగిత్యాల
3. సిద్ధయ్య మఠం: రామా చంద్రమౌళి, వరంగల్

ఆరు కన్సొలేషన్ బహుమతులు (రూ.5,000)

1. ఖుర్బానీ: సయ్యద్ గఫార్, రంగారెడ్డి
2. అంటరాని బతుకమ్మ?: డాక్టర్ సిద్దెంకి యాదగిరి, సిద్దిపేట
3. అమ్మల గాజులు: డాక్టర్ ప్రభాకర్ జైనీ, హైదరాబాద్
4. రేణుక: పర్నపెల్లి యాదగిరి, సిద్దిపేట
5. ఒడి బియ్యం: గంగుల నరసింహారెడ్డి, హైదరాబాద్
6. గడి: చందు తులసి (చంద్రశేఖర్), హైదరాబాద్

పది సాధారణ ప్రచురణకు ఎంపికైనవి (రూ.1,000)

1. బొద్రౌతు: రావుల కిరణ్మయి, వరంగల్ అర్బన్
2. అతడు మార్గదర్శి: కూతురు రాంరెడ్డి, రంగారెడ్డి
3. తులసమ్మ బతికింది!: యూ రాజలింగమూర్తి, జగిత్యాల
4. సుక్కబర్రె: మ్యాకం రవికుమార్, పెద్దపల్లి
5. బూరుగు సందుగ: చెన్నూరి సుదర్శన్, హైదరాబాద్
6. స్వీట్ బాక్స్: నండూరి సుందరీ నాగమణి, మహబూబ్‌నగర్
7. పోరాటం: చేపూరి శ్రీరాం, హన్మకొండ
8. ఒక ఆకుపచ్చని ఆశ: బీ మురళీధర్, ఆదిలాబాద్
9. గుట్ట మీద దేవుడు: మధుకర్ వైద్యుల, హైదరాబాద్
10. బతుకు వాసన: గంగ్రకోట సూర్యనారాయణ శర్మ

కాళేశ్వరం విజయవంతమైన ప్రాజెక్టు

- మధ్య గోదావరి పునర్జీవం అద్భుతం
- వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్‌సింగ్
- కృష్ణాకు గోదావరి మళ్లింపుతో రెండురాష్ట్రాలకు లాభం
- తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్‌రావు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్‌సింగ్, చిత్రంలో టీడబ్ల్యూఆర్డీసీ చైర్మన్ వీ ప్రకాశ్‌రావు తదితరులు ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గోదావరి నదికి మధ్యలో పునర్జీవం తీసుకురావడం అద్భుతమని, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు విజయవంతం అయిందని వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్‌సింగ్ ప్రశంసించారు. కాళేశ్వరం ఫలాలు సంపూర్ణంగా అందేందుకు మరికొంత సమయం పడుతుందని.. నీటివినియోగంలో క్రమశిక్షణ ఉండాలని సూచించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో సోమవారం 'కోయినా జలాలను పశ్చిమ కనుమల నుంచి కృష్ణాబేసిన్‌కు తరలించి వినియోగించడం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన రాజేందర్‌సింగ్ మాట్లాడుతూ.. రెండ్రోజులపాటు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించామని, నిజంగా అద్భుతమని కితాబిచ్చారు. దేశంలోని ఎన్ని రాష్ట్రాలు ఇలాంటి ప్రాజెక్టును నిర్మించగలవు? మహారాష్ట్ర నిర్మిస్తుందా? అని ప్రశ్నించారు. నదీజలాలను మళ్లించడానికి వ్యతిరేకం కాదని, పర్యావరణహితంగా ప్రాజెక్టులను నిర్మించాలని చెప్పారు. మహారాష్ట్రలో కేవలం నాలుగు శాతం భూములు 75శాతం వర్షపు నీటిని వినియోగించుకోవడం చాలా ఆందోళనకరమని, చెరుకు పంటకోసం భారీఎత్తున నీటివినియోగం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో శాస్త్రవేత్తలు ఒకగదిలో ఉండిపోవాల్సి వస్తున్నదని అన్నారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల డిజైన్లలో భాగంగా శాస్త్రవేత్తలు, రైతులతో చర్చించాలని సూచించారు. నేలపై ప్రవహించే నీటి గురించే అందరూ ఆలోచిస్తున్నారని.. భూగర్భజలాలను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జలవనరులకు సంబంధించి గ్రామ పంచాయతీలకు ఉన్న అధికారాలను కేంద్రం లాగేసుకోవడం ఆందోళకరమైన విషయమని చెప్పారు. కోయినా నీటిని మళ్లించడం ద్వారా కృష్ణా నదిలో జలకళ ఉట్టిపడుతుందంటే ఆ మేరకు కచ్చితంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రెండురాష్ట్రాల ప్రయోజనం కోసమే

కృష్ణా బేసిన్‌కు గోదావరిజలాల మళ్లింపు ద్వారా రెండు రాష్ట్రాలకు ప్రయోజనం ఉంటుందని తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్‌రావు అన్నారు. కృష్ణా వరద నీటి ఆధారితంగా నిర్మించిన ప్రాజెక్టులకు భరోసా కల్పించేందుకు రెండురాష్ట్రాలు కలిసి ప్రాజెక్టును చేపడితే వ్యయాన్ని సమానంగా భరించవచ్చని తెలిపారు. కోయినా నీటిని కృష్ణాకు మళ్లించే ప్రతిపాదనపై సాంకేతిక వివరాలను రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ వెంకట్రామారావు సమగ్రంగా వివరించారు. గోదావరి–కావేరి అనుసంధానంపై జాతీయ జల వనరుల సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) రూపొందించిన అలైన్‌మెంట్ తెలంగాణకు ప్రయోజనకరం కాదని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి స్పష్టంచేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (తెలంగాణ స్టేట్‌సెంటర్) అధ్యక్షుడు జీ రామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో గౌరవాధ్యక్షుడు అంజయ్య, ప్రముఖ జియాలజిస్టు సావ్‌కర్, తమిళనాడు నుంచి గురుస్వామి, బీఆర్ పటేల్, రఘునాథ్ పటేల్, నందుగౌడ, రమణనాయక్, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ ఎన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈ నెల 21-22 తేదీల్లో కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన పలు రాష్ట్రాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైన సందర్భంగా తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

భూసేకరణ అవసరం లేకుండా..

మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణంతో భూసేకరణ అవసరం లేకుండానే నీటిని ఎగువకు లిఫ్ట్‌చేసి మధ్య గోదావరికి జలకళ తేవడం అద్భుతం. ఇందుకు తెలంగాణ సీఎం కేసీఆర్‌కు అభినందనలు. సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి దశాబ్దాలు పట్టిన విషయం గతంలో చాలా చూశాం. కానీ కాళేశ్వరాన్ని కేవలం రెండున్నరేండ్లలో పూర్తిచేయడం నిజంగా రికార్డు.

– బీఆర్ పటేల్, పర్యావరణవేత్త

ప్రకృతితో పోరాడటమే

లభ్యత ఉన్న ప్రదేశం నుంచి జలాల్ని మళ్లించి.. ఎండుతున్న నదికి జీవం పోయడమంటే ప్రకృతితో పోరాడటమే. సీఎం కేసీఆర్ ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని ఎంపిక చేయడంలోనే కాదు.. వేలకోట్ల నిధులను సమీకరించడం గొప్ప విషయం.

– రాజేందర్ పొద్దా, కర్ణాటక వాల్మీ డైరెక్టర్

చాలా స్ఫూర్తి పొందాం

కాళేశ్వరం ప్రాజెక్టు మాకు స్ఫూర్తి కలిగించింది. రైతుకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం వేల కోట్లు ఖర్చుచేసి ప్రాజెక్టును నిర్మించడమనేది గొప్ప విషయం.

– పద్మ, తమిళనాడు పీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

హరితహారం అద్భుతం

- అటవీశాతం పెంపునకు చర్యలు భేష్.. తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు
- 'ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'.. పద్మశ్రీ జాదవ్‌పాయెంగ్ ప్రశంసలు
- చెట్లను పెంచకపోతే అనర్థాలని వ్యాఖ్య.. ఎంసీఆర్‌హెచ్చార్డీలో ప్రత్యేక ప్రసంగం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం అద్భుతమని 'ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపుపొందిన పద్మశ్రీ జాదవ్‌పాయెంగ్ కొనియాడారు. సోమవారం ఎంసీఆర్‌హెచ్చార్డీలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అడవుల శాతాన్ని పెంపొందించడంపై దృష్టిసారించడం మంచి విషయమని ప్రశంసించారు. ఇందుకు తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అసోంలోని బ్రహ్మపుత్ర నది ఒడ్డున 550 హెక్టార్లలో అడవిని పెంచేందుకు తనకు దాదాపు 30 ఏండ్లు పట్టిందని చెప్పారు. బ్రహ్మపుత్ర నది కోతకు గురవుతుంటే, పుట్టిన ప్రాంతాన్ని రక్షించుకొనేందుకు జొర్హాట్ జిల్లాలోని కోకిలాముఖ్‌లో 1979 నుంచి ఒక్కో మొక్క నాటానని గుర్తుచేసుకున్నారు. క్రమంగా అటవీ విస్తీర్ణం పెరిగే కొద్దీ, ఏనుగులు, పులులు రావడం మొదలైందని వివరించారు. 2008లో సుమారు వెయ్యి మంది చెట్లను నరుకడానికి వచ్చారని, ముందు తనను చంపాకే చెట్లను నరుకాలని వారిని ఎదుర్కొన్నానని తెలిపారు. పదేండ్ల కింద వందకుపైగా ఏనుగులు అటవీప్రాంతానికి చేరువలోని ఓ గ్రామంపై దాడిచేసినప్పుడే ఈ కృత్రిమ అడవి గురించి ప్రపంచానికి తెలిసిందన్నారు. ప్రస్తుతం ఈ అటవీప్రాంతం దాదాపు 550కి పైగా హెక్టార్లలో విస్తరించిందని, బెంగాల్ టైగర్లు, రైనోలు, వంద రకాల జింకలు, కుందేళ్లు, కోతులు, అనేక రకాల పశుపక్ష్యాదులకు నిలయంగా మారిందని తెలిపారు. సుమారు 300 హెక్టార్లలో వెదురు మొక్కలను పెంచానని వివరించారు.

దేశవిదేశాల్లో సదస్సులు

కృత్రిమంగా అడవిని సృష్టించానని ప్రపంచానికి తెలియడంతో బెల్జియం, స్విట్జర్లాండ్, ప్యారిస్ వంటి అంతర్జాతీయ వేదికల మీద మాట్లాడే అవకాశం లభించిందని జాదవ్‌పాయెంగ్ తెలిపారు. అమెరికాలోని నాసా శాస్త్రవేత్తలు అంతరిక్షంలో ఆక్సిజన్‌పై చర్చించినప్పుడు, అక్కడ కూడా చెట్లను పెంచితే ఆక్సిజన్ లభిస్తుందన్నానని వివరించారు. దేశంలోని ఖాళీప్రాంతాలను అడవులుగా మార్చాలని, ఈ ప్రక్రియను తక్షణమే చేపట్టకపోతే పెనుప్రమాదం తప్పదని హెచ్చరించారు. విదేశాల్లో శాస్త్రవేత్తలు తమ భూభాగాన్ని పరిరక్షించుకొనేందుకు మాతృభూమికి తిరిగొచ్చి సేవచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఎంసీఆర్‌హెచ్చార్డీలో మొక్క నాటారు. కార్యక్రమంలో ఇగ్నైటింగ్ మైండ్స్ ఫౌండర్ కరుణాకర్‌రెడ్డి, రితురాజ్ ఫుకాన్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

సోమవారం ఎంసీఆర్‌హెచ్చార్డీలో మొక్క నాటుతున్న పద్మశ్రీ జాదవ్‌పాయెంగ్

సోమవారం నల్లగొండలో వృద్ధురాలికి చీరె అందించి ఎలా ఉన్నదని అడిగి తెలుసుకుంటున్న మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

మురిసిన ఆడబిడ్డలు

మొదటిపేజీ తరువాయి...

బాగున్నాయంటూ సంతోషాన్ని వ్యక్తంచేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రభుత్వం తరపున రాష్ట్రంలోని ఆడబిడ్డలకు 1.02 కోట్ల చీరెలను అందించనున్నారు. చీరెలను మరమగ్గాలపై తయారు చేయించారు. వరుసగా మూడో ఏట చీరెలను ప్రభుత్వం పంపిణీచేస్తున్నది. హుజూర్‌నగర్ ఉపఎన్నిక నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలోని మహిళలకు చీరెల పంపిణీ తాత్కాలికంగా నిలిపివేశారు. ఎన్నికల అనంతరం పంపిణీ చేయనున్నారు. సోమవారం ఆయా నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు పంపిణీలో పాల్గొన్నారు. నల్లగొండలో జరిగిన కార్యక్రమంలో చేనేత, జౌళి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు ముఖ్య అతిథిగా హాజరై చీరెలను పంపిణీచేశారు. కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సిద్దిపేట, గజ్వేల్‌లో బతుకమ్మ చీరెలను ఆర్థికమంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పంపిణీచేశారు. మహబూబ్‌నగర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వనపర్తిలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అందించారు. ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క, సారలమ్మలకు మంత్రి సత్యవతి రాథోడ్ చీరెలను సమర్పించారు. అనంతరం ములుగులో పంపిణీచేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జనగామ జిల్లా దేవరుప్పల, కొడకండ్ల, పాలకుర్తిలో చీరెలను అందించారు. దేవాదాయ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ జిల్లా లక్ష్మణ్‌చాంద మండల కేంద్రంలో చీరెలను పంపిణీచేశారు.

మహిళలకు చిరు కానుక: కేటీఆర్

బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఒక పెద్దన్నలా, ఆప్తుడిలా అందిస్తున్న బతుకమ్మ చీరెల పంపిణీ మహిళలందరికీ చిరుకానుక మాత్రమేనని మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం నల్లగొండలోని వ్యవసాయమార్కెట్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి చీరెల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో కోటి చీరెల పంపిణీ కార్యక్రమం నల్లగొండ నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉన్నదన్నారు. గతంలో పోచంపల్లిలో ఏడుగురు నేత కార్మికులు బలవన్మరణానికి పాల్పడితే నాటి ప్రభుత్వం పట్టించుకోలేదని, ఆనాడు ఉద్యమ నేతగా ఉన్న కేసీఆర్.. జోలెపట్టి భిక్షాటన చేసి ఒక్కొక్క కుటుంబానికి రూ.50వేల చొప్పున అందించారని గుర్తుచేశారు. కేసీఆర్ కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో సిరిసిల్లలో ఎనిమిదిమంది నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే నేత కార్మికులకు జీవనోపాధి కల్పించి, ధైర్యం నింపాలని ఆనాడే నిర్ణయించుకున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ చీరెలు, బడిపిల్లల యూనిఫారాలు, కేసీఆర్ కిట్ ద్వారా అందిస్తున్న నేతవస్త్రాలు స్వయంగా ప్రభుత్వమే కొనుగోలుచేసి నేత కార్మికులకు భరోసా కల్పిస్తున్నదని చెప్పారు. బతుకమ్మ చీరెల తయారీద్వారా చేనేత కార్మికులు మెరుగైన జీవనోపాధి పొందుతున్నారన్నారు. నెలకు ఏడెనిమిది వేల రూపాయలుగా ఉన్న ఆదాయం.. ఇప్పుడు 15–20 వేల రూపాయలకు పెరిగిందని చెప్పారు. భవిష్యత్తులో సింగరేణి, ఆర్టీసీ సంస్థలతో మాట్లాడి, వాటి యూనిఫారాలకు వస్త్రం తయారీ పని కూడా నేతన్నలకే అప్పజెప్తామన్నారు. నేత కార్మికులను ఆదుకునేందుకు 50% సబ్సిడీతో నూలు, రసాయనాలు, ఇతర ముడిసరుకులు అందిస్తున్నామని తెలిపారు. త్రిఫ్ట్ సొసైటీ పేరుతో చేనేత, టెక్స్‌టైల్స్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్స్‌ను ప్రారంభించి నేతన్నలకు అండగా ఉన్నామని చెప్పారు. బతుకమ్మ చీరెలను నేతన్నలు చాలా కష్టపడి, మంచి డిజైన్లతో చక్కగా రూపొందించారని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరిస్తే నేతన్నలకు జీవనోపాధి కల్పించి నవాళ్లం అవుతామని కేటీఆర్ అన్నారు. చేనేత కార్మికులు నేసిన వస్త్రాలు కొనుగోలుచేసి, వారికి మరింత ఉపాధి ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం అధికారులందరూ చేనేత వస్త్రాలను ధరించాలని సూచించినట్లు తెలిపారు. ప్రభుత్వం సూచనలతో అధికారులతోపాటు నాయకులు సైతం చేనేత వస్త్రాలను ధరించడం సంతోషకరమని మిగిలినవారంతా ఈ పద్ధతిని పాటించాలని కోరారు. త్వరలో రూ.35 కోట్లతో ఉదయ సముద్రం రిజర్వాయర్ మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణాన్ని చేపడుతామని మంత్రి కేటీఆర్ చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నల్లగొండ జిల్లాపై అమితమైన ప్రేమ ఉన్నదని, అందుకే నల్లగొండ, సూర్యాపేటలో మెడికల్ కళాశాలలు, యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎయిమ్స్ వచ్చాయని, తిరుమల తిరుపతికి దీటుగా యాదాద్రి ఆలయాన్ని పునరుద్ధరిస్తున్నారని తెలిపారు.

నల్లగొండ నుంచే బతుకమ్మ చీరె, మిషన్ భగీరథ: మంత్రి జగదీశ్‌రెడ్డి

బతుకమ్మ చీరెల పంపిణీ ఆలోచన ప్రారంభమైంది నల్లగొండలోనేనని మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీరందించాలనే ఆలోచన కూడా నల్లగొండ జిల్లాలోనే ప్రారంభమైందని గుర్తుచేశారు. బతుకమ్మ చీరెల పంపిణీ భూదాన్‌పోచంపల్లిలో పురుడు పోసుకున్నదని, కేసీఆర్ ఉద్యమనాయకుడిగా గ్రామగ్రామాన పర్యటించి నిద్రచేసినప్పుడు.. చేనేత కార్మికుల సమస్యలు స్వయంగా తెలుసుకుని వారిని ఆదుకునేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు సురక్షిత మంచినీరు అందించేందుకు చౌటుప్పల్‌లో పైలాన్ నిర్మించి, ఇంటింటికీ నీరందించే కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. తెలంగాణ ప్రజల బాధలు తెలిసిన తండ్రి, కొడుకు నిత్యం తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి చెప్పారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఎవరూ అడుగలేదని, హాస్టళ్లకు సన్నబియ్యం ఎన్నికల కోసం చేపట్టిందికాదని స్పష్టంచేశారు. ఎన్నికలు, రాజకీయాలతో సంబంధం లేకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజారామయ్యర్, కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తేర చిన్నపరెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ పూజర్ల శంభయ్య, ఐసీడీఎస్ ఆర్వో మాలే శరణ్యారెడ్డి, నాయకులు తిప్పన విజయసింహారెడ్డి, జేసీ చంద్రశేఖర్, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌటుప్పల్ మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలి

- పార్టీ శ్రేణులకు మంత్రి కేటీఆర్ పిలుపు
- చౌటుప్పల్‌లో ఘనస్వాగతం పలికిన నాయకులు

సోమవారం చౌటుప్పల్‌లో టీఆర్‌ఎస్ నాయకులతో కరచాలనం చేస్తున్న మంత్రి కేటీఆర్

చౌటుప్పల్, నమస్తే తెలంగాణ: చౌటుప్పల్ మున్సిపాలిటీని భారీ మెజారిటీతో కైవసం చేసుకోవాలని ఐటీ, మున్సిపల్‌శాఖల మంత్రి, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండకు వెళ్తున్న మంత్రి కేటీఆర్‌కు మార్గమధ్యంలో చౌటుప్పల్ వద్ద టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రజాసంక్షేమ పథకాలే టీఆర్‌ఎస్ అభ్యర్థులకు కొండంత బలమన్నారు. ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు రాబట్టాలని చెప్పారు. సమిష్టిగా పనిచేస్తే మున్సిపాలిటీని కైవసం చేసుకోవడం నల్లేరుమీద నడకేనని అన్నారు. కేటీఆర్‌కు స్వాగతం పలికినవారిలో ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గిర్కంటి నిరంజన్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు ముటుకుల్లోజు దయాకరాచారి, మున్సిపాలిటీ కన్వీనర్ ఊడుగు శ్రీనివాస్‌గౌడ్, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు చింతల దామోదర్‌రెడ్డి, ముప్పిడి శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బొడ్డు రేవతి శ్రీనివాస్‌రెడ్డి, ఊడుగు మల్లేశ్‌గౌడ్, గుండబోయిన అయోధ్యయాదవ్, బొమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎండీ ఇబ్రహీం, బొడిగె బాలకృష్ణగౌడ్, తాడూరి పరమేశ్ తదితరులు ఉన్నారు.

విశ్వేశ్వరయ్యభవన్‌లో ఐఈఐ సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కాళేశ్వరం.. ఇంజినీర్ల ప్రతిభకు ప్రతీక

- ఐఈఐ సదస్సులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఖైరతాబాద్: దేశంలోనే ప్రముఖమైనదిగా విరాజిల్లుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ల ప్రతిభకు ప్రతీకగా నిలుస్తున్నదని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆటోమేషన్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్' అనే అంశంపై సోమవారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో జరిగిన సదస్సును మంత్రితోపాటు డీఆర్డీవో శాస్త్రవేత్త డాక్టర్ వై శ్రీనివాస్‌రావు, ఐఈఐ చైర్మన్ డాక్టర్ జీ రామేశ్వర్‌రావు జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఇంజినీర్ల పాత్ర వెలకట్టలేనిదని, రాష్ట్రాభివృద్ధిలోనూ వారి భాగస్వామ్యం ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొంటున్న సీఎం కేసీఆర్.. ప్రాజెక్టుల రూపకల్పనకు ఇంజినీర్లతో మమేకమై వారికి తగిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నారన్నారు.

KALOJI NARAYANA RAO
UNIVERSITY OF HEALTH SCIENCES
TELANGANA STATE

NOTIFICATION FOR M.Sc (N) & MPT ADMISSIONS

Applications online are invited from the eligible candidates for admission into M.Sc (Nursing) and MPT courses for 2019-20 in Colleges affiliated to KNRUHS under Competent Authority Quota through website http://tspgparamed.tsche.in from 24-9-2019 to 30 -9-2019.
For details visit :
http://knruhs.in / http://knruhs.telangana.gov.in
Dated: 23-09-2019 REGISTRAR

KALOJI NARAYANA RAO
UNIVERSITY OF HEALTH SCIENCES
TELANGANA STATE

NOTIFICATION MD AYUSH COURSES ADMISSIONS

Applications online are invited from the eligible candidates for admission into MD (AYURVEDA), MD (HOMEOPATHY) & MD (UNANI) courses for 2019-20 in Colleges affiliated to KNRUHS under Competent Authority Quota through website http://tspgparamed.tsche.in from 24-9-2019 to 30 -9-2019.
For details visit :
http://knruhs.in / http://knruhs.telangana.gov.in
Dated: 23-09-2019 REGISTRAR

సుప్రీంకోర్టు నూతన జడ్జీల ప్రమాణం

నలుగురితో ప్రమాణం చేయించిన సీజేఐ గొగోయ్.. 34కు పెరిగిన జడ్జీల సంఖ్య

జస్టిస్‌లు కృష్ణ మురారి, ఎస్ రవీంద్ర భట్, రిషికేష్ రాయ్, వీ రామసుబ్రమణియన్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టుకు నూతనంగా నియమితులైన జస్టిస్‌లు కృష్ణ మురారి, ఎస్ రవీంద్ర భట్, వీ రామసుబ్రమణియన్, రిషికేశ్ రాయ్ సోమవారం ప్రమాణం చేశారు. సుప్రీంకోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ రంజన్ గొగోయ్ వారితో ప్రమాణం చేయించారు. దీంతో అత్యున్నత న్యాయస్థానంలో సీజేఐ సహా న్యాయమూర్తుల సంఖ్య 34కు పెరిగింది. సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతున్నదని, వెంటనే న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలని ఇటీవల సీజేఐ గొగోయ్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. దీనికి కేంద్రం అనుమతించడంతో సుప్రీంకోర్టు కొలీజియం అనేక వడపోతల అనంతరం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేస్తున్న వారి పేర్లను గతనెల 30న కేంద్రానికి సిఫార్సు చేసింది. ఆ ప్రతిపాదనలకు కేంద్రం బుధవారం ఆమోదముద్ర వేసింది. మరోవైపు, కర్ణాటకలో ఇటీవల అనర్హత వే టుకు గురైన 17 మంది ఎమ్మెల్యేలు స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ నెల 25న వాదనలు వింటామని పేర్కొంది.

లవాసా భార్యకు ఐటీ నోటీసులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: కేంద్ర ఎన్నికల కమిషనర్లలో ఒకరైన అశోక్ లవాసా భార్య నోవెల్ సింఘాల్‌కు ఆదాయం పన్ను (ఐటీ) శాఖ సోమవారం నోటీసులు జారీ చేసింది. 2015-17 మధ్య పలు కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్న నోవెల్ పన్ను ఎగవేతకు పాల్పడ్డారని భావిస్తున్నట్లు ఐటీ శాఖ వర్గాల కథనం. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మోదీ, అమిత్‌షా కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని వచ్చిన ఫిర్యాదులపై ఈసీ క్లీన్ చిట్ ఇవ్వడంపై లవాసా అసమ్మతి వ్యక్తం చేశారు.

సెనేటర్ భార్యకు క్షమాపణలు చెప్పిన మోదీ!

- పుట్టినరోజున ఆమె భర్త కార్నీ తనతో ఉన్నందుకు క్షమించాలన్న ప్రధాని
- 'హౌడీ మోదీ' సభలో ఆసక్తికర సంఘటన

హ్యూస్టన్: అమెరికాలోని హ్యూస్టన్ వేదికగా ఆదివారం అట్టహాసంగా జరిగిన 'హౌడీ మోదీ' కార్యక్రమంలో ఓ ఆసక్తికర సంఘటన చోటుచేసుకున్నది. సెనేటర్ జాన్ కార్నీ సతీమణి శాండీకి ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణలు చెప్పారు. యాదృచ్ఛికంగా ఆమె పుట్టిన రోజునాడే 'హౌడీ మోదీ' కార్యక్రమం నిర్వహించినప్పటికీ.. ఆ దంపతులిద్దరూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శాండీతో ప్రధాని మాట్లాడుతూ.. 'ఇవాళ మీ జన్మదినం కాబట్టి నేను మీకు క్షమాపణ చెబుతున్నాను. మీ జీవిత భాగస్వామి ఇవాళ నాతో ఉన్నందుకు మీకు సహజంగానే ఇబ్బందిగా ఉంటుంది' అని పేర్కొన్నారు. దీంతో మోదీ పక్కనే నిలబడి ఉన్న 67 ఏండ్ల సెనేటర్ కార్నీ నవ్వులు చిందించారు. ఈ వీడియోను ప్రధాన మంత్రి కార్యాలయం ట్విట్టర్‌లో పోస్టు చేసింది.

ప్రధాని మోదీతో సెనేటర్ జాన్ కార్నీ

మొబైల్ యాప్‌తో జనగణన!

- 2021లో దేశ జనాభాను లెక్కించడంలో డిజిటల్ పరిజ్ఞానం వినియోగం
- మున్సిపల్ వార్డులు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధులపై మరింత స్పష్టత వచ్చే అవకాశం
- ఆధార్, పాస్‌పోర్ట్, లైసెన్స్, ఓటరు కార్డు స్థానంలో ఒకే గుర్తింపు కార్డు
- సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని బహుళ ప్రయోజనాల కోసమే..
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడి

ఢిల్లీలో ఆర్జీఐ భవనం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా, హోంశాఖ కార్యదర్శి అజయ్‌కుమార్, జనగణన కమిషనర్ వివేక్ జోషి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: 2021లో నిర్వహించే జనగణనలో తొలిసారిగా డిజిటల్ సాంకేతికతను వినియోగించనున్నట్టు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. ఒక ప్రత్యేకమైన మొబైల్ యాప్ ద్వారా దేశ జనాభాను లెక్కించనున్నట్టు ఆయన చెప్పారు. జనగణనలో పెన్ను, కాగితం వినియోగం నుంచి మొబైల్ యాప్ దిశగా దేశం పరివర్తన చెందుతున్నదని, జనాభా లెక్కల కార్యక్రమంలో ఇదో గొప్ప విప్లవమని ఆయన అభివర్ణించారు. మరోవైపు, దేశ ప్రజానీకానికి బహుళ ప్రయోజనాలను అందించే విధంగా ఒకే గుర్తింపు కార్డును కూడా తీసుకొచ్చే యోచనలో ఉన్నామని పేర్కొన్నారు. ఢిల్లీలో సోమవారం జరిగిన రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(ఆర్జీఐ) కొత్త భవనం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వివరాలు వెల్లడించారు. 'వివిధ అవసరాలకు వాడుతున్న ఆధార్, పాస్‌పోర్ట్, బ్యాంకు ఖాతా, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు కార్డు స్థానంలో ఒకే గుర్తింపు కార్డు ఎందుకు ఉండకూడదు? బహుళ ప్రయోజనాల కోసం ఉపయోగించే మొత్తం సమాచారం.. ఒకే కార్డులో నిక్షిప్తం చేసే వ్యవస్థ ఉండాలి. ఇది చాలా శక్తివంతమైనది. దీని కోసం డిజిటల్ జనగణన ఎంతో ముఖ్యం' అని అన్నారు. 2021లో నిర్వహించే జనాభా లెక్కల కోసం.. మార్చి 1, 2021ను గడువు తేదీగా తీసుకుంటారు. పర్వత ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో మాత్రం అక్టోబర్ 1, 2020ను గడువు తేదీగా పరిగణనలోకి తీసుకుంటారు. 16 భాషల్లో నిర్వహించే ఈ జనగణనకు సుమారు 12 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చుచేయనున్నది. 'దేశంలో ఉన్న 130 కోట్ల మంది ప్రజానీకానికి డిజిటల్ జనగణన వల్ల కలిగే లాభాల్ని తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, భవిష్యత్తు ప్రణాళిక కోసం జనాభా సమాచారం ఎలా సాయపడుతుందో వాళ్లకు వివరించాలి. డిజిటల్ జనాభా సమాచారం దేశ పురోగతికి గొప్ప సహకారం అందిస్తుంది' అని అమిత్ షా అన్నారు. డిజిటల్ జనగణన వల్ల మున్సిపల్ వార్డులు. అసెంబ్లీ, లోక్‌సభ నియోజక వర్గాల పరిధులను కూడా సులభంగా గుర్తించవచ్చని చెప్పారు. ఎవరైనా పౌరుడు చనిపోతే, ఆ వివరాల్ని వెంటనే జనాభా పట్టికలో నమోదు చేసే వ్యవస్థ కూడా ఉండాలని అన్నారు. జనగణనను చేపట్టే అధికారులు ఈ పనిని అత్యంత శ్రద్ధ, నిబద్ధతతో చేయాలని, జాతి నిర్మాణం కోసం ఇదో గొప్ప పుణ్య కార్యంగా భావించాలని హోంమంత్రి సూచించారు.

2011 లెక్కల ప్రకారం..22 పథకాలు

గత ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాల్ని సరైన ప్రణాళిక లేకుండా.. మొక్కుబడిగా నిర్వహించేవని అమిత్ షా దుయ్యబట్టారు. నరేంద్ర మోదీ 2014లో ప్రధాని అయ్యాక, పరిపాలన విధానమే మారిందని, అప్పటివరకూ పాదుకొని ఉన్న సమస్యల్ని తరిమేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని అన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. మోదీ సర్కారు 22 సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టినట్టు గుర్తుచేశారు. ప్రతీ ఇంటికి విద్యుత్, గ్యాస్ కనెక్షన్, పేదలకు గృహ వసతి, మరుగుదొడ్లు, బ్యాంకు ఖాతాలు, రహదారుల నిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. 2011 జనాభా లెక్కల ద్వారా కొన్ని రాష్ట్రాల్లో లింగ వ్యత్యాసం అధికంగా ఉన్నదని తాము గమనించామని.. అందుకే 'బేటీ బచావో, బేటీ పడావో' కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. ప్రపంచ జనాభాలో దేశ జనాభా 17.5 శాతమని, భూభాగం మాత్రం 2.4 శాతం మాత్రమేనని పేర్కొన్నారు. 'జనాభాతో పోల్చి చూస్తే దేశంలో సహజ వనరులు పరిమితం. ఈ వ్యత్యాసాన్ని పూడ్చాలంటే మనం మరింత ఎక్కువగా కష్టపడాలి' అని ప్రజలకు అమిత్ షా పిలుపునిచ్చారు. డిజిటల్ జనగణనతో పాటు గుర్తింపు కార్డులను మంజూరు చేయడానికి ప్రాతిపదికగా తీసుకుంటున్న జాతీయ జనాభా జాబితా (ఎన్పీఆర్)ను కూడా అమలు చేయనున్నట్టు షా స్పష్టం చేశారు. ఎన్పీఆర్ అనేది అసోంలో నిర్వహించిన ఎన్నార్సీకి నమూనా వంటిదని ఆర్జీఐ అధికారులు తెలిపారు.

ఎన్పీఆర్ - డిజిటల్ జనగణన.. తేడా ఏమిటి?

2021 జనగణనలో డిజిటల్ సాంకేతికతతో పాటు ఎన్పీఆర్ సమాచారం కూడా సేకరిస్తామని అమిత్ షా వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో నివసిస్తున్న పౌరుడికి ఏదైనా గుర్తింపు కార్డును మంజూరు చేయాలంటే ఆ వ్యక్తి వివరాలు ఎన్పీఆర్‌లో నమోదై ఉండాలి. ఎన్పీఆర్ సమాచారం సేకరించేటప్పుడు వ్యక్తి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు వంటి వివరాలు అడుగుతారు. డిజిటల్ జనగణనలో ఎన్పీఆర్‌లో సేకరించిన వివరాలతో పాటు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు నెంబరు, మొబైల్ నెంబరు, పాన్‌కార్డు నెంబరు, ఓటరు గుర్తింపు కార్డు నెంబరును కూడా తీసుకుంటారు. అలాగే, గోప్యతా నిబంధనలను డిజిటల్ జనగణనలో పకడ్బందీగా పాటించనున్నారు.

తీహార్ జైలు ఆవరణలోకి కారులో వచ్చిన సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్

తీహార్ జైలులో చిదంబరాన్ని కలిసిన..
సోనియా, మన్మోహన్

కేసును రాజకీయంగా ఎదుర్కోవడంలో అండగా ఉంటామని భరోసా

- ఆయన కస్టడీని కొనసాగించడంపై ఆందోళన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ సోమవారం ఉదయం తీహార్ జైల్లో ఉన్న పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చిదంబరాన్ని కలిశారు. ఆయనను కస్టడీలోనే నిర్బంధించడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో చిదంబరాన్ని ఆగస్టు 21న సీబీఐ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆయనకు కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించగా, ఈ నెల 5న తీహార్ జైలుకు తరలించారు. సోమవారం చిదంబరాన్ని కలిసిన అనంతరం మన్మోహన్‌సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వంలో ఏ నిర్ణయమైనా ఒక వ్యక్తి మాత్రమే తీసుకోరని, సిఫారసులను ఆమోదించినందుకు ఒక మంత్రిని ఏ విధంగా నేరస్థుడిగా పరిగణిస్తారని ప్రశ్నించారు. ఒక ప్రతిపాదనను ఆమోదించినందుకు మంత్రిని బాధ్యుడిని చేస్తే, దేశంలోని ప్రభుత్వ వ్యవస్థ మొత్తం కుప్పకూలుతుందని పేర్కొన్నారు. చిదంబరాన్ని కస్టడీలోనే నిర్బంధించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసులో న్యాయస్థానాలు న్యాయం అందిస్తాయన్న విశ్వాసం తమకు ఉందన్నారు. ఆరుగురు కార్యదర్శులు సహా డజను మంది అధికారులు పరిశీలించి, సిఫార్సు చేసిన ప్రతిపాదనను ఒక మంత్రిగా చిదంబరం ఆమోదించారని చెప్పారు. అంతకుముందు తీహార్ జైల్లో చిదంబరాన్ని కలిసినప్పుడు సోనియా, మన్మోహన్‌తోపాటు చిదంబరం కుమారుడు కార్తీ కూడా ఉన్నారు. కేసును రాజకీయంగా ఎదుర్కోవడంలో చిదంబరానికి పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని సోనియా పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, సోనియా, మన్మోహన్ తనను పరామర్శించడాన్ని గౌరవంగా భావిస్తున్నానని చిదంబరం పేర్కొన్నారు.

మిమ్మల్ని చూసి గర్విస్తున్నా

- ప్రవాస భారతీయులపై టంప్ ప్రశంసల జల్లు

హ్యూస్టన్, సెప్టెంబర్ 23: ప్రవాస భారతీయులను చూసి తాను ఎంతో గర్విస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. అమెరికా అభివృద్ధిలో వారు గొప్ప పాత్రను పోషించారని కొనియాడారు. ఆదివారం టెక్సాస్ రాష్ట్రంలోని హ్యూస్టన్‌లో నిర్వహించిన 'హౌడీ-మోదీ' కార్యక్రమానికి ట్రంప్ హాజరైన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో.. ప్రవాస భారతీయులను ప్రసన్నం చేసుకునేందుకు ట్రంప్ ప్రయత్నించారు. 'హౌడీ-మోదీ'ని చారిత్రాత్మక సభగా అభివర్ణించారు. అమెరికావ్యాప్తంగా ఉన్న దాదాపు 40 లక్షల మంది ప్రవాస భారతీయులకు కృతజ్ఞతలు తెలిపారు. 'మీరంతా కష్టపడి పనిచేస్తారు. మీరు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ, దేశాభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. వైద్యం, సాంకేతిక రంగాల్లో కొత్త టెక్నాలజీతో ప్రపంచాన్ని ఆశ్చర్య పరుస్తున్నారు. వేలాది ఉద్యోగాలను సృష్టిస్తున్నారు. అమెరికా సంస్కృతిని, విలువలను సుసంపన్నం చేశారు. మీరు అమెరికన్లయినందుకు నేను నిజంగా చాలా గర్విస్తున్నా' అని పేర్కొన్నారు. తనను మించిన నిజమైన స్నేహితుడు భారత్‌కు మరొకరు లేరని ట్రంప్ వ్యాఖ్యానించారు. టెక్సాస్‌లో దాదాపు ఐదు లక్షల మంది ప్రవాస భారతీయులు ఉన్నట్టు అంచనా.

అంతా బాగు.. ఎక్కడ?

భారత్‌లో అంతా బాగుందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై విమర్శలు

- ఆరేండ్ల కనిష్ఠానికి దిగజారిన జీడీపీ వృద్ధిరేటు
- 45 ఏండ్ల గరిష్ఠానికి నిరుద్యోగం
- ప్రైవేట్ పెట్టుబడుల్లో తీవ్ర క్షీణత
- స్పష్టం చేస్తున్న గణాంకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: 'భారత్‌లో అంతా బాగుంది' అని అమెరికాలోని హ్యూస్టన్‌లో 'హౌడీ మోదీ' వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాని వ్యాఖ్యలకు విరుద్ధంగా దేశ ఆర్థిక పరిస్థితి ఉందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. దేశంలో జీడీపీ వృద్ధిరేటు ఆరేండ్ల కనిష్ఠానికి పడిపోయిందని, నిరుద్యోగం 45 ఏండ్ల గరిష్ఠానికి చేరిందని గుర్తుచేస్తున్నారు. ప్రైవేట్ పెట్టుబడులు క్షీణించాయని, ద్రవ్యోల్బణం పెరిగిందని చెబుతున్నారు.

15 ఏండ్ల కనిష్ఠానికి ప్రైవేట్ పెట్టుబడులు

ప్రైవేటు పెట్టుబడులు వేగంగా క్షీణిస్తున్నాయి. జూలైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ముందు సీఎంఐఈ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2019 జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు 15 ఏండ్ల కనిష్ఠానికి చేరాయి. ఆ త్రైమాసికంలో భారత కంపెనీలు రూ.43,400 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రకటించాయి. 2019 మార్చితో పోలిస్తే ఇది 81 శాతం తక్కువ. అంతకుముందు ఏడాది అదే వ్యవధితో పోలిస్తే 87 శాతం తక్కువ. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కార్పొరేట్ పన్నును భారీగా తగ్గిస్తూ గత శుక్రవారం అనూహ్య ప్రకటన చేశారు. దీనిపై మార్కెట్లు కూడా సానుకూలంగా స్పందించాయి. దీని వల్ల పెట్టుబడులు పెరుగుతాయని, పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తున్నది.

ఆదాయం తగ్గింది.. ద్రవ్యోల్బణం పెరిగింది..

సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (సీఎస్‌వో) విడుదల చేసిన జీడీపీ వివరాల ప్రకారం.. 2019 జూన్ త్రైమాసికానికి ప్రైవేట్ వినిమయ వ్యయం 18 త్రైమాసికాల కనిష్ఠానికి.. 3.1 శాతానికి చేరింది. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో వినిమయ క్షీణత ఆందోళకరంగా ఉన్నది. వినిమయంలో తగ్గుదల, వ్యక్తుల ఆదాయానికి ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి విధాన నిర్ణయాలే ప్రస్తుత పరిస్థితికి కారణమని చాలా మంది నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత 40 లక్షల నుంచి నాలుగు కోట్ల వరకు ఉద్యోగాలు పోయాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఒకవైపు ఆదాయంలో తగ్గుదల ఉండగా, మరోవైపు ద్రవ్యోల్బణం పైపైకి వెళ్తున్నది. రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో పదినెలల గరిష్ఠానికి.. 3.21 శాతానికి చేరింది. రిటైల్ ద్రవోల్బణం అనేది సామాన్యుడిపై నేరుగా ప్రభావం చూపుతుంది.

అధోముఖంలో జీడీపీ

ప్రస్తుతం జీడీపీ వృద్ధిరేటు ఆరేండ్ల కనిష్ఠానికి.. 5 శాతానికి చేరింది. ఆర్థిక మాంద్యం తాలూకు ముందస్తు సూచనలు కనిపిస్తున్నాయి. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో వరుసగా రెండుసార్లు 5 శాతం కంటే తక్కువగా జీడీపీ వృద్ధిరేటు నమోదైన నేపథ్యంలో, 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మన్మోహన్ హయాంలో ఆర్థిక రంగం విధాన పక్షవాతానికి నిదర్శనంగా నిలిచిందని బీజేపీ నేతలు అప్పట్లో విమర్శించేవారు. అయితే ఇప్పుడు మళ్లీ అవే పరిస్థితులు పునరావృతయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2012-13 కి ముందు జీడీపీ వృద్ధిరేటు 5 శాతానికంటే దిగువకు పడిపోవడం 1980లలోనే చోటుచేసుకుంది.

ఉద్యోగమో.. రామచంద్రా..

లోక్‌సభ ఎన్నికల అనంతరం గత మేలో కేంద్ర కార్మిక శాఖ వెలువరించిన నివేదిక ప్రకారం.. దేశంలో నిరుద్యోగిత రేటు 45 ఏండ్ల గరిష్ఠానికి చేరింది. ఎన్నికలకు ముందు లీకైన నివేదికలో పేర్కొన్న గణాంకాలను ఇది ధ్రువీకరించింది. దేశంలో నిరుద్యోగంపై వాస్తవాలను కేంద్ర ప్రభుత్వం దాచిపెడుతున్నదని ఆ నివేదిక ఆధారంగా ప్రతిపక్షాలు అప్పట్లో ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. కేంద్రం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. పట్టణ ప్రాంతాల్లో 7.8 శాతం మంది యువత నిరుద్యోగులుగా మిగిలారు. అదే గ్రామీణ ప్రాంతాల్లో ఇది 5.3 శాతంగా ఉన్నది. మొత్తంగా 2017-18లో నిరుద్యోగిత రేటు 6.1 శాతంగా ఉంది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) వివరాల ప్రకారం.. 2017 జూలైలో నిరుద్యోగిత రేటు 3.4 శాతంగా ఉంది. ఆగస్టు 25తో ముగిసిన వారానికి అది 9 శాతానికిపైగా చేరింది.



ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో జాప్యం.. పెరుగుతున్న వ్యయం

గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌పీఐ) వెలువరించిన నివేదిక ప్రాజెక్టుల అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నది. ఎంఎస్‌పీఐ మొత్తం 1,623 ప్రాజెక్టులను పర్యవేక్షిస్తున్నది. ఇందులో 361 ప్రాజెక్టుల వ్యయం 496 రెట్లు పెరిగింది. జాప్యం ఇతర కారణాల వల్ల రూ.3.77 లక్షల కోట్ల మేర వ్యయం పెరిగిందని నివేదిక వెల్లడించింది.

అమెరికా ఎన్నికల్లో జోక్యం తగునా!

- ట్రంప్‌కు మోదీ మద్దతుపై భిన్నాభిప్రాయాలు
- విదేశాంగ విధానానికి విరుద్ధమన్న కాంగ్రెస్

ఆనంద్‌శర్మ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: వచ్చే ఏడాది జరుగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థిత్వానికి ప్రధాని మోదీ మద్దతు తెలుపడం వ్యూహాత్మకంగా భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం పడుతుందా అన్న అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోసారి ట్రంప్ గెలిస్తే ఫరవాలేదు.. కానీ ఓడితే.. ఆ తదుపరి అధికారంలోకి వచ్చే డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షుడితో సంబంధాలను పునరుద్ధరించుకోవడం అంత సులభం కాకపోవచ్చని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అమెరికాలోని హ్యూస్టన్ నగరంలో ఆదివారం జరిగిన 'హౌడీ మోదీ' సభలో మాట్లాడిన ప్రధాని మోదీ.. 'అబ్‌కీ బార్ ట్రంప్ సర్కార్' అంటూ బహిరంగంగా అమెరికా అధ్యక్షుడికి ప్రచారం చేయడం ద్వారా ఆ దేశ రాజకీయాల్లో ప్రత్యక్ష జోక్యం చేసుకున్నారని, ఇది భారత విదేశాంగ విధానానికి విరుద్ధమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతానికి డెమోక్రాట్ అభ్యర్థులలో ట్రంప్‌కు గట్టి పోటీనిచ్చేవారు ఎవరూ కనిపించడం లేదు. అందువల్ల ట్రంప్ రెండోసారి గెలిస్తే భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మునుపటి కన్నా మరింత బలోపేతం కావచ్చు. కానీ భారత్‌లాగా అమెరికాలో కూడా రాజకీయాలు ఎప్పుడూ స్థిరంగా ఉండవు. అందుకే విదేశీ నేతలు ఎవరూ అమెరికా రాజకీయాలలో జోక్యం చేసుకోవడానికి సాహసించరు. ఎన్నికలు జరుగడానికి ఇంకా ఏడాది కాలం మిగిలి ఉన్న నేపథ్యంలో పరిస్థితులు మారి డెమోక్రాట్లు అధికారానికి వస్తే మోదీ తీవ్ర ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉభయ దేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటే అందుకు మోదీ తనను తాను నిందించుకోవాల్సి ఉంటుంది. ఇటీవల జరిగిన ఇజ్రాయెల్ ఎన్నికల్లో మోదీకి అత్యంత ఆప్తుడైన నెతన్యాహు ఓడిన సంగతి తెలిసిందే.

ద్వైపాక్షిక సంబంధాలకు విఘాతం: కాంగ్రెస్

హౌడీ మోదీ సభలో ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతుగా ప్రచారం చేయడం ద్వారా ఇతర దేశాల రాజకీయాలలో జోక్యం చేసుకున్నారని, భారత విదేశాంగ విధానాన్ని ఉల్లంఘించారని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ప్రధాని తన పక్షపాత వైఖరితో దీర్ఘకాలంగా కొనసాగుతున్న భారత్-అమెరికా వ్యూహాత్మక సంబంధాలకు విఘాతం కలిగించారని పార్టీ సీనియర్ నేత ఆనంద్‌శర్మ ఆరోపించారు.

అసాధారణం, ఆశ్చర్యకరం: లెఫ్ట్

హౌడీ మోదీ సభలో ప్రధాని మోదీ ట్రంప్‌కు మద్దతుగా ప్రచారం చేయడాన్ని వామపక్షాలు విమర్శించాయి. దేశంలో జరిగే ఎన్నికల్లో ప్రచారానికి విదేశీయుడిని ఎన్నడూ అనుమతించలేదని, మోదీ బహిరంగంగా ట్రంప్ కోసం ప్రచారం చేశారని, ఇది ఆశ్చర్యకరం, అసాధారణమైన విషయమని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. మన ప్రధాని ట్రంప్ ఎన్నికల ప్రచారకునిగా మారిపోయారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా వ్యాఖ్యానించారు.

వాతావరణ మార్పులను అరికట్టేందుకు..

ప్రపంచ ఉద్యమం రావాలి

- ఐరాస పర్యావరణ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు
- మాటలు కాదు.. ఇక చేతలు కావాలని స్పష్టీకరణ
- శిలాజేతర ఇంధన లక్ష్యాన్ని 450 గిగావాట్ల వరకు పెంచుతామని వెల్లడి

ఐక్యరాజ్యసమితి: వాతావరణ మార్పులను అరికట్టేందుకు 'ప్రపంచ ప్రజా ఉద్యమం' రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పారిస్ పర్యావరణ ఒప్పందంలో తాము చేసిన వాగ్దానం మేరకు శిలాజేతర ఇంధనం ఉత్పత్తిని 450 గిగావాట్ల వరకు పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుంటామని ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రధానకార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సోమవారం ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ సదస్సులో మోదీ మాట్లాడారు. పర్యావరణ మార్పుల వంటి పెను సవాలును అధిగమించేందుకు ప్రస్తుతం జరుగుతున్న ప్రయత్నాలు చాలవని మోదీ చెప్పారు. 'చర్చలు జరిపే సమయం ముగిసింది. ప్రపంచం ఇక కార్యాచరణను ప్రారంభించాలి' అని స్పష్టం చేశారు. పర్యావరణం విషయంలో పరివర్తనను తీసుకొచ్చే మార్పులు తేవాలంటే ప్రపంచ ప్రజా ఉద్యమం అవసరమని మోదీ పేర్కొన్నారు. 'ఒక టన్ను ప్రచారం కన్నా ఒక ఔన్సు ఆచరణ మిన్న' అన్నదానిని తాము నమ్ముతామని మోదీ చెప్పారు. రవాణా రంగంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెడుతున్నామని, పెట్రోలు, డీజిల్‌లో బయో ఇంధనం మిశ్రమాన్ని పెంచుతున్నామని తెలిపారు. పారిస్ వాతావరణం ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్టు 2017లో ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ సదస్సుకు అనూహ్యంగా హాజరుకావడం గమనార్హం. పారిస్ ఒప్పందం నుంచి తాము వైదొలుగడానికి భారత్, చైనాలే కారణమని ట్రంప్ అప్పట్లో ఆరోపించారు. వాతావరణ మార్పులను అరికట్టే ప్రయత్నంలో భాగంగా 2050 నాటికి కర్బన ఉద్గారాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రయత్నిస్తామని 66 దేశాలు పేర్కొన్నాయని గుటెరస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆరోగ్యం అందరి హక్కు

ఆరోగ్యం అంటే వ్యాధులబారిన పడకుండా ఉండటం కాదని, ఆరోగ్యకరమైన జీవితం అందరి హక్కు అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఐరాస ఆధ్వర్యంలో 'యూనివర్సల్ హెల్త్ కవరేజ్'పై జరిగిన తొలి ఉన్నతస్థాయి సమావేశంలో మోదీ మాట్లాడారు. చౌకగా ఆరోగ్య సంరక్షణను కల్పించడంలో భారత్‌కున్న అనుభవం, సామర్థ్యాన్ని వర్ధమాన దేశాలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తమ దేశంలో అందరికీ ఆరోగ్యాన్ని అందించేందుకు తమ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తున్నదని తెలిపారు. టెలిమెడిసిన్ ద్వారా పలు ఆఫ్రికన్ దేశాలకు కూడా తాము సరసమైన ధరలో ఆరోగ్య సంరక్షణను అందిస్తున్నామని చెప్పారు.

నవతరానికి ద్రోహం చేస్తున్నారు: గ్రేటా

పర్యావరణ హక్కుల కోసం ఉద్యమిస్తున్న బాల కార్యకర్త గ్రేటా థండర్‌బర్గ్ సదస్సులో మాట్లాడుతూ.. నిష్క్రియాపరత్వంతో ప్రపంచ దేశాల నాయకులు తనలాంటి కొత్త తరానికి ద్రోహం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'మీరు నా కలల్ని, నా బాల్యాన్ని మీ ఒట్టి మాటలతో దొంగిలించారు. ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. పర్యావరణ వ్యవస్థలు ధ్వంసమవుతున్నాయి' అని పేర్కొన్నారు.



ఐరాస ఆరోగ్య సదస్సులో ప్రసంగిస్తున్న మోదీ

ఎన్నార్సీలో పేరు లేకున్నా..
హిందువులను బహిష్కరించరు!

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్య

న్యూఢిల్లీ/కోల్‌కతా, సెప్టెంబర్ 23: జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)లో పేరు లేకపోయినా హిందువులను దేశం నుంచి బహిష్కరించరని, ఈ విషయంపై ఆందోళన వద్దని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. ఆదివారం కోల్‌కతాలో జరిగిన సంఘ్, బీజేపీ అంతర్గత సమావేశంలో ఆయన ఈ మేరకు చెప్పినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఆగస్టు 31న విడుదల చేసిన అసోం ఎన్నార్సీ తుది జాబితాలో సుమారు 19 లక్షల మంది ప్రజల పేర్లు గల్లంతైన సంగతి తెలిసిందే. ఇందులో చాలా మంది బెంగాలీ హిందువులు ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో దేశం నుంచి తమను వెళ్లగొడతారేమోనని హిందువులు భయాందోళన చెందడంపై భాగవత్ ఆరా తీసినట్లు తెలిసింది. జాబితాలో పేర్లు లేని హిందువులను కలిసి వారి భయాన్ని పోగొట్టాలని కార్యకర్తలకు ఆయన సూచించినట్లు సమాచారం.



ఎన్నార్సీ పేరుతో భయపెడుతున్నారు: మమత

ఎన్నార్సీ పేరిట బీజేపీ ప్రభుత్వం ప్రజల్ని భయభ్రాంతులకి గురిచేస్తున్నదని పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నార్సీ పేరు చెప్పి తమను దేశం నుంచి ఎక్కడ బహిష్కరిస్తారోనన్న భయంతో ఇప్పటికే రాష్ట్రంలో ఆరుగురు ప్రాణాలు తీసుకున్నట్టు ఆమె తెలిపారు. తమ రాష్ట్రంలో ఎన్నార్సీ ప్రక్రియను ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోనని తేల్చి చెప్పారు. బీజేపీకి అంతగా ఎన్నార్సీని చేపట్టాలని అనిపిస్తే, ఆ పార్టీ అధికారంలో ఉన్న త్రిపురలో ఎన్నార్సీ ప్రక్రియను నిర్వహించాలని, ఆ రాష్ట్ర సీఎం బిప్లబ్ దేబ్ పేరు కూడా ఆ జాబితాలో ఉండదని ఎద్దేవా చేశారు.

జాదవ్ వర్సిటీలో
మళ్లీ ఉద్రిక్తత

- నిరసనలకు ఏబీవీపీ విఫలయత్నం
- మంత్రి సుప్రియోకు క్షమాపణ చెప్పబోనన్న విద్యార్థి బల్లవ్

కోల్‌కతా/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: పశ్చిమ బెంగాల్ కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ పరిధిలో సోమవారం మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 19న కేంద్ర మంత్రి బాబుల్ సుప్రియో రాక సందర్భంగా జరిగిన ఘర్షణలపై నిరసన తెలిపేందుకు భారీ ర్యాలీగా బయలుదేరిన ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు నిలిపివేయగా వారు రాళ్లు రువ్వారు. మరోవైపు నాలుగో గేట్ వద్ద గుమిగూడిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఏబీవీపీకి వ్యతిరేకంగా పోస్టర్లు ప్రదర్శిస్తూ.. నినాదాలతో హోరెత్తించారు. కేంద్రమంత్రి బాబుల్ సుప్రియో జుట్టు పట్టుకుని లాగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దేబాంజన్ బల్లవ్ క్షమాపణ చెప్పబోనని స్పష్టం చేశాడు. తమ పట్ల కేంద్రమంత్రి దురుసుగా ప్రవర్తించారని ఆరోపించాడు.

అభివృద్ధి పథంలో..

సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం పర్సాపూర్‌లో జేసీబీ సాయంతో రోడ్డు మరమ్మతు చేసుకుంటున్న గ్రామస్థులు

- ప్రగతి ప్రణాళికలో దూసుకెళ్తున్న పల్లెలు
- పక్కాగా 30 రోజుల ప్రణాళిక అమలు
- డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక సమస్యలు దూరం
- 18వ రోజు కొనసాగిన పారిశుద్ధ్య పనులు
- ఊరి బాగుకోసం ముందుకొస్తున్న దాతలు

స్వచ్ఛ రాష్ట్రం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన 30 రోజుల ప్రణాళికతో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి. యుద్ధప్రాతిపదికన జరుగుతున్న పనులతో గ్రామాలు పరిశ్రుభంగా మారుతున్నాయి. పల్లెల్లో ప్రధాన సమస్యగా ఉన్న పారిశుద్ధ్యం, డంపింగ్‌యార్డు, శ్మశానవాటి కల ఇబ్బందులు తొలగిపోతున్నాయి. దాతల సాయంతో అభివృద్ధి కార్యక్రమాలు జోరందు కుంటున్నాయి. 18వ రోజైన సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య పనులు కొనసాగాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానికప్రజాప్రతినిధులు ప్రజలతో కలిసి శ్రమదానం కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. 30 రోజుల ప్రణాళిక స్ఫూర్తితో కరీంనగర్ నగరపాలక సంస్థలో 'నేను సైతం నా నగరం కోసం' అనే కార్యక్రమానికి మంత్రి గంగుల కమలాకర్ శ్రీకారం చుట్టారు.

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:

30రోజుల ప్రణాళిక ఊరూరా కొనసాగుతు న్నది. సోమవారం నిజామాబాద్ జెడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు రెంజల్, నిజామా బాద్ రూరల్ మండలాల్లో పర్యటించారు. రెంజల్ మండలంలోని కళ్యాపూర్, సాటా పూర్ గ్రామాల్లో చేపడుతున్న పనులను పరిశీ లించారు. అనంతరం గ్రామస్థులతో కలిసి శ్రమదానంలో పాల్గొన్నారు.
గ్రామాల రూపురేఖలు మార్చేందుకు సీఎం కేసీ ఆర్ 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపట్టా రని వరంగల్ అర్బన్ జెడ్పీచైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. కమలాపూర్ మండలంలోని అంబాల, శ్రీరాములపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్‌తో కలిసి పాల్గొన్నారు. అంబాలలో రోడ్లపై ఉన్న చెత్తను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి తొలగించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిం చాలని పిలుపునిచ్చారు. వీధిదీపాలకు ఆన్ ఆఫ్ పద్ధతిలో స్విచ్చులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సీఎం స్ఫూర్తితో 'నేను సైతం నా నగరం కోసం'

రూ.2 లక్షల చెక్కును నగరపాలక సంస్థ కమిషనర్‌కు అందిస్తున్న మంత్రి గంగుల కమాలాకర్

■ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ ప్రారంభించిన 30రోజుల ప్రణాళిక స్ఫూర్తితో కరీంనగర్ నగరపాలక సంస్థలో 'నేను సైతం నా నగరం కోసం' పేరుతో 10రోజుల స్పెషల్‌డ్రైవ్ చేపట్టనున్నట్టు రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ తెలిపా రు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో ఆయన ఈ కార్యక్రమాన్ని లాంఛనం గా ప్రారంభించారు. ఎమ్మెల్యేగా తన చివరి వేతనం రూ.2 లక్షల చెక్కును నగరపా లకసంస్థ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి అందించారు. నగర కాంట్రాక్టు అసోసియే షన్ కూడా ఈ కార్యక్రమానికి రూ.2 లక్షల విరాళాన్ని ఇచ్చింది. పదిరోజులపాటు కార్యక్రమాలు నిర్వహించేందుకు మంత్రి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిం చారు. మంగళవారం 2కే రన్‌తో ఈ కార్య క్రమానికి శ్రీకారం చుట్టనున్నట్టు మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌ప ర్సన్ విజయ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా వస్తున్న ప్రజలు

ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో పాల్గొనేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రత్యేక అధికా రులు చురుగ్గా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేయి స్తున్నారు. డంపింగ్‌యార్డు, గ్రేవ్ యార్డులకు స్థల పరిశీలనతోపాటు వ్యర్థాల నిర్వహణ, శిథిల భవనాల కూల్చివేత, రోడ్లవెంట మొక్కలు నాటడం, ఇంకుడు గుంతల ఏర్పాటు తది తర కార్యక్రమాలు అన్నిగ్రామాల్లో కొనసా గుతున్నాయి. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం లాలుతండా పంచాయతీలో ప్రగతి పనులను పరిశీలించిన జెడ్పీచైర్మన్ కోరం కనకయ్య మొక్కలు నాటారు. పాల్వంచ మండలంలో డీపీవో ఆశాలత, టేకులపల్లి మండలంలో సుదిమళ్లలో జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సల్మాబాను, మోరంపల్లి బంజర పంచాయతీలో జిల్లా ఉద్యా నవన అధికారి జినుగు మరియన్న ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు.

కలెక్టర్ల ఆకస్మిక తనిఖీలు

గ్రామాల్లో జరుగుతున్న ప్రగతి పనులను కలెక్టర్లు ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలం మేడిపూర్ గ్రామంలో జరుగుతున్న పనులను కలెక్టర్ శ్రీధర్ పరిశీలించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామం లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మొక్కలు నాటారు. పెంచికల్‌పేట మండలం చేడ్వాయి లో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మొక్కలు నా టారు. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్, ఇటి క్యాల, గట్టు మండలాల్లో ప్రజలు పారిశుద్ధ్య పనుల్లో పాల్గొని, మొక్కలు నాటారు. గద్వాల మండల కొత్తపల్లిలో విద్యార్థులు ర్యాలీ నిర్వ హించారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఎక్ మామిడి, కేశంపల్లి, మాదిరెడ్డిపల్లి, నవాబు పేట్, గొల్లగూడ, గంగ్యాడ, ఎల్లకొండ గ్రామ పంచాయతీల్లో కలెక్టర్ మస్రత్ ఖానమ్ ఆయేషా పర్యటించి ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను వెంటనే కూల్చివేయాలని, హరిత

30 రోజుల ప్రణాళికలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కోడూరులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శ్రమదానంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

హారం వందశాతం పూర్తిచేయాలని అధికా రులను ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మీర్‌ఖానపేటలో యువకులతో కలిసి కలెక్టర్ హనుమంతరావు శ్రమదానం చేశారు. గ్రామంలోని పిచ్చిమొక్కలను తొల గించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని 441 గ్రామాల్లో ప్రజలు శ్రమదానం కార్యక్రమం చేపట్టారు. పిచ్చిమొక్కలు తొలగించి, పాడుబ డిన ఇండ్లను పడగొట్టి, బావులను పూడ్చారు. చిన్నచింతకుంట మండలం పెద్దవడ్డెమాన్ గ్రామంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. అధి కారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమిష్టిగా గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్నారు.

డంపింగ్ యార్డులకు స్థలాల గుర్తింపు

గ్రామీణ ప్రాంతాల్లో డంపింగ్ యార్డుల కోసం స్థలాలను గుర్తిస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని గ్రామ పంచాయతీలకు అవసరమైన డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలకు స్థలాల గుర్తింపు పనులకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో ముందుకెళ్తున్నారు. పభుత్వ స్థలాలు అందుబాటులో లేని చోట అవసర మైతే ప్రైవేట్ స్థలాల కొనుగోలుకు ప్రతిపాద నలు సిద్ధంచేశారు. మరుగుదొడ్లు తప్పనిస రిగా వినియోగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కల్లూరు మండలం లింగాల గ్రామంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మొక్కలు నాటా రు. జగిత్యాల జిల్లాలో ముప్పై రోజుల ప్రగతి కార్యక్రమం ఉత్సాహంగా, ఉల్లా సంగా సాగుతున్నది. జగిత్యాల మండలం లోని లక్ష్మీపూర్, పొలాస గ్రామాల్లో కలెక్టర్ డాక్టర్ శరత్ పాల్గొన్నారు. పొలాస గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ బాగుండటంతో గ్రామస్థు లను కలెక్టర్ అభినందించారు. పచ్చదనంపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని లక్ష్మీ పూర్ గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధు లను ఆదేశించారు. ట్రీగార్డులను ఏర్పాటు చేయాలని, నాటిన మొక్కలకు నీరుపోసి కాపా డాలని ఆదేశించారు. అంతకుముందు బీర్పూర్, శకల్ల, పెద్దనక్కలపేట, ఇబ్రహీంన గర్, పొలాస, మాదాపూర్, ఆత్మనగర్ గ్రామా లకు చెందిన సర్పంచ్‌లతో కలెక్టర్ సమీక్షిం చారు. కథలాపూర్ మండలం ఊట్‌పల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మార్క్‌ఫెడ్ వైర్మన్ లోక బాపురెడ్డి పాల్గొన్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. పచ్చదనం-పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కాలేజీ ఆవరణలో విద్యార్థులు పచ్చదనం-పరి శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు.

మేడ్చల్ జిల్లాలో మంత్రి మల్లారెడ్డి పర్యటన

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో మంత్రి చామ కూర మల్లారెడ్డి, కలెక్టర్ డాక్టర్ ఎంవీరెడ్డి ప్రత్యేక కార్యాచరణ పనులు ఊపందుకు న్నాయి. మెదక్ మండలం రాజ్‌పల్లిలో కలె క్టర్ ధర్మారెడ్డి ఆకస్మికంగా పర్యటించి, పనులను పరిశీలించారు. చేగుంట మండలం చందాయిపేట పల్లెప్రగతి పనుల్లో డీపీవో హనోక్ పాల్గొని పారిశుద్ధ్య నిర్వహణపై అవ గాహన కల్పించారు. తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామంలో పల్లెప్రగతి పనులపై ఆర్డీవో శ్యాంప్రకాశ్ గ్రామస్థులకు పలు సూచ నలు చేశారు.

గ్రామాల స్వరూపాలు మారుతున్నాయి

■ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో గ్రామాల స్వరూ పాలు మారుతున్నాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టంచేశారు. సోమవారం దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల మండల కేంద్రాల్లో జరిగిన గ్రామసభల్లో మంత్రి పాల్గొన్నారు. దేవరుప్పుల మండలం సింగ రాజుపల్లిలో మహిళలతోకలిసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్య క్రమాన్ని అమలుచేస్తూ పల్లెలను బాగు చేసు కునే కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. ప్రతిగ్రామంలో ప్రత్యేకంగా స్థలం ఎంపికచేసి పండ్లమొక్కలు పెంచి మంకీఫుడ్ కోర్టులను అభివృద్ధి చేసినప్పుడే కోతులు ఊరిలోకి రాకుండా ఉంటాయని సూచించారు.

సోమవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో మహిళలతో కలిసి శ్రమదానం చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మోరంపల్లి బంజరలో పనులను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన అధికారి మరియన్న

జగిత్యాల జిల్లా పొలాస గ్రామంలో మురుగు కాల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ శరత్

వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామంలో చెత్తను తీసుకెళ్తున్న జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, జిల్లా కలెక్టర్ పీజే పాటిల్

నారాయణపేట జిల్లా మద్దూర్‌లో మొక్కనాటి నీళ్లుపోస్తున్న కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

గ్రామానికో వైకుంఠధామం

సోమవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో శ్మశానవాటిక కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ మమత, ఎంపీడీవో జయశ్రీ, నాయకులు

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయించింది. ఇప్పటికే 3,789 గ్రామాల్లో నిర్మాణాలు పూర్తవ్వగా, మిగిలిన 5,695 గ్రామాల్లో భూములను సేకరించి, పనుల ప్రారంభానికి సిద్ధమవుతున్నారు. ఉపాధి హామీ నిధులు వినియోగించుకునే అవకాశం ఉండటంతో నిధులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పలు గ్రామాల్లో ప్రజలు విరాళాలు ఇవ్వడంతో నిర్మాణాలు తొందరగా పూర్తయ్యేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేస్తున్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

రాష్ట్రంలో పల్లెప్రణాళిక పనులు కొనసాగు తున్నాయి. చేపట్టిన పనులను ప్రాధా న్యతాక్రమంలో పూర్తిచేస్తున్నారు. ఇప్పటివ రకు రాష్ట్రవ్యాప్తంగా 75,372 ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి క్లీన్ చేశారు. 1,17,274 ఎల్ ఈడీ బల్బ్‌లు బిగించారు. 1,10,574 విద్యుత్తు స్తంభాలకు మూడో వైరును ఏర్పాటు చేశారు. హరితహారం కార్యక్ర మంలో భాగంగా మొక్కలను పెద్దసంఖ్యలో నాటుతున్నారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువై పులా నాటిన మొక్కలు కనివిందు చేస్తు న్నాయి. 38,801 కిలోమీటర్ల పరిధిలో 1,08,55,485 మొక్కలను నాటినట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలి పారు. అదేవిధంగా ఇంటింటికి మొక్కల పంపిణీలో భాగంగా ఇప్పటివరకు 5,94,821 లక్ష్మీతులసీ మొక్కలను నాటించారు.

గ్రామాభివృద్ధికి విరాళాల వెల్లువ

- పుట్టిన ఊరి రుణం తీర్చుకుంటున్న ప్రజలు
- జనగామ జిల్లాలో ఒకేరోజు రూ.6.80 లక్షల విరాళాల సేకరణ

జనగామ నమస్తే తెలంగాణ: జనగామ జిల్లాలో సోమవారం మంత్రి పర్యటన సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు భారీగా విరాళాలు అందజేశారు. పాలకుర్తిలో జెడ్పీటీసీ సభ్యుడు పుస్కూరి శ్రీనివాసరావు రూ. లక్ష, జిల్లా పరి షత్ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్ రూ. లక్ష, కొడకొండ్ల మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు కుందూరి వెంకటేశ్వర్‌రెడ్డి రూ. 2 లక్షలు, టీఆ ర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్ రూ.50వేలు, టీఆర్ఎస్ నాయకుడు, కాంట్రాక్టర్ వీరమనేని సోమేశ్వర్‌రావు రూ. 50 వేలు, విస్నూరులో కొడకండ్ల మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు రూ. 50 వేలు, కొడకండ్ల ఎంపీటీసీ యాకయ్య రూ. 10వేలు, గ్రామస్థురాలు మమత రూ.లక్ష నూట పదహార్లు, మసురం వెంకట నారాయణ రూ.25 వేలు, వెంకటరత్నం రూ. 25 వేలు, కొడకండ్ల 1 ఎంపీటీసీ కుందూరి విజయలక్ష్మీ అమరేందర్‌రెడ్డి తన గౌరవ వేతనం మొత్తాన్ని (నెలకు రూ. ఐదు వేల చొప్పున) ఐదేళ్ల వరకు విరాళంగా ప్రకటిం చారు. అదేవిధంగా జనగామ మండలం సిద్దెంకి గ్రామానికి చెందిన ముత్తడి చంద్రశేఖ ర్‌రెడ్డి రూ.10వేలు, ఎర్రగొల్లపహాడ్‌వాసి జగ న్మోహన్‌రెడ్డి రూ.10 వేలు విరాళమిచ్చారు.

ఎకరం భూమి దానమిచ్చిన సర్పంచ్

భీంపూర్: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కొత్త పంచాయతీ ఇందూర్‌పల్లి ఏక గ్రీవ సర్పంచ్ టేకాం దాదారావు గ్రామాభి వృద్ధి కోసం ఎకరం భూమిని విరాళంగా ప్రక టించారు. సోమవారం గ్రామప్రణాళిక కార్య క్రమంలో పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ.. వైకుంఠధామం, డంప్‌యార్డుకు ఈ భూమిని వినియోగించుకోవాలని కోరారు. భూమి విరాళమిచ్చిన సర్పంచ్‌ను ఎంపీపీ రత్నప్రభ, జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీడీవో దిలీప్‌కుమార్ అభినందించారు.

సోమవారం జనగామ జిల్లా కొడకండ్లలో రూ. లక్ష నూట పదహార్లు విరాళంగా అందజేస్తున్న గ్రామస్థురాలు మసురం మమత

సీఎం ఆలోచనతో పల్లెలు మారుతున్నయి

సీఎం కేసీఆర్ ఆలోచనలతోగ్రామాల స్వరూపం మారుతున్నది. అధికారులు, ప్రజాప్రతినిధులు, యువకులు స్వచ్ఛం దంగా శ్రమదానంలో పాల్గొంటుండ టంతో గ్రామాలు పరిశుభ్రంగా తయారవుతున్నాయి గ్రామాల్లో వ్యాధు లు దూరమవుతున్నాయి. రోడ్లకిరువై పులా మొక్కలతో గ్రామాలు పచ్చగా మారుతున్నాయి.

-పుప్పాల సంతోష్, దహెగాం, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా

30 రోజుల ప్రణాళిక మంచి నిర్ణయం

30 రోజుల ప్రణాళిక పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో గ్రామాలు సంపూర్ణ పారిశుద్ధ్యంతో కళకళలాడుతు న్నాయి. చాలాగ్రామాల్లో మురుగుకాల్వ లన్నీ పల్లెప్రగతిలో భాగంగా శుభ్రంగా మారుతున్నయ్. మా వీధిలో ప్రణాళికలో భాగంగా మా కాలనీ వాసులందరం అధికా రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శ్రమదానం చేస్తున్నాం.

- అంకతి రమేశ్, వ్యాపారి, తాండూరు ఐబీ, మంచిర్యాల జిల్లా

పలువురికి జరిమానాలు

వికారాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ సంగారెడ్డి చౌరస్తా: పారిశుద్ధ్యానికి ఆటంకం కల్గిం చిన పలువురికి వికారాబాద్ కలెక్టర్ ముస్రత్ ఖానమ్ ఆయేషా ఆదేశం మేరకు అధికారులు జరిమానా విధించారు. ఎక్‌మామిడి గ్రామం లో బహిరంగ మలవిసర్జనకు వెళ్లిన ఇద్దరికి రూ.500 చొప్పున, ఇంటి పక్కన చెత్త వేసిన మరో వ్యక్తికి రూ.500 జరిమానా వేశారు. రోడ్డుపక్కన వ్యర్థాలు వేసిన నవాబుపేట్‌లోని ఓ ఫంక్షన్‌హాల్ నిర్వాహకునికి రూ.5000 జరిమానా విధించారు. సంగారెడ్డిలో రోడ్డు పక్కన బహిరంగ ప్రదేశాల్లో మూత్రవిసర్జన చేసిన వ్యక్తులకు కలెక్టర్ హనుమంతరావు వినూత్న ంగా దండవేసి సన్మానం చేశారు.
మీర్‌ఖాన్‌పేట్ సర్పంచ్‌కు షోకాజ్ నోటీసులు
పల్లె ప్రగతి కార్యక్రమాన్ని అమలు చేయ డంలో నిర్లక్ష్యం వహించిన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మీర్‌ఖానపేట సర్పంచ్ భాగ్యలక్ష్మికి కలెక్టర్ హనుమంతరావు నోటీ సులు జారీచేశారు.

ఆర్టికల్ 370 రద్దు విషయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. పాలనా వైఫల్యాల ఫలితంగానే ప్రజలను బీజేపీ-శివసేన పార్టీలను తిరస్కరించారు.

నవాబ్ మాలిక్, ఎన్సీపీ అధికార ప్రతినిధి

అమిత్ షా 370 ఆర్టికల్ విషయంలో గొప్పలు చెబుతున్నారు. ఆయనకు ధైర్యం ఉంటే జమ్ముకశ్మీర్‌లో సభ ఏర్పాటుచేసి 370 ఆర్టికల్ గురించి ప్రజలకు వివరించాలి.

సచిన్ సావంత్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి, మహారాష్ట్ర

చరిత్రలో నేడు



1493

నూతన ప్రపంచ ఆవిష్కరణ కోసం రెండోసారి 17 పడవలతో సముద్రయానానికి బయల్దేరిన కొలంబస్.

1960

ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (ఐడీఏ) ఏర్పాటు.



1988

వందమీటర్ల పరుగు పందెంలో 9.92 సెకన్లతో ప్రపంచ రికార్డును సృష్టించిన కార్ల్ లూయిస్.

నెల రోజుల్లో మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడబోతున్నాయి. అక్టోబర్ 21న జరిగే ఎన్నికల్లో అధికార పార్టీలే తిరిగి పాలనాధికారాలను చేజిక్కించుకునే పరిస్థితి కనిపిస్తున్నది. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవిస్, మనోహర్‌లాల్ ఖట్టర్ ఇద్దరూ సహజంగా ఉండే ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి దూసుకుపోతున్నారు. మరోవైపు పరిస్థితులను తమకు అనుకూలంగా మల్చుకొనే దిశగా ప్రతిపక్ష పార్టీలు లేకపోవటం గమనార్హం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

దేశమంతా ఒకే పన్ను విధానం ఉండాలని 2016లో తీసుకొచ్చిన జీఎస్టీ పన్ను విధానం క్రమంగా ఫలితాలిస్తున్నది. పరోక్ష, ప్రత్యక్ష పన్నుల పేర ఉన్న భారాన్ని, సంక్లిష్టతను జీఎస్టీ తొలిగించింది. దీంతో వినియోగదారుడు మొదలు పంపిణీదారుడి దాకా అందరూ లబ్ధి పొందుతున్నారు. ఈ క్రమంలోనే పన్నుల శాఖలో పేరుకుపోయిన అవినీతి చేపలకు చెక్ పెడుతున్నారు. ఇప్పటిదాకా 1200 వందల మంది ఉన్నతాధికారులు అవినీతి కేసుల్లో దొరికిపోవటం ప్రభుత్వ ఉద్దేశాన్ని తెలుపుతున్నది

ది హిందూ

ఎన్నికల పరీక్ష

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగించిన అనంతరం ఇప్పుడు చిన్నస్థాయి ఎన్నికల సమరం జరుగబోతున్నది. మహారాష్ట్ర, హర్యానా శాసనసభలకు ఎన్నికలు అక్టోబర్ 21వ తేదీన జరుగబోతున్నాయి. పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంతో పాటు పలు రాష్ట్రాల్లోని 64 ఉప ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. ఇందులో బీహార్‌లోని ఒక లోక్‌సభ ఉప ఎన్నిక కూడా ఉన్నది. హర్యానా అసెంబ్లీ గడువు నవంబర్ రెండవ తేదీన, మహారాష్ట్ర గడువు నవంబర్ తొమ్మిదవ తేదీన ముగుస్తున్నాయి. జార్ఖండ్ అసెంబ్లీ గడువు డిసెంబర్‌లో ముగుస్తున్నందున అక్కడ కూడా అసెంబ్లీ ఎన్నికలు వీటితోపాటు జరుపుతారనే అభిప్రాయం ఉండేది. కానీ ఎన్నికల కమిషన్ మహారాష్ట్ర, హర్యానా ఎన్నికలకు మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నది. అయినా త్వరలో జార్ఖండ్‌కు కూడా జరుపక తప్పదు. దేశవ్యాప్తంగా మోదీ నాయకత్వంలో బీజేపీ బలమైన పక్షంగా ఉన్నది. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలలో బీజేపీయే అధికారంలో ఉన్నది. ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్నాయి. అయినప్పటికీ ప్రజాతీర్పును అంచనా వేయడం కష్టం. గుజరాత్ అసెంబ్లీలో కష్టపడి గెలిచిన బీజేపీ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో ఎదురుగాలిని ఎదుర్కొనవలసి వచ్చింది. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో మళ్లా మోదీ వైపు గాలి వీచింది. మోదీ-అమిత్ షా ద్వయం ప్రతి ఎన్నికనూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని గెలిపించుకు వస్తున్నది. అయినా ఆర్థిక పరిస్థితి దిగజారిన నేపథ్యం బీజేపీపై ప్రభావం చూపుతుందా అనే ఆసక్తి కూడా రాజకీయ వర్గాలలో వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ ఎంతవరకు ఈ పరిస్థితిని ఉపయోగించుకోగలదనేది కూడా గమనార్హమే.

సోనియాగాంధీ బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీని 2004లో, 2009లో కేంద్రంలో అధికారానికి తెచ్చారు. మళ్ళా ఇప్పుడు పార్టీ ఉనికి కోసం పోరాడుతున్న దశలో ఆమె ముందున్నది. పార్టీని చక్కదిద్దడంతో పాటు ఎన్నికల వ్యూహాలను రచించి గెలుపుబాటలో నడిపించే బాధ్యత ఆమెపై ఉన్నది. ఈ నెల 12వ తేదీన పార్టీ కేంద్ర నాయకులతో, రాష్ట్రాల నాయకులతో చర్చలు జరిపారు. రాహుల్‌గాంధీ నియమించిన నాయకులను పక్కనపెట్టడానికి కూడా సోనియా వెనుకాడటం లేదు. పార్టీ కార్యకర్తలకు ఆత్మవిశ్వాసం కలిగించడంతో పాటు మిత్రపక్షాలతో సత్సంబంధాలను నెలకొల్పుకోవడంపై దృష్టిసారించారు.

బీజేపీ బలపడే కొద్దీ మిత్రపక్షాలను మింగేస్తుందనే అభిప్రాయం ఉన్నది. హర్యానాలో అదే జరిగింది. ఈ పరిణామమే మహారాష్ట్రలో శివసేనతో ఘర్షణ- మైత్రితో కూడిన సంబంధాలను నెలకొల్పింది. బీజేపీ తొలినాటి మిత్ర పక్షాలలో పంజాబ్‌లోని అకాలీదళ్ ఒకటి కాగా మహారాష్ట్రలోని శివసేన రెండవది. శివసేన బాల్‌ఠాక్రే నాయకత్వంలో బీజేపీ కన్నా బలంగా ఉండేది. 2009 ఎన్నికలలో శివసేన 169 సీట్లకు, బీజేపీ 119 స్థానాలకు పోటీ చేశాయి. బీజేపీ చాపకింద నీరులా విస్తరిస్తూ పోయింది. 2014లో శివసేన పొత్తు లేకుండా విడిగా పోటీ చేసి 122 స్థానాలు గెలుచుకున్నది. శివసేన 63 స్థానాలు మాత్రమే గెలుచుకున్నది. ఈసారి బీజేపీ తాను162 స్థానాలకు పోటీ చేస్తూ శివసేనకు 126 స్థానాలు మాత్రమే ఇస్తానంటున్నది. గత ఎన్నికలలో విడిగా పోటీ చేసిన కాంగ్రెస్, ఎన్సీపీ ఇప్పుడు పొత్తు పెట్టుకున్నాయి. అందువల్ల శివసేనతో పొత్తు అవసరమని బీజేపీ భావిస్తున్నది. బీజేపీ ఉద్వేగపూరిత అంశాలను ముందుకు తెస్తుందనే అభిప్రాయం ఉన్నది. ప్రధాని మోదీ ఇటీవల మహారాష్ట్రలోని నాసిక్‌లో కశ్మీర్ అంశంపై మాట్లాడారు. హర్యానాలో జాతీయ పౌర పట్టికను తయారుచేయాలనే డిమాండ్ వినిపిస్తున్నది. మహారాష్ట్రలో కూడా బీజేపీ ప్రభుత్వం వలస వచ్చిన వారికి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాల ని అంటున్నది. అయితే గ్రామీణ ప్రాంతంలో ఆర్థికపరిస్థితులు అనుకూలంగా లేవు. వ్యవసాయం సంక్షోభంలో ఉన్నది. యువతలో అసంతృప్తి రగులుతున్నది. ఈ అంశాలను పార్టీ అధిగమించవలసి ఉంటుంది.

సోనియాగాంధీ బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీని 2004లో, 2009లో కేంద్రంలో అధికారానికి తెచ్చారు. మళ్ళా ఇప్పుడు పార్టీ ఉనికి కోసం పోరాడుతున్న దశలో ఆమె ముందున్నది. పార్టీని చక్కదిద్దడంతో పాటు ఎన్నికల వ్యూహాలను రచించి గెలుపుబాటలో నడిపించే బాధ్యత ఆమెపై ఉన్నది. ఈ నెల 12వ తేదీన పార్టీ కేంద్ర నాయకులతో, రాష్ట్రాల నాయకులతో చర్చలు జరిపారు. రాహుల్‌గాంధీ నియమించిన నాయకులను పక్కనపెట్టడానికి కూడా సోనియా వెనుకాడటం లేదు. పార్టీ కార్యకర్తలకు ఆత్మవిశ్వాసం కలిగించడంతో పాటు మిత్రపక్షాలతో సత్సంబంధాలను నెలకొల్పుకోవడంపై దృష్టిసారించారు. మహారాష్ట్రలో గత ఎన్నికలలో కాంగ్రెస్, ఎన్సీపీ విడిగా పోటీచేసి ఘోర పరాజయం పొందాయి. అందువల్ల ఈసారి సోనియా గాంధీ శరద్ పవార్‌తో చర్చించి సీట్ల సర్దుబాటు కుదుర్చుకున్నారు. రెండు పార్టీలు చెరి 125 సీట్లకు పోటీ చేస్తూ మిగిలినవి మిత్రపక్షాలకు వదిలిపెట్టాయి. హర్యానాలో దేవీలాల్ వారసుల కలహాల మూలంగా ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ చీలికలు పేలికలుగా మారిన నేపథ్యాన్ని అనుకూలంగా మార్చుకోవాలని సోనియా భావిస్తున్నారు. జాట్ నాయకుడైన హుడాను ఆదరిస్తూనే, ఆయన సూచన మేరకు దళిత నాయకురాలు షెల్జాను పీసీసీ అధ్యక్షురాలిగా నియమించారు. జార్ఖండ్‌లో కూడా జేఎంఎం, జేవీఎం(పీ), ఆర్‌ఎల్‌డీ, వామపక్షాలతో మహాకూటమి ఏర్పాటుకు చర్చలు జరుపుతున్నారు. ఈ ఎన్నికలను మోదీ ఉద్వేగపూరిత విధానాలపై చర్చగా కాకుండా, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, ఆర్థిక అనిశ్చితిని ప్రధానాంశాలుగా ప్రచారం సాగించాలని సోనియా పార్టీ వర్గాలకు సూచించారు. ఈ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచినా, బీజేపీకి గట్టి పోటీ ఇచ్చినా కార్యకర్తలలో నైరాశ్యం తొలిగిపోతుంది.

జనగళం

అహింసా పరమో ధర్మః

పాజిటివ్ ఎనర్జీ మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని, మనోవికాసాన్ని పెంచుతుంది. తద్వారా మన జీవనగమనం సాఫీగా సాగిపోవడానికి సరిపడా శక్తి అందుతుంది. మనసులోని ఆలోచనావిధానం, ఆత్మవిశ్వాసం రెండూ ఒక్కతాటిపైన నడిస్తే ఉత్పన్నమయ్యే పాజిటివ్ ఎనర్జీ మనచుట్టూ వాతావరణంలో పాజిటివ్ ప్రకంపనాలను సృష్టిస్తుంది. ఆ ప్రకంపనాలు మన మనసుతో, మనచుట్టూ ఉండే వాతావరణంతో మమేకమవుతాయి. తద్వారా ఉదయించే శక్తి మనల్ని లక్ష్యసాధనలో ముందుకు తీసుకెళ్తాయి. నెల్సన్ మండేలా తన కఠోర దీక్షతో, అకుంఠిత విశ్వాసంతో రాజీలేని పోరాటం చేయడం, తన మార్గాన్ని మార్చుకోకుండా అటువంటి ఆలోచనకు తావివ్వకుండా ముదుకుసాగడం పాజిటివ్ ఫలితాన్నిచ్చింది. ఈ ఆత్మవిశ్వాసంతోనే మార్టిన్ లూథర్ కింగ్ అమెరికా సమాజాన్ని మార్చగలిగాడు. మహాత్మా గాంధీ దాస్య శృంఖలాలను తెంచి స్వాతంత్య్రాన్ని భారతదేశానికి అందించగలిగాడు. కేసీఆర్‌లోని ఆత్మవిశ్వాసం, అకుంటిత దీక్ష తెలంగాణ రాష్ట్ర సాధనకు బీజం వేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే నాటినుంచి నేటివరకు వివేకానందుడు, వినోభాభావే, జయప్రకాష్ నారాయణ, వాజపేయి లాంటి ఎందరో మహనుభావులు తమలోని ఆత్మవిశ్వాసాన్ని తమ కార్యదీక్షను ఏకం చేసి తమచుట్టూ అభేద్యమైన పాజిటివ్ శక్తి కిరణాలను సృష్టించుకుంటూ ముందుకుసాగారు. పాజిటివ్ ఎనర్జీ, సాకారాత్మక ఆలోచన, ఆత్మవిశ్వాసంతో కూడిన ముందడుగు ద్వారా ఎన్నో ఫలితాలను అందిచూపిన వారంతా ఆదర్శమూర్తులే.

అహింసామార్గంలో ప్రయాణించడం అనేది పాజిటివ్ ఎనర్జీని సృష్టించుకోవడంలో మొదటి అడుగు. హింసామార్గంలో మనకు వర్గ శత్రువుల రూపంలో, లేదా మరో రూపంలో మనచుట్టూ నెగెటివ్ ఎనర్జీ కూడా పెరుగుతూ ఉంటుంది. మనల్ని వ్యతిరేకించేవాళ్లు, మనల్ని అంతం చేయాలని చూసేవాళ్లు, ఖండించేవాళ్లు ఇదంతా నెగెటివ్ ఎనర్జీని పుట్టించేది, పెంచిపోషించేది. అహింసలో అయితే మనతో నడిచేవాళ్లుంటారు, లేదా విభేదించేవాళ్లుంటారు. అంతేతప్పా మనల్ని అణిచివేయాలనో, ఏ విధంగానైనా ఓడించాలనుకునేవారో, మరోరకంగా వ్యక్తిగతమైనటువంటి విద్వేషాలకు అవకాశం తక్కువ కనుక నెగెటివ్ ఎనర్జీ తక్కువగా ఉంటుంది. అందుకే అహింసామార్గమే సరైన పంథా. అందుకే మహాత్మా గాంధీజీ నడిచిన అహింసా దారి అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పటికీ ఆచరణీయమే.

- చందుపట్ల రమణకుమార్‌రెడ్డి, న్యాయవాది

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

తెలంగాణం

బి.ఎస్.రాములు

అప్పుడే నిజమైన ఫెడరలిజం

ఈశాన్య రాష్ట్రాల్లో ప్రతి గిరిజన తెగ స్వతంత్రతను కోరుకోవడంతో ఒక చిన్న ప్రాంతంలో ఏడెనిమిది రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఒక దూరదృష్టితో వీటిని ఏర్పర్చకుండా, ప్రత్యేక పరిస్థితులు అంటూ ఏర్పర్చడం జరిగింది. సమగ్రమైన దూరదృష్టితో సంశ్లేషించి, ఆయా రాష్ట్రాలను కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేసేటప్పుడు పరిగణనలోకి తీసుకొని ఉంటే, శాంతియుతంగా మరో 15 రాష్ట్రాలైనా ఏర్పడటం అవసరమని జరుగుతున్న ఉద్యమాల వల్ల అభిప్రాయం కావచ్చు. రాష్ట్రాలు ఎక్కువ కావడం వల్ల స్వయం పోషకత్వం, స్వపరిపాలన, సొంత అస్థిత్వం, సొంత గుర్తింపు, సొంత అభివృద్ధి పెరుగుతుంది.

జాతి, జాతీయత అనే పదాలు ఇంగ్లీషులోని నేషన్, నేషనాలిటీ అనే అర్థంలో వాడబడుతున్నాయి. జాతి, జాతీయత అనేవి చారిత్రకంగా వచ్చిన పరిణామాల్లో రూపుదిద్దుకున్నాయి. రాజ్యం సామ్రాజ్యంగా, రాజు చక్రవర్తిగా పరిపాలనా ప్రాంతాలు సామ్రాజ్యంగా విస్తరించాయి. ఈ క్రమంలో చక్రవర్తి కింద, సామ్రాజ్యం కింద కలిసి ఉండే ఒకనాటి రాజ్యాలు, జాతులు, అనేక అనుశ్రుత ఒప్పందాలు, సంప్రదాయాలు, లిఖిత ఒప్పందాలు కలిసి ఒకే రాజ్యంలో ఉన్నాయి. అయినప్పటికీ ఆయా జాతులకు స్వతంత్రమైన, ప్రత్యేకమైన అస్తిత్వం, గుర్తింపు, సంస్కృతి, భాష, మానసిక ఐక్యత, అభివృద్ధి, అధికారం వంటివి ప్రత్యేకంగా కొనసాగుతూ వచ్చాయి.

బీసీలు, ఓబీసీలు జాతుల సమస్యలో చర్చించబడలేదు. రాష్ట్రాల సమస్యలో వీరు చర్చించబడలేదు. ప్రాంతాల సమస్యలో వీరు చర్చించబడలేదు. సంస్కృతి సమస్యలో వీరు చర్చించబడలేదు. మతాల సమస్యలో వీరు చర్చించబడలేదు. ఇలా అనేక తాత్త్విక దృక్పథాల చర్చలు జరిగినప్పటికీ ఎందులోనూ ఓబీసీలను, బీసీలను ప్రధాన సమస్యగా గుర్తించినట్టు కనబడదు. వీరి సమస్య ఫెడరలిజం పరిధిలోకి రాలేకపోయింది. ఇలా వెనుకబడిన వర్గాలు దేశం మొత్తంమీద ఫెడరలిజంలో అందరికన్నా ఎక్కువ నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతూ వస్తున్నారు. శతాబ్దాలుగా ఈ సమాజాన్ని, దేశాన్ని, రాజ్యాలను తలెత్తుకొని నిలిచేట్టు చేస్తున్న శూద్రులు వర్ణవ్యవస్థ, కుల వ్యవస్థతో పాటు, రాజ్యాంగపరంగా కూడా రెండవ శ్రేణి పౌరులుగా కొనసాగుతున్నారు. ఎస్సీ, ఎస్టీల వలె కనీసం చట్టసభల్లో, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు, ప్రాతినిధ్యం అమలు జరిగితే ఎస్సీ, ఎస్టీల వలె సామాజిక, రాజకీయ విద్యారంగాల్లో కొంతమేరకైనా బీసీలకు ఫెడరలిజం అనుభవంలోకి వస్తుంది.

కొందరు వామపక్షవాదులు ఆధునిక జాతీయత, జాతి నిర్మాణం అనేవి ఆధునిక పారిశ్రామిక విప్లవం, ఆధునిక అభివృద్ధి, ఆధునిక రాజ్యాలు, ప్రజాస్వామిక వ్యవస్థ, పెట్టుబడిదారీ విధానాలు తదితర అంశాలతో పరిశీలించడం చేస్తుంటారు. వీరి దృష్టి ప్రకారం ఒక భాష, ఒక ప్రాంతం, ప్రాంతీయ పెట్టుబడిదారి వర్గాలు, ఒక మానసిక ఐక్యత, వారి అభివృద్ధి, జాతుల సమస్యల్లో భాగంగా పరిశీలిస్తారు. ఇది పెట్టుబడిదారీ, పారిశ్రామిక ప్రాంతీయ ఆధిపత్యశక్తుల ప్రయోజనాలకు పరిమితమైన దృష్టి. కుల సమస్యను, వివక్షను, వెనుకబడిన కులాలను పట్టించుకోని జాతుల సమస్య చర్చ, పరిష్కారాలు ఆయా ప్రాంతీయ, పారిశ్రామిక పెట్టుబడిదారీ శక్తులు, ఆధిపత్య కులాలు అభివృద్ధి చెందడానికి అధికారంలో ప్రాతినిధ్యం పొందడానికి పరిమితమైన దృష్టి. ఇలా వామపక్షాలు సారాంశంలో ఆధిపత్య కులాల ప్రయోజనాలను ఫెడరలిజం పేరిట, జాతుల సమస్య పేరిట ముందుకు తోస్తుంటారు. మరికొందరు ఎన్నికల్లో పోటీ చేయకుండా, చేయనీయకుండా దశాబ్దాలు తరబడి ఆధిపత్య కులాలకు, వర్గాలకు, రాజకీయ అధికారాన్ని రిజర్వేషన్ చేసిపెడుతుంటారు. ఎన్నికల్లో ఓటు వేయనివారికి రాజ్యం గురించి, పరిపాలన గురించి విమర్శించే హక్కు ఉంటుందా? కానీ ఎన్నికల్లో ఓటు వేయనివారే మీడియాలో, సమాజంలో ఎక్కువ మాట్లాడటం విచిత్రం.

జాతుల సమస్య ప్రధానంగా మన దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంబంధించిన సామాజికవర్గాల సమస్య. మెజార్టీ ప్రజలే జాతి, జాతీయతకు, సంస్కృతికి ప్రతినిధులు. సమస్త సంపద సృష్టికర్తలు వీరే. వీరి దృష్టితో చూసినప్పుడు జాతుల సమస్య, రాష్ట్రాల ఏర్పాటు సమస్య అనేవి వీరి అభివృద్ధి, ప్రాతినిధ్యం, అధికారంలో వాటా, ఆధునిక అభివృద్ధి, ఆధునిక విద్య అందుకోవడం తదితరాలకు సంబంధించినవి. వీరి అభివృద్ధియే ఆయా జాతుల, ప్రాంతాల అభివృద్ధి. వీరి గురించి ప్రత్యేక దృష్టిలేని రాష్ట్రాల ఏర్పాటు, జాతి, జాతీయత, జాతుల సమస్య, చర్చలు, పరిష్కారాలు, ఒప్పందాలు మొదలైనవన్నీ వర్ణ వ్యవస్థలో, కుల వ్యవస్థలో ఆధిపత్య వర్ణాలకు, అగ్రకులాలకు, వారి అభివృద్ధికి పరిమిత ప్రయోజనాలకు సంబంధించినది.

భారత రాజ్యాంగంలో ఆయా ప్రాంతాల, రాష్ట్రాల జాతీయతను, జాతుల సమస్యగా పేర్కొనడం జరుగలేదు. రాష్ట్రాలకు దేశానికి మధ్య సంబంధంగా, భాషలకు, దేశానికి మధ్య సంబంధంగా వీటిని భారత రాజ్యాంగంలో పొందుపరుచడం జరిగింది. వెనుకబడిన కులాలకు ప్రత్యేక రాష్ట్రాలు గానీ, చట్టసభల్లో ప్రాతినిధ్యం కోసం రిజర్వేషన్లు గానీ రాజ్యాంగంలో పొందుపరుచడం జరుగలేదు. వెనుకబడినవర్గాల ప్రయోజనాల, ప్రాతినిధ్య దృష్టికోణం భారత రాజ్యాంగ రచనలో కనపడదు. మొదటి రాజ్యాంగ సవరణతో వెనుకబడిన వర్గాలకు 14, 15, 16, 31బి ఆర్టికల్స్‌లలో కొన్ని క్లాజులు చేర్చి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు అవకాశం కల్పించడం జరిగింది. వెనుకబడిన కులాల జనాభా మెజార్టీ అయినప్పటికీ వారి దృష్టికోణం రాజ్యాంగంలో లేదనడానికి మొదటి రాజ్యాంగ సవరణే సాక్ష్యం. అనగా రాజ్యాంగ రచన వర్ణ వ్యవస్థ, ఆధిక్యతావాదుల దృష్టికోణంలో వారి ప్రయోజనాలకు పరిమితికి లోబడి రాయబడిందని ఆచరణలో తేలుతున్నది. ఉన్నత న్యాయస్థానాల తీర్పుల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా, రిజర్వేషన్లకు అనేక పరిమితులు విధించడం, క్రిమీలేయర్ ప్రతిపాదనలు మొదలైనవన్నిటిని పరిశీలించినప్పుడు వర్ణ ఆధిక్యవాదులకు, కులాధిక్యవాదులకు, సమస్త రంగాల్లో అవకాశాల కోసం తలుపులు బార్లా తెరుస్తారని స్పష్టమవుతున్నది. రిజర్వేషన్లలోనే ఎన్నిక కాని వారు ఓపెన్ కాంపిటీషన్‌లో నెగ్గడం సాధ్యం కాదు. కనుక జనరల్ కేటగిరిగా భావించేవన్నీ 15-30 శాతం గల వర్ణ వ్యవస్థ, కులవ్యవస్థ ఆధిపత్యవాదులకు రిజర్వ్ చేయడమేనని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

వర్ణ , కులవ్యవస్థ, జాతి, జాతీయత, జాతుల సమస్య, ప్రాంతీయ సమస్య, సంస్కృతి సమస్య, వందలాది కులాల మధ్య సంబంధాల సమస్య, భాషా సమస్య మొదలైన వాటినన్నిటిని సంశ్లేషించి ఆయా రాష్ట్రాలను ఏర్పాటుచేయడం జరుగలేదు. ఫజల్ అలీ కమిషన్ రాష్ట్రాల పునర్విభజన కోసం తీసుకున్న అధ్యయన పద్ధతి చాలా పరిమితమైనది. ఫజల్ అలీ కమిషన్ సిఫార్సుల మేరకు బ్రిటిష్ ప్రావిన్స్‌లు, 565 సంస్థానాలు, కశ్మీర్, జునాఘడ్, ట్రావన్‌కోర్, నైజాం వంటి రాజ్యాలన్నీ కలిపి 14 రాష్ట్రాలుగా సరిహద్దుల్లోకి మార్చడం జరిగింది.

ఈశాన్య రాష్ట్రాల్లో ప్రతి గిరిజన తెగ స్వతంత్రను కోరుకోవడంతో ఒక చిన్న ప్రాంతంలో ఏడెనిమిది రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఒక దూరదృష్టితో వీటిని ఏర్పర్చకుండా, ప్రత్యేక పరిస్థితులు అంటూ ఏర్పర్చడం జరిగింది. సమగ్రమైన దూరదృష్టితో సంశ్లేషించి, ఆయా రాష్ట్రాలను కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేసేటప్పుడు పరిగణనలోకి తీసుకొని ఉంటే, శాంతియుతంగా మరో 15 రాష్ట్రాలైనా ఏర్పడటం అవసరమని జరుగుతున్న ఉద్యమాల వల్ల అభిప్రాయం కావచ్చు. రాష్ట్రాలు ఎక్కువ కావడం వల్ల స్వయం పోషకత్వం, స్వపరిపాలన, సొంత అస్తిత్వం, సొంత గుర్తింపు, సొంత అభివృద్ధి పెరుగుతుంది. అందువల్ల కేంద్రానికి గానీ, ఆయా రాష్ట్రాలకు గానీ, నష్టం లేదు. ఆయా రాష్ట్రాల్లోని పెద్దరికపు ఆధిపత్య సామాజిక వర్గాలకు అభివృద్ధి చెందిన కొన్ని ప్రాంతాల అంతర్గత వలసవాద విస్తరణకు తెరపడుతుంది. ఈ కారణంగానే రాష్ట్రాల విభజనను రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయి. అంటే ప్రతి రాష్ట్ర ఉద్యమం అంతర్గత వలసవాదాన్ని, ఆధిపత్యవర్గాల ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, తమ అస్తిత్వం స్వపరిపాలన కోసం అర్రులు చాస్తున్నవారే అని చెప్పవచ్చు.

భారత రాజ్యాంగంలోని రెండవ ఆర్టికల్, మూడవ ఆర్టికల్‌ను ఉదారంగా, ఉదాత్తంగా ఆలోచించి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలను శాస్త్రీయ పద్ధతిలో మరికొన్ని రాష్ట్రాలు ఏర్పాటుచేయడం ద్వారా అనేక ప్రాంతాల అసమ అభివృద్ధి స్థానాల్లో స్వపరిపాలన, స్వీయ అభివృద్ధి వేగవంతం అవుతుంది.

ఈ దృష్టితో చూసినప్పుడు భారత రాజ్యాంగంలోని రెండవ ఆర్టికల్, మూడవ ఆర్టికల్‌ను ఉదారంగా, ఉదాత్తంగా ఆలోచించి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలను శాస్త్రీయ పద్ధతిలో మరికొన్ని రాష్ట్రాలు ఏర్పాటుచేయడం ద్వారా అనేక ప్రాంతాల అసమ అభివృద్ధి స్థానాల్లో స్వపరిపాలన, స్వీయ అభివృద్ధి వేగవంతమవుతుంది. ఇలా నూతన రాష్ట్రాల ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల్లోని వెనుకబడిన ప్రాంతాలు, వెనుకబడిన కులాలు అందరితో సమానంగా, ప్రపంచంతో సమానంగా ఎదుగడానికి అవకాశం ఉంటుంది. అయితే ఇందుకు రాష్ట్రాల పునర్విభజన కమిషన్ కాకుండా, ఆయా జాతుల, ప్రాంతాల, సంస్కృతుల, గిరిజన తెగల, వెనుకబడిన కులాల అస్తిత్వాలను, ప్రాతినిధ్యాన్ని, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రాలను ఏర్పర్చినప్పుడు జాతుల సమస్య, ఉప జాతీయత, వెనుకబడిన కులాల సమస్య పరిష్కారమవుతుంది. అప్పుడే నిజమైన ఫెడరలిజం ఆచరణలోకి వస్తుంది.

(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్)

పదివేల కేసుల పరిష్కారం

స.హ.చట్టం



బుద్ధా మురళి

తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ ఏర్పడి రెండేండ్లు అవుతున్నది. రాష్ట్ర విభజన తర్వాత 2017, సెప్టెంబర్ 25న తెలంగాణ తొలి సమాచార హక్కు కమిషన్ ఏర్పడింది. సెప్టెంబర్ 28ని యునెస్కో ప్రపంచ సమాచార దినోత్సవంగా పాటిస్తున్నది. అంతకన్నా మూడురోజుల ముందు తెలంగాణ సమాచార కమిషన్ ఆవిర్భవించింది. 2016లో సెప్టెంబర్ 28ని ఇంటర్నేషనల్ డే ఫర్ యూనివర్సల్ యాక్సెస్ టు ఇన్ఫర్మేషన్‌గా యునెస్కో ప్రకటించింది. రెండేండ్ల వ్యవధిలోనే తెలంగాణ సమాచార హక్కు కమిషన్ కమిషన్ 10,104 కేసులను పరిష్కరించింది. సమాచారహక్కు కమిషన్‌లో ఇదో రికార్డ్. సోమ సదారాం చీఫ్ కమిషనర్, బుద్ధా మురళి కమిషనర్‌గా సమాచార హక్కు కమిషన్ ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు, కొత్త కమిషన్ ఏర్పడిన తర్వాత వచ్చిన కేసులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలనే లక్ష్యంతో కమిషన్ పని ప్రారంభించింది.

సమాచార హక్కు కమిషన్ ఏర్పడేనాటికి 6,825 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ రెండేండ్ల వ్యవధిలో కమిషన్‌కు 13,084 కేసులు రాగా, ఇప్పటివరకు వీటిలో 10,104 కేసులను కమిషన్ పరిష్కరించింది. ఇంకా కమిషన్ వద్ద 8,659 కేసులున్నాయి. కమిషన్ ఏర్పడే నాటికి పెండింగ్‌లో ఉన్న కేసులు మినహాయిస్తే పెండింగ్‌లో ఉన్న కేసులు స్వల్పమే.

మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్‌తో పాటు పలు ప్రజా సంఘాలు దేశవ్యాప్తంగా సాగించిన కార్యక్రమాల వల్ల సమాచార హక్కు చట్టం పురుడు పోసుకున్నది. అన్నాహజారే, కేజ్రీవాల్ లాంటి నాయకులు సమాచార హక్కు ఉద్యమం ద్వారానే దేశ ప్రజలకు పరిచయమైన నాయకులు. 14 ఏండ్ల సమాచారహక్కు ప్రయాణంలో సాధించిన విజయాలెన్నో ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల బీరువాలో రహస్యంగా నిద్రపోయే సమాచారం సమాచారహక్కు పుణ్యమాని అందరికీ అందుబాటులో ఉండే గ్రంథాలయాలుగా మారిపోయాయి. రికార్డులో ఉన్న సమాచారాన్ని ఇవ్వమని చెప్పడానికి వీల్లేకుండా పోయింది. అమల్లోకి వచ్చి 14 ఏండ్లవుతున్నా చట్టం గురించి ఇంకా విస్తృతంగా తెలియాలి. సమాచారం అంటే ఏమి టో చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. మెయిల్స్‌తో సహా ఏ రూపంలోనైనా ఆఫీస్ రికార్డ్స్‌లో ఉండే సమాచారాన్ని కోరవచ్చు.

ఏది సమాచారమవుతుందనే స్పష్టత ఉండి, సూటిగా ఆ సమాచారాన్ని కోరితే అటు సమాచారం కోరేవారికి, సమాచారం ఇవ్వాల్సినవారికి ఇద్దరికీ సమయం ఆదా అవుతుంది. ఒక వ్యక్తి భూమిని మరో వ్యక్తికి మ్యూటేషన్ చేశారు. మ్యూటేషన్ ఎలా చేశారో దానికి సంబంధించి లిఖిత పూర్వకంగా రికార్డ్ మొత్తం సమాచారమే అవుతుంది. ఆ సమాచారం అడుగవచ్చు. నిబంధనలకు వ్యతిరేకంగా తన భూమిని మరొకరికి మ్యూటేషన్ చేసి ఉంటే స.హ.చట్టం ద్వారా పొందిన సమాచారంతో న్యాయపరంగా తన హక్కు కోసం పోరాడవచ్చు. కానీ ఈ సమాచారం కోసం కొందరు మొత్తం మండలంలో అన్ని భూముల సమాచారం కోరుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల, అన్ని భూముల రికార్డ్స్ అడిగారు. అది దాదాపు పదివేల పేజీలకుపైగా ఉంటుంది. అన్నిగ్రామాల భూముల సమాచారం అతనికి నిజంగా అవసరమా? అంటే కాదు. తన తాత పేరు మీద ఉన్న భూమిని మరో వ్యక్తి పేరు మీద మ్యూటేషన్ చేశారు. అందరి వివరాలు అడిగితే అధికారులు దిగివచ్చి సమాచారం ఇస్తారని అతను భావించాడట. సూటిగా తనకు కావలసిన సమాచారం అడిగితే అతనికి ప్రయోజనం ఉండేది. కానీ, అన్ని గ్రామాల వివరాలు అడుగటం ఆలస్యానికి అవకాశం ఏర్పడుతుంది. కావలసిన సమాచారం స్పష్టంగా సూటిగా కోరాలని పలు కేసుల్లో న్యాయస్థానాలు సూచనలు కూడా చేశాయి.

మరోవైపు అధికారులు సైతం సమాచారం ఇచ్చామంటే ఇచ్చామన్నట్టుగా అడిగిన సమాచారానికి , ఇచ్చిన సమాచారాన్ని పొంతన లేకుండా ఇస్తున్నారు. సమాచారం కోరే వ్యక్తికి రాయడం రాకపోతే సమాచార అధికారిని కలిసి తనకు కావలసిన సమాచారం గురించి చెప్పి సమాచార అధికారితోనే అది రాయించి , చదివించి దరఖాస్తు ఇవ్వవచ్చని చట్టం చెబుతున్నది. అలాంటప్పుడు ఈ స్ఫూర్తిని సమాచార అధికారులు, సమాచారం కోరేవారు అర్థం చేసుకొని, కావలసిన సమాచారం కోసం దరఖాస్తు క్లుప్తంగా ఉండేట్టు చూసుకోవాలి. అదేవిధంగా సమాచార అధికారులు దరఖాస్తును ఒకటికి రెండుసార్లు చదివి కోరిన సమాచారం ఇస్తే బాగుంటుంది. కొంతమంది వందల సంఖ్యలో సమాచారం కోసం దరఖాస్తులు చేస్తున్నారు. ఇలాంటి వైఖరి అన్ని రాష్ట్రాల్లో ఉన్నది. రోజుకు 30 దరఖాస్తులు పంపేవారు కూడా ఉన్నారు. సమాచార అధికారుల నుంచి అంత సమాచారం వస్తే వారు వాటిని నిజంగా చదువుతారా అనిపిస్తుంది. ఒక్కో దరఖాస్తులో 10-50 పేజీల సమాచారం ఉంటుంది. అంటే రోజూ 3, 4 వందల పేజీల సమాచారం తీసుకొని, దాన్ని చదివి విశ్లేషించుకొని తగిన చర్యలు తీసుకుంటున్నారా? అది సాధ్యమేనా?

ఒకే వ్యక్తి వందల సంఖ్యలో దరఖాస్తులు చేయడం కన్నా నిజంగా తప్పులను ప్రశ్నించే విధంగా ఒకవైపు తాను కొన్నింటిపై ఫోకస్ చేస్తూ .. మరోవైపు తమకు కావలసిన సమాచారం కోసం ఆర్టీఐని ఏ విధంగా ఉపయోగించుకోవాలో ప్రజలకు వివరిస్తే బాగుంటుంది. దరఖాస్తు ఎలా రాయాలి, సమాచారం ఎలా పొందాలో అవసరమైన ప్రాథమిక శిక్షణ ఇస్తే బాగుంటుంది. కొద్దిమంది పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసే విధానం వల్ల నిజంగా సమాచారం అవసరమైన వారికి ఆలస్యమవుతుంది. దీనివల్ల వారికి అన్యాయం జరుగుతుంది.

ఒకే వ్యక్తి వందల సంఖ్యలో దరఖాస్తులు చేయడం కన్నా నిజంగా తప్పులను ప్రశ్నించేవిధంగా ఒకవైపు తాను కొన్నింటిపై ఫోకస్ చేస్తూ.. మరోవైపు తమకు కావలసిన సమాచారం కోసం ఆర్టీఐని ఏ విధంగా ఉపయోగించుకోవాలో ప్రజలకు వివరిస్తే బాగుంటుంది. దరఖాస్తు ఎలా రాయాలి, సమాచారం ఎలా పొందాలో అవసరమైన ప్రాథమిక శిక్షణ ఇస్తే బాగుంటుంది. కొద్దిమంది పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసే విధానం వల్ల నిజంగా సమాచారం అవసరమైన వారికి ఆలస్యమవుతుంది. దీనివల్ల వారికి అన్యాయం జరుగుతుంది.

ఆ మధ్య ఢిల్లీలో ఆర్టీఐ కార్యకర్తలు ఆర్టీఐని ఉపయోగించుకొని ఏవిధంగా ప్రయోజనం పొంద వచ్చునో మురికివాడల వారికి శిక్షణ ఇచ్చారు. రేషన్ కార్డు పొందడం, తమ మురికివాడలో కనీస సౌకర్యాల గురించి ఎలా సమాచారం కోరాలో శిక్షణ ఇచ్చారు.

స.హ.చట్టంలో సమాచారం గురించిన నిర్వచనంలో పనులు, రికార్డులను తనిఖీ చేసుకొనే హక్కును కూడా పేర్కొన్నారు. పనులంటే సాధారణంగా రోడ్డు నిర్మాణం, ఇతర నిర్మాణాలు అనుకుంటారు. ఒక టీచర్ చేసే పని చదువు చెప్పడం కాబట్టి ఢిల్లీలోని ఓ మురికివాడలో నివసించే ఓ అమ్మాయి తన చెల్లెలు చదివే ప్రభుత్వ స్కూల్‌లో టీచర్ పనిని చూసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని ఆర్టీఐ కింద దరఖాస్తు చేసింది. ఆ స్కూల్లో టీచర్లు సరిగా రావడంలేదు, ప్రభుత్వ స్కూల్ అని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆర్టీఐ చట్టాన్ని ఉపయోగించి టీచర్ చదువుచెప్పే పనిని చూసానని దరఖాస్తు చేసే సరికి కలకలం. స్కూల్ వారు ఆమెకు అవకాశం ఇవ్వక తప్పలేదు. ఆ బాలిక టీచర్ ఎలా చదువు చెబుతుందని ఓ గంట సమయం చూడవచ్చు కానీ దీనివల్ల స్కూల్‌లో చాలా మార్పు వస్తుంది. మనం స్కూల్‌కు వస్తున్నామా? పాఠాలు చెబుతున్నామా? లేదా అని సాధారణ ప్రజలు కూడా తనిఖీ చేసే అవకాశం ఉన్నదని తెలిశాక కచ్చితంగా ఏంటో కొంత మార్పు వస్తుంది.

ఏ ఉద్దేశంతో ఆర్టీఐ చట్టం తీసుకువచ్చారో, ఆ స్ఫూర్తితో ఈ చట్టాన్ని ఉపయోగించుకుంటే ప్రజలకు మేలు. సమాచారం అడిగేవారి లక్ష్యం, సమాచారం ఇచ్చేవారి లక్ష్యం సమాజానికి మంచి జరుగాలని ఉండాలి. అప్పుడే చట్టం లక్ష్యం నెరవేరుతుంది.

(వ్యాసకర్త: తెలంగాణ సమాచార హక్కు కమిషనర్)

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

సోమవారం నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో అభిమానులు బహూకరించిన కరవాలంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, హుజూర్‌నగర్ టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి తదితరులు

వెయ్యిశాతం టీఆర్ఎస్‌దే విజయం

- హుజూర్‌నగర్‌లో ఉత్తమ్‌కు, వారి అభ్యర్థికి ఘోర ఓటమి తప్పదు
- ఐదు దశాబ్దాల జిల్లా అరిగోసకు కారణమైన కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి
- నల్లగొండలో కార్యకర్తలకు వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ నిర్దేశం

నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఐదు దశాబ్దాలుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాను అభివృద్ధిలో నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీకి, సుదీర్ఘకాలం మంత్రులుగా, పీసీసీ అధ్యక్షులుగా పనిచేసినా అభివృద్ధిని పట్టించుకోకుండా ఫ్లోరోసిస్‌కు జిల్లాను కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన ఆ పార్టీ నేతలకు.. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో బుద్ధిచెప్పాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో నిర్వహించిన పార్టీ నల్లగొండ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్ .. హుజూర్‌నగర్ ఉపఎన్నికల్లో వెయ్యి శాతం టీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తంచేశారు. సమావేశం నల్లగొండలో నిర్వహిస్తున్నా.. నేటి సభలో పెండ్లి కొడుకు మాత్రం హుజూర్‌నగర్ టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డే అంటూ.. కాబోయే హుజూర్‌నగర్ ఎమ్మెల్యే, విద్యాధికుడు, ఉత్సాహవంతుడు, కేసీఆర్ సైనికుడు అంటూ.. సైదిరెడ్డిని సమావేశానికి కేటీఆర్ పరిచయం చేశారు. 2018లోనే సైదిరెడ్డి యువ నాయకత్వంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఓడించినంత పనిచేశామని, సాంకేతికంగా ఓడిపోయాం తప్పితే మానసికంగా ఆనాడే గెలిచామని చెప్పారు. ఎనిమిది వేల ఓట్ల తేడాతో ఉత్తమ్ గెలిస్తే.. అందులో ఏడువేల ఓట్లు కారును పోలిన ట్రక్కు గుర్తుకు పోలైన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. నల్లగొండను అభివృద్ధిలో నట్టేట ముంచిన కాంగ్రెస్‌వైపు ఉంటారో.. తెలంగాణను తెచ్చిన టీఆర్ఎస్‌వైపు ఉంటారో విజ్ఞులైన హుజూర్‌నగర్ ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు.

ఐదేండ్ల అభివృద్ధిని చూడాలి

ఇంకా నాలుగున్నరేండ్లు తమ ప్రభుత్వం కొనసాగుతుందని, హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్ గెలిస్తే ఎమ్మెల్యేగా సైదిరెడ్డి.. మంత్రి జగదీశ్‌రెడ్డిసహా తనతోపాటు సీఎం కేసీఆర్‌ను సైతం అభివృద్ధికి నిధులు అడిగి సాధించుకొనే అవకాశం ఉంటుందని కేటీఆర్ వివరించారు. ఐదేండ్ల మూణ్నెళ్ల కాలంలోనే కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాను ఎంత అభివృద్ధి చేసిందో ఆలోచించాలని కోరారు. మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో నేతలంతా ఒక్కటై హుజూర్‌నగర్ గడ్డపై గులాబీ జెండాను ఎగురవేసి ఐదు దశాబ్దాల జిల్లా అరిగోసకు కారణమైన కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

త్వరలో కొత్త మున్సిపల్ చట్టం అమలు

నీలగిరి: నూతన మున్సిపల్ చట్టాన్ని త్వరలో అమలుచేయనున్నట్టు మంత్రి కేటీఆర్ చెప్పారు. సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ప్రజలకు పరిపాలనను చేరువచేయడం కోసం మున్సిపల్ చట్టాన్ని సవరించిందని, చట్టాలపై ముందుగా ఉద్యోగులు అవగాహన పెంచుకొని ప్రజలకు తెలియజేయాలన్నారు.

నాలుగేండ్లలో 20సార్లు జిల్లాకు కేసీఆర్ : మంత్రి జగదీశ్‌రెడ్డి

నాలుగేండ్లలోనే 20 సార్లకుపైగా నల్లగొండ జిల్లాలో పర్యటించి తన ప్రేమను చాటుకున్న సీఎం కేసీఆర్‌కు గత ఎన్నికల్లో ప్రజలు జేజేలు పలికారని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, గాదరి కిశోర్, భాస్కర్‌రావు, రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీ చందర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పార్టీ నాయకులు రవీందర్‌రావు, నిరంజన్ వలీ, అనిల్‌కుమార్, శరణ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమవారం జనగామ జిల్లా కొడకండ్లలో మహిళ లకు బతుకమ్మ చీరెలను అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మహబూబ్‌నగర్‌లోని షాషాబ్‌గుట్ట దర్గా వద్ద బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నిర్మల్‌లోని నందిగుండం ఆలయంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా చీరెలందుకొని మురిసిపోతున్న మహిళలు

వనపర్తిలో చీరెలు పంపిణీ చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ శ్వేతామొహంతి, జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి ఉన్నారు.

బతుకమ్మ చీరె.. సర్కార్ సారె

అట్టహాసంగా ప్రారంభమైన చీరెల పంపిణీ

జిల్లాల్లో పంపిణీ చేసిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్: బతుకమ్మ చీరెలు అందుకున్న ఆడపడుచులు మురిసిపోయారు. రంగురంగుల డిజైన్లలో ఉన్న చీరెలను తీసుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. జరి అంచు, నాణ్యత, రంగులు చూడముచ్చటగా ఉన్నాయంటూ సంబురపడ్డారు. బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమం సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైంది. ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, కలెక్టర్లు తదితరులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నల్లగొండలోని వ్యవసాయ మార్కెట్‌లో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి చీరెల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. జనగామ జిల్లా దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల మండలాల్లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగకు ఇంటి ఆడబిడ్డను గౌరవించుకోవడం మన సంప్రదాయమన్నారు.

ఆడబిడ్డల ఆనందానికే..

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ బతుకమ్మ చీరెలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలను ఉన్నత స్థాయికి తీసుకుపోతూ అందరి కండ్లల్లో ఆనందం నింపేందుకు సీఎం కేసీఆర్ సర్కార్ శ్రమిస్తున్నదన్నారు. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు మహిళలంటే ప్రత్యేక గౌరవమనీ, బతుకమ్మ పండుగకు రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఏటా చీరెలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. నిర్మల్‌లో దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ ప్రశాంతితో కలిసి చీరెలను పంపిణీ చేశారు. మొదటి చీరెను జిల్లా కేంద్రంలోని నందిగుండం దుర్గామాత ఆలయంలో అమ్మవారికి అందజేశారు. వనపర్తిలోని 5వ వార్డులో జెడ్పీ చైర్మన్ లోకనాథరెడ్డి, కలెక్టర్ శ్వేతామొహంతితో కలిసి వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. 'తెలంగాణ సర్కార్‌కు.. మీ చల్లని దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలి' అని సింగిరెడ్డి కోరారు.

మొదటి చీరెను సమ్మక్క-సారలమ్మకు చెల్లిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

వన దేవతలకు బతుకమ్మ చీరె..

బతుకమ్మ చీరెల పంపిణీని పురస్కరించుకొని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్‌తో కలిసి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క-సారలమ్మను దర్శించుకొని మొదటి చీరెను వనదేవతలకు సమర్పించారు. ఆ తరువాత జిల్లా కేంద్రంలో మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆడబిడ్డలకు రూ.313 కోట్లతో బతుకమ్మ చీరెలను అందిస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఖమ్మం, కూసుమంచిలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, నగర మేయర్ డాక్టర్ జీ పాపాలాల్‌తో కలిసి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు చేనేత చీరెలను పంపిణీ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. మేడ్చల్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ మలి పెద్ది శరత్ చంద్రారెడ్డి, కలెక్టర్ డా. ఎంవీ రెడ్డితో కలిసి కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు.

మహిళలకు కేసీఆర్ పెద్దన్న..

మహిళలకు అన్నలు సారెలు చీరెలు పెట్టినట్టుగానే రాష్ట్రంలోని మహిళలకు సీఎం కేసీఆర్ పెద్దన్న పాత్ర పోషిస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి పీ సబితారెడ్డి అన్నారు. సోమవారం ఆమె రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, కందుకూరు మండలాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి, కలెక్టర్ హరీశ్‌కుమార్‌తో కలిసి బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు.

ఆయా చోట్ల ఎమ్మెల్యేలు..

రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు ఆయా ప్రాంతాల్లో బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. నిర్మల్ జిల్లా బాసర, ముథోల్, భైంసా మండలాల్లో ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చీరెలను పంపిణీ చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ఎమ్మెల్యే సుంకెరవిశంకర్, మంచిర్యాల జిల్లా జైపూర్, భీమారం, చెన్నూర్, మందమర్రి, రామకృష్ణాపూర్‌లో ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మంచిర్యాలలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఎంపీ వెంకటేశ్‌నేతకాని చీరెలు పంపిణీ చేశారు. జగిత్యాలలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఎంపీ రాములు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే జోగు రామన్న, నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, వికారాబాద్‌లో ఎమ్మెల్యే ఆనంద్, తాండూరులో ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, బొంరాస్‌పేట మండలంలో కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, కామారెడ్డిలో ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్, బిచ్కుందలో ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొని బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు.

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి. జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు ఉన్నారు.

తెలుగింటి ఆడపడుచుకు గౌరవం: ఆర్థిక మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్, నమస్తే తెలంగాణ: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక మాంద్యం ఏర్పడినప్పటికీ రాష్ట్రంలో సంక్షేమ పథకాల్లో ఎలాంటి మార్పు ఉండబోదని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. సిద్దిపేట, గజ్వేల్‌లో సోమవారం బతుకమ్మ చీరెల పంపిణీ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఆర్థికమాంద్యం వల్ల కేంద్ర ప్రభుత్వం నిధుల్లో కోత విధించిందన్నారు. మాద్యం ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణలో మాత్రం అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుకు నిధుల కొరత లేదన్నారు. పెన్షన్లు సమయానికి ఇస్తున్నామని, రైతుబంధు మొత్తం యాసంగి డబ్బుతో కలిపి త్వరలో విడుదలవుతాయన్నారు. రాష్ట్రంలో పేదలు పండుగలను సంతోషంగా జరుపుకోవడానికి బతుకమ్మ చీరెల పంపిణీ చేపడుతున్నట్టు తెలిపారు. బతుకమ్మ చీరెల ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి లభించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో చీరెలను అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

ఖమ్మంలో చీరెలను పంపిణీ చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

కరీంనగర్‌లో చీరె తీసుకొని మంత్రి గంగులకు నమస్కరిస్తున్న వృద్ధురాలు

మేడ్చల్‌లో మహిళ లకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

సూర్యాపేట మున్సిపాలిటీకి స్కోచ్ అవార్డు

సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సూర్యాపేట మున్సిపాలిటీ స్కోచ్ అవార్డులు వరుసగా అందుకుంటూ హ్యాట్రిక్ సాధించింది. ప్రజలకు స్వచ్ఛమైన భగీరథ నీటిని అందిస్తున్నందుకుగాను 2019 స్కోచ్ అవార్డుకు సూర్యాపేట మున్సిపాలిటీ ఎంపికైంది. ఈ నెల 25న ఢిల్లీలో జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఈ అవార్డును అందుకోనున్నారు.

తల్లిని మత్తులో ఉంచి బిడ్డను ఎత్తుకెళ్లారు

ఎల్బీనగర్‌లో నిందితుల అరెస్టు

భువనగిరి అర్బన్: భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి చంటిబిడ్డతోసహా వచ్చిన ఓ మహిళను చేరదీసినట్టు నటించి ఆమె బిడ్డను కిడ్నాప్‌చేసిన దంపతులను పోలీసులు అరెస్టుచేశారు. పాపను తిరిగి తల్లి ఒడికి చేర్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన తుసంబత్ జ్యోతి భర్తతో గొడవపడి తమ 15 నెలల పాప పూజను తీసుకొని ఈ నెల రెండున యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ రైల్వేస్టేషన్‌కు చేరింది. బీబీనగర్‌లో ప్లాస్టిక్, కాగితాలు ఏరుకుని జీవనం సాగించే పిట్టల మాధవి, గుజ్జర్ రాజు దంపతులకు జ్యోతి కనిపించింది. వారికి పిల్లలు లేకపోవడంతో పాపను కిడ్నాప్‌చేయాలనే ఉద్దేశంతో జ్యోతికి మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకెళ్లారు. రెండ్రోజులపాటు కూల్‌డ్రింక్‌లో మద్యం కలిపి ఇచ్చి ఆమె మత్తునుంచి తేరుకోకుండా చేశారు. ఐదున పూజను తీసుకొని రాజు దంపతులు ఉడాయించారు. మత్తు నుంచి తేరుకున్న జ్యోతికి పూజ కనిపించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. సోమవారం హైదరాబాద్ ఎల్బీనగర్‌లో నిందితులైన రాజు దంపతులను పోలీసులు అరెస్టుచేశారు.

కృష్ణాలో స్థిరంగా వరద

- ఆల్మట్టి, నారాయణపుర, తుంగభద్ర నుంచి తగ్గిన అవుట్‌ఫ్లో
- నాగార్జునసాగర్ రెండు క్రస్ట్‌గేట్ల ఎత్తివేత
- ఎల్లంపల్లి 4 గేట్ల ద్వారా నీటి విడుదల



నాగార్జునసాగర్ డ్యాం 2 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

హైదరాబాద్/జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి/నంబికొండ/చింతలపాలెం/కేతేపల్లి/భద్రాద్రికొత్తగూడెం జిల్లా ప్రతినిధి/అంతర్గాం, నమస్తే తెలంగాణ: కృష్ణా బేసిన్‌లో వరద స్థిరంగా కొనసాగుతున్నది. గోదావరిలో మాత్రం వరద తగ్గుముఖం పట్టింది. కృష్ణాలోని ఆల్మట్టి, నారాయణపుర జలాశయాల నుంచి అవుట్‌ఫ్లో స్వల్పంగానే ఉన్నది. ఉజ్జయిని, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి వరద భారీగా తగ్గింది. శ్రీశైలం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతో సాగర్ డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది. దీంతో సోమవారం సాయంత్రం నుంచి రెండు క్రస్ట్ గేట్లను పది అడుగుల మేరఎత్తి నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టుకు నిలకడగా వరద వస్తున్నది. హైదరాబాద్‌లో కురుస్తున్న వానలకు నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టుకు 2,780 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది.

శ్రీరాంసాగర్‌కు భారీగా తగ్గిన వరద

గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ జలాశయానికి వరద భారీగా తగ్గింది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇన్‌ఫ్లో వస్తుండటంతో సాయంత్రం అధికారులు నాలుగు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 23.1 అడుగుల వద్ద నిలకడగా ప్రవహిస్తున్నది. తాలిపేరు, కిన్నెరసానికి ఇన్‌ఫ్లో వస్తున్నది.

వివిధ ప్రాజెక్టుల్లో సోమవారం నాటి నీటిమట్టాల వివరాలు..

రిజర్వాయర్	ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో	ప్రస్తుత మట్టం అడుగుల్లో	పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో	ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	1,705.00	1,704.72	129.72	128.19	15,000	15,000
నారాయణ్‌పుర	1,615.00	1,614.86	37.64	37.54	20,000	10,440
ఉజ్జయిని	1,630.00	1,630.00	117.24	117.24	5,470	6,000
జూరాల	1,045.00	1,044.69	9.66	9.46	46,000	37,837
తుంగభద్ర	1,633.00	1,633.00	100.86	100.86	9,830	9,756
శ్రీశైలం	885.00	884.80	215.81	214.85	52,897	83,558
నాగార్జునసాగర్	590.00	590.00	312.05	312.05	78,722	78,722
పులిచింతల	175.00	174.87	45.77	45.56	46,396	46,396
సింగూరు	1,717.93	1,670.60	29.91	0.49	30	30
నిజాంసాగర్	1,405.00	1,384.01	17.18	2.19	1,340	42
శ్రీరాంసాగర్	1,091.00	1,080.60	90.31	54.10	19,720	659
లోయర్‌మానేర్	920.00	909.15	24.07	15.69	3,434	286
శ్రీరాజరాజేశ్వర	1,043.31	997.67	25.873	4.50	0	3,250
కడెం	700.00	698.80	7.60	7.29	1,123	832
ఎల్లంపల్లి	485.56	485.11	20.18	19.79	23,139	11,192

మూడు జిల్లాల్లో భారీ వర్షం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీగా, రాజన్న సిరిసిల్ల, వనపర్తి, మహబూబాబాద్ జిల్లాలతోపాటు గ్రేటర్ హైదరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పిడుగుపాటుకు మహబూబాబాద్ జిల్లాలో మహిళ మరణించింది. ఆదిలాబాద్ జిల్లా బోథ్, ఉట్నూర్ మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. అరగంటపాటు కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షానికి తోడు గాలి వీయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఓ మోస్తరు వర్షం కురువగా, అడ్డాకుల మండలం బలీదుపల్లిలో సోమవారం ఉదయం భారీ వర్షం పడింది. దీంతో జాతీయ రహదారి నుంచి బలీదుపల్లికి వెళ్లే మార్గంలో ఒంపు కాల్వ ఉధృతంగా ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వనపర్తి జిల్లా కేంద్రంలో సోమవారం గంటపాటు వర్షం కురిసింది. అత్యధికంగా వీపనగండ్ల 2.92 సెం.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంతోపాటు లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, పాల్వంచ మండలాల్లో అరగంటసేపు భారీగా కురిసింది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోద్గులగూడెం శివారులో పిడుగుపాటుకు పొలంలో పనిచేస్తున్న మహిళా కూలీ నర్సమ్మ (48) మరణించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో అరగంట సేపు కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్‌లోని చార్మినార్, అబిడ్స్, సికింద్రాబాద్, నేరేడ్‌మెట్, కాప్రా తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

వచ్చే మూడ్రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు

రాగల మూడ్రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నది. దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర కోస్తా తమిళనాడు తీరాలకు దగ్గరలో పశ్చిమ మధ్య బంగాళాఖాతం దానిని ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో సముద్రమట్టానికి 4.5 కి.మీ. ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. ఇది మరింత ఎత్తుకు వెళ్లి నైరుతి వైపునకు వంపు తిరిగి ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు వచ్చే మూడ్రోజుల్లో తెలంగాణలోని చాలాచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నదని ఆయన పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదన్నారు.

ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో రోడ్డుపై పారుతున్న వరద

వేములవాడలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జలమయమైన రహదారి

ఆస్తికోసం అమ్మపై హత్యాయత్నం

- నల్లగొండ జిల్లా పార్వతీపురంలో దారుణం

నిడమనూరు: ఆస్తికోసం కన్నతల్లినే కొడుకు చంపబోయిన దారుణ ఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం పార్వతీపురంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన ఇట్టె కోటయ్య, కిట్టమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు. వారికి వివాహాలుకాగా, పెద్దకుమారుడు వేరుగా ఉంటున్నారు. తల్లిదండ్రులతో చిన్నకుమారుడు గ్రామంలో ఉంటున్నారు. కుటుంబ అవసరాల కోసం కోటయ్య దంపతులు అప్పుచేశారు. రుణదాతల ఒత్తిడిపై తమ వ్యవసాయ భూమిలో కొంతవారిపేరున రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయమై పెద్దకుమారుడు సూర్యనారాయణ కొంతకాలంగా తల్లిదండ్రులతో ఘర్షణ పడుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం కోటయ్య, చిన్నకుమారుడు మిర్యాలగూడకు వెళ్లగా కిట్టమ్మ (70) ఇంట్లో ఒంటరిగా ఉన్నది. అదే సమయంలో ఇంటికొచ్చిన సూర్యనారాయణ ఆస్తి విషయంలో తల్లితో ఘర్షణకు దిగాడు. బీరుసీసాను పగులగొట్టి తల్లిపై దాడిచేశాడు. గొంతులో పొడిచి పారిపోయాడు. తీవ్ర రక్తస్రావమై రక్తపు మడుగులో అపస్మారక స్థితికి చేరిన కిట్టమ్మను గమనించిన స్థానికులు మిర్యాలగూడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ
ఆట
8
[కరీంనగర్]
మంగళవారం 24 సెప్టెంబర్ 2019
WWW.NTNEWS.COM

అమిత్,మనీశ్‌కు నజరానా

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకాలతో దేశ ప్రతిష్ఠను ఇనుమడింపచేసిన బాక్సర్లు అమిత్ పంగల్, మనీశ్ కౌశిక్ నగదు ప్రోత్సాహం దక్కింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తొలిసారి భారత్‌కు రజతం అందించి చరిత్ర సృష్టించిన అమిత్‌తో పాటు కౌశిక్‌ను కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. రజత విజేత అమిత్‌కు రూ.14 లక్షలు, కాంస్యం సాధించిన కౌశిక్‌కు రూ.8 లక్షలను మంత్రి కిరణ్ అందజేశారు. హర్యానాకు చెందిన 24 ఏండ్ల అమిత్ గత కొంత కాలంగా నిలకడగా రాణిస్తూ వస్తున్నాడు. 2018 ఆసియా క్రీడల్లో స్వర్ణం, కామన్వెల్త్‌లో రజతం, ఆసియా చాంపియన్‌షిప్‌లో రజతం, తాజాగా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వెండి పతకంతో మెరిశాడు. బరిలోకి దిగిన దాదాపు ప్రతి టోర్నీలో పతకం సాధిస్తున్న అమిత్..రానున్న టోక్యో(2020)లో సత్తాచాటేందుకు తహతహలాడుతున్నాడు. బాక్సింగ్ విజేతలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ 'గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు రాణించడం పట్ల చాలా గర్వంగా ఉంది. బాక్సింగ్‌లో దేశానికి మంచి భవిష్యత్తు ఉంది. మెగాటోర్నీలో పతక విజేతలతో పాటు క్వార్టర్స్ చేరిన బాక్సర్లను కూడా అభినందిస్తున్నాను. ఒలింపిక్స్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచేందుకు ఆటగాళ్లకు ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుంది' అని మంత్రి అన్నారు.

మాజీ క్రికెటర్ ఆప్టే మృతి



ముంబై : టీమ్‌ఇండియా మాజీ ఓపెనర్ మాధవ్ ఆప్టే(86) గుండెపోటుతో సోమవారం ఉదయం మృతి చెందారు. ముంబైలోని బ్రీచ్ కాండీ ద వాఖానాలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. భారత్ తరపున మాధవ్ ఆప్టే ఏడు టెస్టులు ఆడి ఓ శతకం సహా 542 పరుగులు చేశారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 67 మ్యాచ్‌ల్లో 3,336 పరుగులతో రాణించారు. 1952లో పాకిస్తాన్‌తో ముంబైలో జరిగిన మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన ఆయన 1953 ఏప్రిల్‌లో వెస్టిండీస్‌తో చివరి మ్యాచ్ ఆడారు. ఓ టెస్టు సిరీస్‌లో 400 పరుగులు చేసిన తొలి ఓపెనర్‌గా అప్పట్లో ఆప్టే రికార్డు నెలకొల్పారు. వినూ మన్కడ్, పాలీ ఉమ్రిగర్, విజయ్ హజారే, రుసి మోదీ లాంటి దిగ్గజాలతో కలిసి మాధవ్ ఆప్టే ఆడారు. క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కి 1989లో అధ్యక్షుడిగానూ పనిచేశారు. శివాజీ పార్క్‌లో జరిగిన ఆప్టే అంత్యక్రియలకు మాజీ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, దిలీప్ వెంగ్‌సర్కార్, మిలింద్ తదితరులు హాజరై నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో పాటు పలువురు మాజీ, ప్రస్తుత ఆటగాళ్లు సంతాపం వ్యక్తం చేశారు.

ఈసారైనా..

నేటి నుంచి కొరియా ఓపెన్.. బరిలో సైనా,సింధు, ప్రణీత్

ఇంచియాన్(కొరియా): భారత షట్లర్లు మరో టైటిల్ వేటకు సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే కొరియా ఓపెన్ సూపర్ - 500 టోర్నమెంట్‌లో బరిలోకి దిగనున్నారు. ప్రపంచ చాంపియన్‌షిప్ మినహా ఏ టోర్నీలోనూ అనుకున్న స్థాయిలో ఫలితాలు రాని నేపథ్యంలో ఎలాగైనా టైటిల్ సాధించాలని పట్టుదలగా ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ చాంపియన్ పీవీ సింధుతో పాటు సైనా నెహ్వాల్, పురుషుల సింగిల్స్‌లో కాంస్య విజేత సాయి ప్రణీత్, పారుపల్లి కశ్యప్ బరిలో ఉన్నారు.
ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించాక చైనా ఓపెన్‌లో బరిలోకి దిగిన స్టార్ షట్లర్ పీవీ సింధు తీవ్రంగా నిరాశపరిచింది. దీన్ని సరిదిద్దుకునేందుకు కొరియా ఓపెన్‌లో సత్తా చాటాలని పట్టుదలగా ఉంది. తొలి రౌండ్‌లో బీవాంన్ జంగ్(అమెరికా)తో సింధు పోటీ పడనుంది. మరోస్టార్ సైనా నెహ్వాల్ తొలి రౌండ్‌లో కిమ్ గాఇన్(కొరియా)తో తలపడనుంది. చాంపియన్‌షిప్‌లో కాంస్యం సహా చైనా ఓపెన్‌లోనూ క్వార్టర్స్ వరకు వెళ్లిన సాయి ప్రణీత్ పురుషుల సింగిల్స్ పోరాటానికి సిద్ధమయ్యాడు. తొలి రౌండ్‌లో అంటోసెన్(డెన్మార్క్) రూపంలో ప్రణీత్‌కు కఠిన ప్రత్యర్థి ఎదురయ్యాడు. కశ్యప్... క్వాలిఫయర్‌ను ఢీకొననున్నాడు. గత నెల జరిగిన థాయ్‌లాండ్ ఓపెన్‌లో విజేతలుగా నిలిచిన సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి - చిరాగ్ శెట్టి జోడీ తొలి రౌండ్‌లో నాలుగో సీడ్ తకేషి కమురా - కీగో సొనడా(జపాన్)తో తలపడతారు. అలాగే మను అత్రి - సుమిత్ రెడ్డి కూడా బరిలో ఉన్నారు.



కోహ్లీకి మందలింపు

బెంగళూరు : టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి డీమెరిట్ పాయింట్ విధించడంతో పాటు దురుసుగా ప్రవర్తించి నిబంధనలు ఉల్లంఘించడం పట్ల అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) మందలించింది. బెంగళూరులో దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో ప్రత్యర్థి పేసర్ భుజాన్ని కోహ్లీ ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టాడని నిర్ధారించిన ఐసీసీ, ఈ మేరకు చర్యలు తీసుకుంది. మ్యాచ్ ఐదో ఓవర్‌లో పరుగు పూర్తి చేసే క్రమంలో సఫారీ బౌలర్ హెండ్రిక్స్‌ను విరాట్ ఢీకొట్టాడు. దీనిపై అంపైర్లు ఐసీసీకి ఫిర్యాదు చేశారు. కోహ్లీకి ఇది మూడో డీమెరిట్ పాయింట్. 2018లో దక్షిణాఫ్రికాతో టెస్టు సందర్భంగా, ఈ ఏడాది ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో మ్యాచ్‌లో కోహ్లీ ఒక్కో డీమెరిట్ పాయింట్ పొందాడు. 24 నెలల వ్యవధిలో ఓ ఆటగాడు నాలుగు డీమెరిట్ పాయింట్లు పొందితే అవి సస్పెన్షన్ పాయింట్లుగా మారుతాయి. రెండు సస్పెన్షన్ పాయింట్లు ఓ టెస్టు లేదా రెండు వన్డేలు లేదా రెండు టీ20ల నిషేధానికి సమానం. నాలుగు సస్పెన్షన్ పాయింట్ల తర్వాత నిర్ణీత మ్యాచ్‌లకు ఆ ఆటగాడు దూరం కావాల్సి ఉంటుంది.

వీడ్కోలు పలకను

న్యూఢిల్లీ: తాను ఇప్పట్లో రెజ్లింగ్ నుంచి తప్పుకోనని భారత కుస్తీ వీరుడు, డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ సుశీల్ కుమార్ స్పష్టం చేశాడు. గతేడాది ఆసియా క్రీడలు సహా ఇటీవలి చాంపియన్‌షిప్‌లో సరైన ప్రదర్శన చేయని నేపథ్యంలో వచ్చిన ఊహాగానాలపై సుశీల్ సోమవారం మాట్లాడుతూ.. 'నేను తిరిగి వచ్చానని ప్రపంచానికి చెప్పేందుకు చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగా. ఆసియా క్రీడల కంటే మెరుగ్గానే ఆడా. 90 రోజుల శిక్షణతో మునుపటి సామర్థ్యం, డిఫెన్స్ తిరిగి వస్తుందని మా కోచ్ మలికోవ్ చెప్పారు. ఇప్పుడు చురుగ్గా కదులుతున్నా. పోటీ పడేందుకు పూర్తిగా సన్నద్ధమవుతున్నా. నేను ఇప్పుడే రెజ్లింగ్‌కు వీడ్కోలు పలకను. మరింత శిక్షణ తీసుకొని టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలని నిర్ణయించుకున్నా' అని 36 ఏండ్ల సుశీల్ చెప్పాడు. కెరీర్‌లో సుశీల్.. బీజింగ్(2008), లండన్(2012) ఒలింపిక్స్‌లో వరుసగా కాంస్యం, రజత పతకాలు సాధించాడు.

విఫల ప్రయోగాలు!

'శ్రేయస్ అయ్యర్ లాంటి ఆటగాడు జట్టులో ఉన్నప్పుడు పంత్‌ను నాలుగులో పంపడం కంటే.. ఐదో స్థానంలో ఆడించడమే ఉత్తమం' దక్షిణాఫ్రికాతో మూడో టీ20కి ముందు బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్ చేసిన వ్యాఖ్య ఇది. అయితే ఆ మాటలను పెద్దగా చెవికెక్కించుకోని టీమ్ మేనేజ్‌మెంట్ యథాలాపంగా పంత్‌ను నాలుగులో దించింది. చిన్నస్వామి మైదానం చిన్నది కావడం.. దీనికి తోడు ఎనిమిదో ఓవర్లోనే పంత్ క్రీజులోకి రావడం.. అయ్యర్, పాండ్యా బ్రదర్స్, జడేజా, సుందర్ బ్యాటింగ్ చేయాల్సి ఉండటంతో.. భారత్ భారీ స్కోరు చేయడం ఖాయమే అనిపించింది. కానీ అందుకు భిన్నంగా చచ్చీచెడి బంతికో పరుగు చేయగలిగింది. దీనికి ప్రధాన కారణం మిడిలార్డర్ వైఫల్యమే అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

చిన్నస్వామి పిచ్‌పై జరిగిన గత ఆరు మ్యాచ్‌ల్లో టాస్ గెలిచిన జట్లు లక్ష్యఛేదనకే మొగ్గుచూపాయి. అందుకు భిన్నంగా ఆదివారం టాస్ నెగ్గిన కోహ్లీ.. మొదట బ్యాటింగ్‌కు సై అన్నాడు. 'యువ ఆటగాళ్లు కంఫర్ట్ జోన్‌లో కాకుండా.. కఠిన పరిస్థితుల్లో ఒత్తిడిని ఎలా జయించాలో తెలుసుకోవాలి' అని తన నిర్ణయాన్ని సమర్థించుకున్నాడు. ఇలాంటి తరుణంలో పది ఓవర్లలోపే మొదటి ముగ్గురు బ్యాట్స్‌మెన్ పెవిలియన్ చేరారు. దీంతో మిడిలార్డర్ 'టెస్ట్' మొదలైంది. పదే పదే వారిస్తున్నా పెడచెవిన పెడుతున్న రిషబ్ పంత్.. గుడ్డెద్దు చేలో పడ్డట్లు చెత్త షాట్ ఆడి వికెట్ ఇచ్చుకునే సంప్రదాయాన్ని ఈ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తే.. అయ్యర్, పాండ్యా బ్రదర్స్ పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో జట్టు మూల్యం చెల్లించుకుంది.

అయితే కరీబియన్ టూర్‌లో ప్రత్యర్థి నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురు కాక పోగా.. దక్షిణాఫ్రికాతో ఆది వారం జరిగిన మ్యాచ్‌లో తక్కువ స్కోరును కాపాడుకోవడంలో కొత్త కుర్రాళ్లు నిరాశ పరిచారు. సఫారీలకు తక్కువ టార్గెట్ ఇచ్చారనే అంశాన్ని పక్కన పెడితే.. లక్ష్య ఛేదనలో ఒక్క వికెట్ మాత్రమే పడగొట్టడం ఆందోళన కలిగించే అంశం. వరల్డ్‌కప్ కోసం తమ తొలి ప్రాధాన్య స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్ అని పలుమార్లు స్పష్టం చేసినా కెప్టెన్ విరాట్ కోహ్లీ.. వెస్టిండీస్ టూర్‌తో పాటు తాజా సిరీస్‌లోనూ 'కుల్చా'జోడీని పక్కనపెట్టి వారి స్థానంలో వాషింగ్టన్ సుందర్, కృనాల్ పాండ్యాకు జట్టులో చోటు కల్పించాడు.

ధోనీ లేకపోవడంతోనే..!

టీమ్‌ఇండియాలో టాప్ త్రీ తర్వాత నమ్మదగ్గ బ్యాట్స్‌మెన్ కనిపించకపోవడం మేనేజ్‌మెంట్‌ను పునరాలోచనలో పడేసేలా ఉంది. పంత్, అయ్యర్, హార్దిక్, కృనాల్ ఇలా ఆ తర్వాత వచ్చే వారిలో ప్రతిభ ఉన్నా నిలకడ లేకపోవడం జట్టుకు సంకటంగా మారింది. వీరంతా ఐపీఎల్లో తమ జట్లకు ఎన్నో మరుపురాని విజయాలను అందించిన వారే అయినా.. అంతర్జాతీయ స్థాయిలో మాత్రం కుదురుగా పరుగులు చేయలేకపోతున్నారు. పాండ్యా మెరుగ్గానే ఆడుతున్నా.. పంత్ మాత్రం పూర్తిగా నిరాశ పరుస్తున్నాడు. నిన్న మొన్నటి వరకు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మహేంద్రసింగ్ ధోనీ మిడిలార్డర్ భారాన్ని మోస్తూ వచ్చాడు. ప్రస్తుతం అతడు జట్టుకు దూరంగా ఉంటుండటంతో కొత్త కుర్రాళ్లపై ఆ బాధ్యత పడింది. అయితే ఈ రెండు సిరీస్‌ల్లో వారు తమ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించ లేకపోయారనే చెప్పాలి. పొట్టి ప్రపంచకప్‌కు ముందు మిడిలార్డర్ కుదురుకోకపోతే మాజీ కెప్టెన్ మహీని తిరిగి రప్పించక తప్పదేమో.

రిస్క్ తీసుకోవాల్సిందే..

లోయర్ ఆర్డర్‌కు కూడా బ్యాటింగ్ చేసే సత్తా ఉండాలని తపిస్తున్న కెప్టెన్ అందుకు తగ్గట్టే ఆదివారం మ్యాచ్‌లో 9 మంది బ్యాటింగ్ చేయగల ఆటగాళ్లతో బరిలో దిగాడు. అయినా ఫలితం మాత్రం ప్రతికూలంగానే వచ్చింది. మ్యాచ్ అనంతరం అతడు మాట్లాడుతూ.. 'రిస్క్ తీసుకోవాలని ముందే నిర్ణయించుకున్నాం. అందుకే టాస్ గెలిచినా.. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాం. కష్టకాలంలో కుర్రాళ్లు ఒత్తిడిని ఎలా అధిగమిస్తారో పరీక్షించాలనుకున్నాం. అయితే మా బ్యాట్స్‌మెన్ విఫలమవడంతో 134 పరుగులే చేశాం. అంత తక్కువ స్కోరును కట్టడి చేయమని బౌలర్లపై ఒత్తిడి తేవడం సబబు కాదు. మ్యాచ్‌లు నెగ్గాలంటే రిస్క్ తీసుకోక తప్పదు. పోరాడకుండానే ఏది సాధ్యపడదు'అని అన్నాడు.

నాలుగులో పంత్ సెట్‌కాడు

మిడిలార్డర్‌కు కీలకమైన నాలుగో స్థానంలో రిషబ్ పంత్‌ను బ్యాటింగ్‌కు పంపడం సరైంది కాదని భారత మాజీ ఆటగాడు వీవీఎస్ లక్ష్మణ్ అభిప్రాయపడ్డాడు. 'పంత్ సహజసిద్ధంగా దూకుడైన శైలిలో బ్యాటింగ్ చేసే ఆటగాడు. కానీ దురదృష్టవశాత్తు అంతర్జాతీయ క్రికెట్‌లో అతడు నాలుగో స్థానంలో పెద్దగా రాణించలేకపోతున్నాడు. అందుకే అతడిని ఐదు లేదా ఆరో స్థానంలో దింపాలి. ఆ స్థానాల్లో అయితే.. భారీ షాట్లు ఆడేందుకు స్వేచ్ఛ ఉంటుంది. ప్రస్తుత జట్టులో హార్దిక్ పాండ్యా, శ్రేయస్ అయ్యర్‌లో ఒకరిని నాలుగులో బ్యాటింగ్ పంపి.. పంత్‌ను ఆ తర్వాత దింపితే ఫలితం ఉంటుంది' అని లక్ష్మణ్ అన్నాడు.

నిర్భీతి నుంచి నిర్లక్ష్యానికి..

రిషబ్ పంత్ అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన కొత్తలో.. అతడికి భయమన్నదే లేదని కితాబిచ్చిన క్రికెట్ పండితులు.. ప్రస్తుతం అతడి షాట్ సెలెక్షన్ చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో భాగంగా క్రీజులో అడుగు పెట్టింది మొదలు ప్రత్యర్థి బౌలర్లను చీల్చి చెండాడే ఈ 21 ఏండ్ల చిచ్చరపిడుగు అంతర్జాతీయ స్థాయిలో మాత్రం పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నాడు. భారత్ తరపున ఇప్పటి వరకు 20 టీ20లు ఆడిన రిషబ్.. 20.31 సగటుతో 325 పరుగులు చేశాడు. ఇందులో 2 అర్ధశతకాలు మాత్రమే ఉన్నాయి. ఆ రెండు కూడా సిరీస్ విజయాలు సాధించాక వచ్చినవే. విచిత్రంగా రెండూ వెస్టిండీస్‌పైనే.

19, 4, 65 నాటౌట్, 4, 0, 1, 3..

గత 7 ఇన్నింగ్స్‌ల్లో పంత్ స్కోర్లివి. ఇందులో కరీబియన్ టూర్‌లో భాగంగా వెస్టిండీస్‌పై హాఫ్‌సెంచరీ చేసిన సందర్భంలో మినహా మిగిలిన ఆరు సార్లు స్వల్ప స్కోరుకే అతడు ఔటయ్యాడు. అందులో ఐదుసార్లు క్యాచౌట్ కావడం అతడి షాట్ సెలెక్షన్ తప్పని నిరూపిస్తున్నది. జట్టు పరిస్థితిని అర్థం చేసుకోకుండా.. అడ్డదిడ్డంగా షాట్లు ఆడటం మంచిది కాదని చీఫ్ కోచ్ రవిశాస్త్రి హెచ్చరించిన తర్వాత కూడా అతడిలో ఎలాంటి మార్పు రాకపోవడం బాధాకరం. పంత్ లాంటి యువ ఆటగాడిని నాలుగో స్థానంలో కాకుండా.. ఫినిషర్ రూపంలో వినియోగించుకుంటే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని పలువురు మాజీలు సూచిస్తున్నా.. కోహ్లీ పదే పదే అతడిని నాలుగులో బ్యాటింగ్‌కు దింపుతూ.. పరోక్షంగా పంత్ కెరీర్‌ను సందిగ్ధంలో పడేస్తున్నాడు.

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

వార్నర్ డ్రైవింగ్‌పై నిషేధం

లండన్ : రెండేండ్లలో ఆరుసార్లు మితిమీరిన వేగంతో కారు నడిపిన కారణంగా ఆస్ట్రేలియా దిగ్గజ స్పిన్నర్ షేన్ వార్న్ ఏడాది కాలం డ్రైవింగ్ నిషేధానికి గురయ్యాడు. ఇంగ్లండ్‌లోని వెస్ట్ లండన్‌లో ఉంటున్న వార్నర్ గంటకు 40 మైళ్ల వేగంతో వెళ్లాల్సిన జోన్‌లో 47 మైళ్లతో తన జాగ్వార్ కారులో దూసుకెళ్లాడు. వార్నర్ ఆరుసార్లు ఇలాంటి తప్పిదానికి పాల్పడ్డాడని తేల్చిన కోర్టు అతడిపై చర్యలు తీసుకుంది. ఏడాది పాటు డ్రైవింగ్ నిషేధంతో పాటు 1,845 పౌండ్ల (దాదాపు రూ.లక్షా 62వేలు)ను చెల్లించాలని వార్నర్‌ను ఆదేశించింది.

ఇక మహిళల పోరు

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టీ20

సూరత్: దక్షిణాఫ్రికాతో టీ20 ఫార్మాట్‌లో తలపడేందుకు భారత మహిళల జట్టు సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టీ20 మంగళవారం ఇక్కడ ప్రారంభం కానుంది. ఆ జట్టుతో గత ఐదు మ్యాచ్ (ఒకటి ఫలితం తేలలేదు)ల్లో మూడు గెలిచి, ఒకటి మాత్రమే ఓడిన టీమ్‌ఇండియా మంచి ఆత్మవిశ్వాసంతో ఉంది. అందునా స్వదేశం కావడం మరింత అనుకూలాంశం. అయితే ఆదివారం జరిగిన రెండో వామప్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా మహిళల జట్టు చేతిలో బోర్డు ప్రెసిడెంట్ ఎలెవెన్ టీమ్ 83 పరుగుల తేడాతో భారీ పరాజయం చవిచూసింది. భారత మహిళల జట్టు ప్రధానంగా స్మృతి మందన, వేదా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్, రోడ్రిగ్స్‌పైనే ఆధారపడి ఉంది. మిథాలీరాజ్ టీ20ల నుంచి రిటైరవడంతో జట్టు ఎలా ఆడుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఇక బౌలింగ్ విభాగంలో పేసర్లు శిఖా పాండే, పూజతో పాటు స్పిన్నర్లు పూనమ్, అనూజ సఫారీలను కట్టడి చేసేందుకు సిద్ధమయ్యారు.

హర్మన్‌ప్రీత్

సునేలుస్

ద్యుతీ చంద్

భవిష్యత్తులో రాజకీయాల్లోకి వస్తా

భువనేశ్వర్: భవిష్యత్తులో రాజకీయాల్లోకి వస్తా..ఈ మాట అంటున్నది మరెవరో కాదు భారత స్టార్ స్ప్రింటర్ ద్యుతీ చంద్. అవును బరిలోకి దిగిన ప్రతి టోర్నీలో తనదైన శైలిలో పతకాలు కొల్లగొడుతున్న ద్యుతి..తన సోమవారం ట్విట్టర్ ద్వారా తన మనసులోని మాట బయటపెట్టింది. 'నాకు చిన్నప్పటి నుంచి రాజకీయాలంటే చాలా ఆసక్తి. మా కుటుంబం చాలా ఏండ్ల నుంచి రాజకీయాల్లో భాగమై ఉంది. మా గ్రామానికి మా అమ్మ సర్పంచ్‌గా పనిచేసింది. ఏదైనా రాజకీయ పార్టీ నుంచి ఆహ్వానం వస్తే చేరుతాను. ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాలు మంచి వేదికగా పనిచేస్తాయనేది నా భావన' అని ద్యుతి అంది.

ఫిక్సింగ్‌ను పూర్తిగా నియంత్రించలేం: గవాస్కర్

న్యూఢిల్లీ: క్రికెట్‌లో ఫిక్సింగ్‌ను పూర్తిగా నియంత్రించలేమని భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అన్నాడు. ఇటీవల తమిళనాడు ప్రీమియర్ లీగ్(టీఎన్‌పీఎల్)లో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగినట్లు వార్తలు వెలువడిన నేపథ్యంలో గవాస్కర్ స్పందించాడు. ఓ వైబ్‌సైట్‌తో మాట్లాడుతూ 'మనిషిలో దురాశ అనే దాన్ని రూపుమాపడం చాలా కష్టం. అభివృద్ధి చెందిన సమాజంలో ఇంకా నేరస్థులు ఉన్నారు. క్రికెట్ దానికి అతీతమేమి కాదు. వక్రమార్గంలో డబ్బులు సంపాదించాలనే ఆశ ఉన్నవారు తప్పటడుగులు వేస్తూనే ఉంటారు. డబ్బుల కోసం ఏదైనా చేయడానికి కొంత మంది సిద్ధంగా ఉంటారు. అందుకే ఫిక్సింగ్‌ను పూర్తిగా రూపుమాపలేము' అని గవాస్కర్ అన్నాడు.

పాట్నాపై హర్యానా గెలుపు

జైపూర్: 'డుబ్కీ' కింగ్ ప్రదీప్ నర్వాల్ సత్తాచాటినా ప్రొ కబడ్డీ లీగ్‌లో పాట్నా పైరేట్స్ పరాజయం పాలైంది. సోమవారం ఇక్కడ జరిగిన పోరులో పాట్నా 34-39తో హర్యానా స్టీలర్స్ చేతిలో ఓడింది. హర్యానా తరపున వికాస్ (13 పాయింట్లు), ప్రశాంత్ రాయ్ (8 పాయింట్లు) రాణించగా.. పాట్నా తరపున ప్రదీప్ 17 పాయింట్లతో ఒంటరి పోరాటం చేశాడు. ఇప్పటి వరకు లీగ్‌లో 17 మ్యాచ్‌లాడిన స్టీలర్స్ 11 విజయాలు, 5 పరాజయాలు ఒక 'టై'తో మొత్తం 59 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో మూడో స్థానంలో ఉంది. మరో విజయం సాధిస్తే హర్యానా ప్లేఆఫ్స్‌కు క్వాలిఫై అవుతుంది. దబాంగ్ ఢిల్లీ, బెంగళూరు బుల్స్ మధ్య జరిగిన మరో మ్యాచ్ 39-39తో 'టై'గా ముగిసింది.

సెన్సెక్స్	నిఫ్టీ
39,090	11,600
↗ 1075	↗ 326

ముడి చమురు (బ్రెంట్) ↘ 64.66 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)	
24 క్యారెట్లు	38,690
క్యారెట్లు	---
వెండి (కిలో)	47,990

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	67.70	73.20
యూరో	74.40	81.40
బహ్రెయిన్ దినార్	176.00	190.00
కువైట్ దినార్	221.00	235.00
సౌదీ రియాల్	17.50	19.30
యూఏఈ దిర్హామ్	18.00	20.00

బ్యాంకుల సమ్మె వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన రెండు రోజుల సమ్మె వాయిదాపడింది. పలు బ్యాంకులను విలీనం చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకింగా ఈ నెల 26 నుంచి 27 వరకు సమ్మె చేయాలని యోచించిన నాలుగు బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు.. కేంద్ర ఆర్థిక కార్యదర్శి రాజీవ్ కుమార్ ఇచ్చిన హామీతో మెత్తపడ్డారు. ఈ విలీనంతో ఎదురవనున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని కుమార్ హామీ ఇవ్వడంతో సమ్మెను వాయిదా వేయాల్సి వచ్చిందని ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి.

థామస్ కుక్ దివాలా!

నిలిచిపోయిన ఎయిర్‌లైన్స్, టూర్ ఆపరేషన్స్

ఇబ్బందుల్లో 6 లక్షల పర్యాటకులు ▪ రోడ్డునపడ్డ 22 వేల ఉద్యోగులు

అత్యవసర చర్యల్లో బ్రిటన్ ▪ అద్దె విమానాల్లో స్వదేశానికి టూరిస్టుల తరలింపు

లండన్, సెప్టెంబర్ 23:

ప్రముఖ బ్రిటిష్ పర్యాటక, హోటల్, విమానయాన సేవల సంస్థ థామస్ కుక్ దివాలా తీసింది. పీకల్లోతు అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఈ 178 ఏండ్ల చరిత్ర కలిగిన దిగ్గజం.. ఆపత్కాల నిధుల సమీకరణలో విఫలమైంది. 250 మిలియన్ డాలర్ల (రూ.1,773 కోట్లు) రుణం పుట్టక సోమవారం ముఖం చాటేసింది. అప్పిచ్చేందుకు ప్రైవేట్ మదుపరులు ముందుకు రాకపోవడంతో చేతులెత్తేసింది. ఫలితంగా వివిధ దేశాలకు చెందిన దాదాపు 6 లక్షల మంది పర్యాటకులు ఇబ్బందుల్లో పడితే, ప్రపంచవ్యాప్తంగా 22 వేల మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారు. గతకొంత కాలంగా తీవ్ర ఆన్‌లైన్ పోటీని ఎదుర్కొంటున్న థామస్ కుక్.. బుకింగ్స్‌ను ఆశించిన స్థాయిలో అందుకోలేకపోతున్నది. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోయాయి. చైనాకు చెందిన ఫోసున్ గ్రూప్.. థామస్ కుక్‌లో అతిపెద్ద వాటాదారుగా ఉండగా, ఇటీవలి 900 మిలియన్ పౌండ్ల రెస్క్యూ ప్యాకేజీలో 450 మిలియన్ పౌండ్ల సాయాన్ని ప్రకటించింది. మిగతా 450 మిలియన్ పౌండ్లను ఇతర రుణదాతలు, బ్యాంకులు అందించనున్నాయి. అయితే మరో 200 మిలియన్ పౌండ్ల రుణం కోసం చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. బ్రిటన్ ప్రభుత్వం సైతం నష్టాల భయంతో బెయిలవుట్ ప్యాకేజీ (ఆర్థిక సాయం)ని ఇవ్వలేమంది. దీంతో సోమవారం తెల్లవారుజాము 2 గంటలకు సంస్థ దివాలా తీసినట్లు థామస్ కుక్ యాజమాన్యం ప్రకటించేసింది.

విమానాశ్రయాల్లో పడిగాపులు

థామస్ కుక్ దివాలాతో ఆ సంస్థ ద్వారా విదేశాలకు వెళ్లిన లక్షలాది మంది పర్యాటకులు ఇప్పుడు విమానాశ్రయాల్లో పడిగాపులు గాస్తున్నారు. టూరిజం, హోటళ్లతోపాటు థామస్ కుక్ ఎయిర్‌లైన్స్ సేవలూ నడుస్తున్నాయి. అయితే ఒక్కసారిగా సంస్థ కుప్పకూలడంతో 6 లక్షల మంది పర్యాటకులు విదేశాల్లో చిక్కుకుపోయారు. వీరంతా రాబోయే రెండు వారాల్లో రిటర్న్ టిక్కెట్లను బుక్ చేసుకున్నవారు. దివాలా ప్రకటన వీరిలో భయాందోళనల్ని రేకెత్తిస్తున్నది. ఐరోపా దేశాలతోపాటు ఇతర దేశాల్లోని విమానాశ్రయాల వద్ద భారీగా క్యూలైన్లు కట్టారు. ఎప్పుడు ఇంటికి వెళ్తామో?.. తెలియని దుస్థితిలో ఉన్నామని ఇద్దరు పిల్లలతో టిక్కెట్ బుక్ చేసుకున్న ఓ పర్యాటకుడు కంటతడి పెట్టారు. నేరుగా తమ గమ్యస్థానాలకు విమానాలు లేవని, బస్సుల్లో ఎక్కి, దిగి వెళ్లామంటున్నారని అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. సరైన సమాచారం ఇవ్వడం లేదని, ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నామని మరో పర్యాటకుడు తన బాధను వెలిబుచ్చారు. రాత్రికిరాత్రి తమ ఆనందం ఆవిరైపోతుందని ఊహించలేదంటూ పర్యాటకులు ఆవేదన చెందుతున్నారు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత..

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్ ప్రభుత్వం మళ్లీ భారీ స్థాయిలో అత్యవసర చర్యలకు దిగింది. బ్రిటీష్ సివిల్ ఏవియేషన్ అథారిటీ డజన్లకొద్దీ చార్టర్ ప్లేన్లను అద్దెకు తీసుకుంటుండగా.. బల్గేరియా, క్యూబా, టర్కీ, అమెరికా తదితర దేశాల్లోని సుమారు లక్షా 50 వేల మంది బ్రిటన్ పర్యాటకులను తిరిగి స్వదేశానికి తెచ్చే ఏర్పాట్లు చేస్తున్నది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత విదేశాల నుంచి స్వదేశానికి బ్రిటన్ మళ్లీ ఇంత భారీ ఎత్తున పౌరులను తరలిస్తున్నది ఇదే కావడం గమనార్హం.

పెరిగిన బ్రిటన్ కష్టాలు

అసలే బ్రెగ్జిట్ (యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ బయటకు రావడం) సమస్యలతో సతమతమవుతున్న బ్రిటన్‌ను.. థామస్ కుక్ సంక్షోభం పెనం మీది నుంచి పొయ్యిలో పడేసినట్లు చేసింది. థామస్ కుక్ దివాలాతో దేశంలో 9 వేల మంది నిరుద్యోగులు అవుతుండగా, ప్రభుత్వ నిర్వహణే కష్టతరమైన సమయంలో విదేశాల్లో చిక్కుకున్న స్వదేశీయులను భారీ మొత్తంలో వెచ్చించి ఇండ్లకు చేర్చాల్సి వస్తున్నది. రెండేండ్ల క్రితం మోనార్చ్ ఎయిర్‌లైన్స్ దివాలా తీసిన సమయంలోనూ లక్షా 10 వేల మంది పర్యాటకులను స్వదేశానికి ప్రైవేట్ ఎయిర్‌లైన్స్‌లో బ్రిటన్ సర్కారు తరలించింది. దీంతో 60 మిలియన్ పౌండ్ల భారం పడింది. ఇప్పుడు ఈ మొత్తం సుమారు 100 మిలియన్ పౌండ్లకు చేరవచ్చన్న అంచనాలున్నాయి.

నిరాశలో ఫోసున్ గ్రూప్

నిధుల సమీకరణ విఫలం కావడం బాధాకరమని థామస్ కుక్ ప్రధాన వాటాదారు, చైనాకు చెందిన ఫోసున్ గ్రూప్ అసంతృప్తిని వ్యక్తం చేసింది. గత నెల 450 మిలియన్ పౌండ్లను అందించేందుకు అంగీకరించిన ఈ సంస్థ.. బదులుగా థామస్ కుక్ టూరిజం విభాగంలో 75 శాతానికి, విమానయాన విభాగంలో 25 శాతానికి తమ వాటాలను పెంచుకుంది. దాదాపు రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన సంస్థ.. ఈ విధంగా ముగిసిపోవడం విచారకరమని పేర్కొన్నది. ఆదివారం లండన్‌లో థామస్ కుక్ యాజమాన్యం.. రుణదాతలు, బ్యాంకర్లతో సమావేశమై అదనపు నిధుల కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అయితే ఈ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో లాభం లేదనుకున్న సంస్థ.. తెల్లవారకముందే దివాలా ప్రకటన చేసింది.

లండన్‌లోని గాట్విక్ ఎయిర్‌పోర్ట్‌లో బోసిపోయిన థామస్ కుక్ చెక్-ఇన్ డెస్కులు

భారత పర్యాటక రంగానికి దెబ్బ

ఏటా భారత్‌కు బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్‌ల నుంచి పెద్ద ఎత్తున సంపన్న వర్గాలకు చెందిన పర్యాటకులు వస్తున్నారు. వీరంతా థామస్ కుక్ ద్వారానే చేరుకుంటున్నారు. బ్రిటన్‌తోపాటు జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ తదితర ఐరోపా దేశాల్లో థామస్ కుక్ ప్రధాన టూరిజం ఆపరేటర్‌గా ఉన్నది మరి. అలాంటి థామస్ కుక్.. దివాలా తీయడంతో ఇకపై భారత్‌కు ఆయా దేశాల నుంచి వచ్చే పర్యాటకులు గణనీయంగా తగ్గిపోవచ్చన్న ఆందోళన పర్యాటక రంగం నుంచి కనిపిస్తున్నది. ఇదే జరిగితే విదేశీ మారకద్రవ్యాన్ని పెద్ద ఎత్తున కొల్పోక తప్పదన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. గతేడాది ఆగస్టుతో పోల్చితే ఈ ఏడాది ఆగస్టులో విదేశీ పర్యాటకుల సంఖ్య 1.6 శాతం పెరిగింది. గత నెల విదేశీ టూరిస్టుల్లో 8.01 శాతం బ్రిటనీయులే. 1.85 శాతం మంది జర్మనీ దేశస్తులు. ఈ క్రమంలో థామస్ కుక్ దివాలా మన పర్యాటక రంగాన్ని తీవ్రంగానే ప్రభావితం చేయవచ్చని ఢిల్లీకి చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ డైరెక్టర్ హర్జీందర్ సింగ్ అన్నారు. అసలే ఆర్థిక మాంద్యంలో ఉన్న పరిస్థితుల్లో థామస్ కుక్ దివాలా.. భారత ఆర్థిక వ్యవస్థకు శరాఘాతమేనన్న అభిప్రాయాలు నిపుణుల నుంచీ వ్యక్తమవుతున్నాయి.

మాకు సంబంధం లేదు

థామస్ కుక్ ఇండియా

థామస్ కుక్ బ్రిటన్‌తో తమకు ఎలాంటి సంబంధాలు లేవని థామస్ కుక్ ఇండియా లిమిటెడ్ ప్రకటించింది. 2012 నుంచి థామస్ కుక్ ఇండియా గ్రూప్ పూర్తిగా ప్రత్యేక సంస్థగా నడుస్తున్నదని సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. కెనడాకు చెందిన బహుళజాతి సంస్థ ఫెయిర్‌ఫ్యాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ (ఫెయిర్‌ఫ్యాక్స్) తొలుత 77 శాతం వాటాను, ఆ తర్వాత మిగతా వాటానూ హస్తగతం చేసుకుందని వెల్లడించింది. 'గడిచిన ఏడేండ్లుగా మేము స్వతంత్ర సంస్థగా ఉంటున్నాం' అని థామస్ కుక్ ఇండియా లిమిటెడ్ సీఎండీ మాధవన్ మీనన్ తెలిపారు.

క్షమించండి..

'ఎన్నో ఏండ్లుగా మాకు సహకరించిన మా భాగస్వాములు, సరఫరాదారులు, మద్దతుగా నిలిచిన వేలాది ఉద్యోగులు, లక్షలాది కస్టమర్లను క్షమించమని కోరుతున్నాం' అని థామస్ కుక్ సీఈవో పీటర్ ఫ్యాంక్‌హౌజర్ విజ్ఞప్తి చేశారు. సంస్థ దివాలా తీయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థను కాపాడేందుకు చివరిదాకా శ్రమించామని.. అయినా ఫలితం లేకపోయిందన్నారు. కాగా, సంస్థ ఆస్తులను విక్రయించి నిధులను సమకూర్చుకునే పనిలో ఉన్నట్లు థామస్ కుక్ యాజమాన్యం ప్రకటించింది.

కుప్పకూలడానికి కారణాలెన్నో..

1841లో ఓ ట్రావెల్ సంస్థగా మొదలైన థామస్ కుక్.. 178 ఏండ్లపాటు కొనసాగింది. 1855లో సహచర ఐరోపా దేశాలకు తొలిసారి బ్రిటన్ పర్యాటకులను పంపిన ఘనతను దక్కించుకున్న సంస్థ.. కాలక్రమేణా ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. అయితే 2007లో మై ట్రావెల్ గ్రూప్ విలీనంతో థామస్ కుక్ కష్టాలు మొదలైయ్యాయి. 2007 జూన్ 19న థామస్ కుక్ ఏజీ, మై ట్రావెల్ గ్రూప్‌లు ఏకమవగా, అప్పులు పెరిగిపోయాయి. హాలిడే బుకింగ్‌లో ఇంటర్నెట్ వినియోగం పెరుగడం, బ్రెగ్జిట్ పరిణామాలు కూడా సంస్థను ఇబ్బందుల్లోకి నెట్టాయి. మార్కెట్‌లో పెరిగిన పోటీని తట్టుకోలేకపోయింది. ప్రపంచవ్యాప్తంగా 2 కోట్ల మంది కస్టమర్లున్నా.. ట్రాన్స్‌పోర్టింగ్ నుంచే 10 బిలియన్ పౌండ్ల వార్షిక ఆదాయం అందుతున్నా.. నిలదొక్కుకోలేకపోయింది. మే నెలలో 1.5 బిలియన్ డాలర్ల (రూ.10 వేల కోట్లు) నష్టాన్ని. 2.1 బిలియన్ డాలర్ల (రూ.15 వేల కోట్లు) అప్పులను ప్రకటించింది. బ్రిటన్, జర్మనీ స్టాక్ మార్కెట్లలో లిస్టైన ఈ సంస్థ.. 2010లో 100 షేర్ల లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎఫ్‌టీఎస్ఈ) నుంచి, 2018లో 250 షేర్ల స్టాక్ ఎక్స్ఛేంజ్ నుంచి వైదొలిగింది.

రాష్ట్రంలో 8.65 లక్షల గృహాలకు

డిజిటల్ సేవలు

టీ-ఫైబర్ నెట్‌వర్క్ పనులు ఆరంభించిన ఎల్ అండ్ టీ

65 వేల కిలోమీటర్లలో ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారతదేశంలోనే అతిపెద్ద సమాచార వ్యవస్థ అయిన తెలంగాణ ఫైబర్ గ్రిడ్‌ను అమల్లోకి తెచ్చే పనుల్ని మొదలెట్టామని దేశీయ మౌలిక సదుపాయాల దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్అండ్‌టీ) ఒక పత్రికా ప్రకటనలో తెలియజేసింది. దీని ప్రకారం, ఎల్ అండ్ టీకి చెందిన స్మార్ట్ వరల్డ్ అండ్ కమ్యూనికేషన్, పవర్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు టీ- ఫైబర్ నిర్మాణ పనుల్ని కలిసికట్టుగా చేపట్టాయి. ఇందుకు సంబంధించిన ప్రాథమిక డిజైన్, సర్వే పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో తొలుత డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేస్తాయి. నెట్‌వర్క్ ఆపరేటింగ్ సెంటర్లు, డేటా సెంటర్లు, క్లౌడ్ ఆధారిత సేవలు, నెట్‌వర్క్ నిర్వహణ వ్యవస్థ, జీఐఎస్, స్టోరేజీ, సర్వర్లు, నెట్‌వర్క్ వంటివన్నీ ఏర్పాటు చేస్తాయి. ఈ ఫైబర్ నెట్‌వర్క్ పనులన్నీ పూర్తయితే ప్రజలకు బ్రాడ్‌బాండ్ సేవలెంతో సులువుగా లభించనున్నాయి. ఈ ప్రాజెక్టు విలువ రూ.1,000 కోట్ల నుంచి రూ.2,500 కోట్ల వరకు ఉంటుందని వెల్లడించింది. రాష్ర్టాల్లో సమాచార వ్యవస్థను అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా.. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన భారత్‌నెట్ కార్యక్రమం కింద కొంత నిధులు రాష్ర్టానికి విడుదల అవుతాయని ప్రకటనలో ఎల్అండ్‌టీ పేర్కొన్నది. తెలంగాణ రాష్ట్రంలోని జిల్లా హెడ్‌క్వార్టర్లు నుంచి అన్ని మండలాలు, గ్రామ పంచాయతీల్లో గల ప్రతి ఇండ్లకు డిజిటల్ సేవల్ని అందించాలన్న బృహత్ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకున్నది. టీ- ఫైబర్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని 11 జిల్లాల్లోని 215 మండలాల్లో గల 3,201 గ్రామ పంచాయతీలకు అతివేగం గల బ్రాడ్‌బాండ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. తద్వారా, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 8.65 లక్షల గృహాలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది.. వాయిస్, వీడియో, డేటాకు సంబంధించిన సేవలను ప్రజలకు సులభంగా లభిస్తాయి.

అరబిందోపై రూ.22 కోట్ల జరిమానా

ప్రమోటర్లు, అనుబంధ సంస్థలపైనా సెబీ ఆగ్రహం

ఇన్‌సైడర్ ట్రేడింగే కారణం

హైదరాబాద్, సెప్టెంబర్ 23: అరబిందో ఫార్మాపై మార్కెట్ రెగ్యులేటర్ సెబీ సోమవారం భారీగా జరిమానా వేసింది. సంస్థ ప్రమోటర్ పీవీ రాంప్రసాద్ రెడ్డి, ఆయన భార్య పీ సునీలా రాణిలతోపాటు సంబంధిత సంస్థలపై ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనల ఉల్లంఘన కింద రూ.22.7 కోట్ల జరిమానాను విధించింది. 2008 జూలై నుంచి 2009 మార్చి వరకు అరబిందో ఫార్మా లిమిటెడ్ (ఏపీఎల్) షేర్ల ట్రేడింగ్‌పై సెబీ దర్యాప్తు చేపట్టింది. ఇందులో ప్రమోటర్ సంస్థలు అవకతవకలకు పాల్పడ్డారని తేలింది. షేర్ ధరల్ని ప్రభావితం చేసే చర్యలతో చట్టవిరుద్ధంగా ప్రయోజనాలు పొందారని గుర్తించింది. రాంప్రసాద్ రెడ్డి రూ.2.6 కోట్లు, రాణి రూ.95.44 లక్షలు, కంబం పీ రెడ్డి రూ.2.3 లక్షలు, ట్రిడెంట్ చెంపర్ రూ.2.96 కోట్లు, టాప్ క్లాస్ క్యాపిటల్ మార్కెట్స్ రూ.3.77 కోట్ల మేర నోషనల్ ప్రాఫిట్స్ అందుకున్నాయని వివరించింది. వెరిటాజ్ హెల్త్‌కేర్ మాత్రం రూ.1.02 కోట్ల నష్టాలపాలైనట్లు చెప్పింది.

సెబీ విధించిన జరిమానాలు

అరబిందో ఫార్మా	రూ.2 కోట్లు
టాప్ క్లాస్ క్యాపిటల్ మార్కెట్స్	రూ.7.5 కోట్లు
ట్రిడెంట్ చెంపర్	రూ.6 కోట్లు
రాంప్రసాద్ రెడ్డి	రూ.5 కోట్లు
సునీలా రాణి	రూ.2 కోట్లు
కంబం పీ రెడ్డి	రూ.10 లక్షలు
వెరిటాజ్ హెల్త్ కేర్	రూ.10 లక్షలు

జోరుగా.. హుషారుగా

- వరుసగా రెండో రోజు భారీ లాభాల్లో మార్కెట్లు
- సెన్సెక్స్ 1,075, నిఫ్టీ 326 పాయింట్ల లాభం
- 39 వేలు దాటిన సెన్సెక్స్, 11,500 అధిగమించిన నిఫ్టీ

ముంబై, సెప్టెంబర్ 23:

బుల్‌రన్ కొనసాగుతున్నది. కార్పొరేట్ ట్యాక్స్‌ని తగ్గిస్తున్న కేంద్రం తీసుకున్న నిర్ణయంతో వరుసగా రెండో రోజు దేశీయ స్టాక్ మార్కెట్లు ఆకాశమే హద్దుగా దూసుకుపోయాయి. బ్రిటన్‌కు చెందిన రవాణా సదుపాయాల సంస్థ థామస్ కుక్ దివాలా తీసినట్లు ప్రకటించడంతో అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు దేశీయ బుల్‌రన్ ముందు ఏ మాత్రం పనిచేయలేదు. ప్రారంభం నుంచే లాభాల బాటపట్టిన సూచీలకు ఆర్థికం, బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఎగబడటంతో రెండున్నర నెలల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఒక దశలో 1,426.50 పాయింట్లు పెరిగి 39,441లను తచ్చాడిన బీఎస్ఈ సెన్సెక్స్ చివరకు 1,075.41 పాయింట్లు లేదా 2.83 శాతం లాభంతో 39,090.30 వద్ద ముగిసింది. దీంతో సెన్సెక్స్ తిరిగి 39 వేల మార్క్‌ను దాటినట్లు అయింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 326 పాయింట్లు(2.89 శాతం) పెరిగి రెండు నెలల గరిష్ఠ స్థాయి 11,600.20 వద్ద ముగిసింది. జూలై 17 తర్వాత సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు. గడిచిన రెండు రోజుల్లో సెన్సెక్స్ 2,996.56 పాయింట్లు(8.30 శాతం) పెరుగగా, నిఫ్టీ 895.40 పాయింట్లు(8.36 శాతం) లాభపడింది. కార్పొరేట్ వర్గాలు ఆశ్చర్యానికి గురిచేస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన మార్కెట్లకు ఆక్సిజన్‌లా పనిచేస్తున్నది. గత శుక్రవారం ఒక దశలో 2,200 పాయింట్లకు పైగా పెరిగిన మార్కెట్లు చివరకు 1,921 పాయింట్లు బలపడింది. గడిచిన పదేండ్లలో ఒకేరోజు ఇంతటి స్థాయిలో లాభపడటం ఇదే తొలిసారి. కార్పొరేట్ ట్యాక్స్‌ని తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న చారిత్రక నిర్ణయం దలాల్ స్ట్రీట్‌లో ర్యాలీకి దోహదం చేసిందని సెంట్రమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ హెడ్ దేవాంగ్ మెహతా తెలిపారు. బజాజ్ ఫైనాన్స్, ఎల్ అండ్ టీ, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్బీఐలు 8.70 శాతం వరకు లాభపడ్డాయి. కానీ, ఇన్ఫోసిస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటర్స్, పవర్‌గ్రిడ్, ఎన్టీపీసీ, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్‌ల షేర్లు ఐదు శాతం వరకు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్, బ్యాంకెక్స్, ఇండస్ట్రీయల్స్, ఫైనాన్స్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్, కన్స్యూమర్ డ్యూరబుల్, రియల్టీ రంగ షేర్లు మదుపరులను ఆకట్టుకోగా..ఐటీ, టెక్, టెలికం, యుటిలిటీ, ఇంధన రంగ షేర్లు నష్టపోయాయి.

ఆకట్టుకోని ఐటీ రంగ షేర్లు

స్టాక్ మార్కెట్లు ఆకాశమే హద్దుగా దూసుకుపోతుంటే..ఐటీ రంగ షేర్లు మాత్రం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. వరుసగా రెండు రోజుల్లో సూచీలు మూడు వేల పాయింట్లకు వరకు లాభపడగా..ఇదే సమయంలో ఐటీ ఇండెక్స్ సూచీ 694 పాయింట్లు పతనం చెందింది. సోమవారం 3.29 శాతం లేదా 512 పాయింట్లు నష్టపోయి 15,067 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్ 4.97 శాతం పతనమవగా, టెక్ మహీంద్రా 2.68 శాతం, టీసీఎస్ 2.46 శాతం, విప్రో 2.34 శాతం తగ్గాయి.

హోటల్ స్టాకుల వెలుగులు

హోటల్ గదులపై జీఎస్టీ రేటును తగ్గిస్తూ జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయంతో ఈ రంగ షేర్లు 20 శాతం వరకు లాభపడ్డాయి. తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఏకంగా 19.98 శాతం ఎగబాకగా, రాయల్ ఆర్చిడ్ హోటల్స్ షేరు 16.30 శాతం చొప్పున లాభపడ్డాయి. వీటితోపాటు ఇండియన్ హోటల్స్ కంపెనీ 8.20 శాతం బలపడగా, ఐటీసీ 6.95 శాతం, హోటల్ లీలా వెంచర్ 3.59 శాతం ఎగబాకాయి. రూ.7,500 లోపు టారిఫ్ చార్జీలు కలిగిన హోటల్ రూమ్స్‌పై జీఎస్టీని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గిస్తూ జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

ఎన్ఎస్ఈలో సాంకేతిక సమస్యలు

14 నిమిషాలు నిలిచిపోయిన ట్రేడింగ్

దేశంలో అతిపెద్ద ఎక్స్ఛేంజ్ జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్ఎస్ఈ)లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. అప్పటి వరకు సవ్యంగా సాగిన ట్రేడింగ్ సోమవారం మధ్యాహ్నం 3.15 గంటలకు ఒక్కసారిగా ఎన్ఎస్ఈ ట్రేడింగ్ సేవలు నిలిచిపోయాయి. వెంటనే రంగంలోకి దిగిన నిర్వాహకులు, టెక్నాలజీ నిపుణులు ఈ సమస్యకు పరిష్కారం చూపడానికి పది నిమిషాల సమయం పట్టింది. అప్పటికే వరకు ట్రేడింగ్ నిలిచిపోవడంతో ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చివరకు స్టాక్ మార్కెట్ ముగియడానికి ఒక్క నిమిషయం ముందు ట్రేడింగ్ తిరిగి ఆరంభమైంది. ఈ సాంకేతిక సమస్య రావడానికి గల కారణాలను ఆరా తీస్తున్నట్లు, బ్రోకరేజ్ సంస్థలు చేయడం వల్లనే ఈ సమస్య వచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు ఎక్స్ఛేంజ్ వర్గాలు వెల్లడించాయి.

3 వేల పాయింట్లు..రూ.10 లక్షల కోట్లు

రెండు రోజుల్లో పెరిగిన స్టాక్ మార్కెట్లు

కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మదుపరుల జేబులను నింపుతున్నది. బడ్జెట్ ప్రవేశపెట్టిన నాటి నుంచి భారీగా నష్టపోయిన మార్కెట్లు నేలకు కొట్టిన బంతిలా దూసుకుపోతున్నాయి. వరుసగా రెండు సెషన్లలో 3 వేల పాయింట్లకు పైగా లాభపడటంతో మదుపరుల సంపద ఏకంగా రూ.10 లక్షల కోట్ల కంటే అధికమైంది. దీంతో స్టాక్ మార్కెట్లో లిస్టైన సంస్థల నికర విలువ రూ. 10,35,213.03 కోట్లు పెరిగి రూ. 1,48,89,652.44 కోట్లకు చేరుకున్నది. గత గురువారం ఎం-క్యాప్ విలువ రూ. 1,38,54,439.41 కోట్లుగా ఉన్న విషయం విధితమే. సెప్టెంబర్ నెలకుగాను డెరివేటివ్ కాంట్రాక్టు గడువు ఈ వారంలోనే ముగియనున్నప్పటికీ మదుపరులు కొనుగోళ్లకు మొగ్గు చూపడం విశేషమని రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒత్తిడి గురైనప్పటికీ దేశీయ సూచీలు ఎగబాకినట్లు చెప్పారు. 30 షేర్ల ఇండెక్స్‌లో 16 స్టాకులు లాభపడగా, మిగతావి నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతో 3.08 శాతం వరకు పెరిగాయి. సోమవారం మార్కెట్లో 1,638 లాభపడగా, 972 క్షీణించగా, 184 మాత్రం యథాతథంగా ఉన్నాయి.

రోజుకింత పెట్రో మంట

ఢిల్లీలో 29 పైసలు పెరిగిన పెట్రోల్, డీజిల్‌పై 19 పైసల వడ్డన

హైదరాబాద్‌లో పెట్రోల్ 31 పైసలు, డీజిల్ 21 పైసలు అధికం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: పెట్రో దెబ్బకు సామాన్యుడు హడలిపోతున్నాడు. రోజురోజుకింత పెరుగుతున్న ధరలు సోమవారం మరింత అధికమయ్యాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 29 పైసలు పెరిగి రూ.73.91కి చేరుకోగా, లీటర్ డీజిల్ 19 పైసలు వడ్డించడంతో రూ.66.93కి చేరుకున్నది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న వ్యాట్, ఇతర పన్నుల ఆధారంగా ధరలు మరింత అధికమవనున్నాయి. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ 31 పైసలు ఎగబాకి రూ.78.57 పలుకగా, డీజిల్ 21 పైసలు అధికమై రూ.72.96కి చేరుకున్నది. సౌదీ అరేబియాలో చమురు క్షేత్రాలపై ఉగ్రవాదులు డ్రోన్లతో దాడులు చేయడంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. గడిచిన ఏడు రోజుల్లో దేశవ్యాప్తంగా లీటర్ పెట్రోల్ ధర రూ.2 వరకు అధికమవగా, అదే డీజిల్ రూ.1.63 వరకు పెరిగింది. ఇతర నగరాల విషయానికి వస్తే కోల్‌కతాలో రూ.76.60కి చేరిన పెట్రోల్, ముంబైలో రూ.80 దిశగా పరుగు పెడుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ చమురు ధర 64 డాలర్ల స్థాయిలో కదలాడుతున్నది.

సీఐఎల్‌లో నేడు సమ్మె

కోల్‌కతా, సెప్టెంబర్ 23: బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామి సంస్థయైన కోల్ ఇండియా ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. బొగ్గు గనుల్లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా మంగళవారం సమ్మె చేస్తున్నట్లు ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి. ఈ సమ్మెలో కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు చెందిన 5 లక్షల మంది సిబ్బంది పాల్గొననున్నారు.

సోమవారం ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

విప్‌గా బాధ్యతలు స్వీకరించిన కర్నె ప్రభాకర్

అభినందించిన మంత్రులు మహమూద్‌అలీ, ఈటల, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ విప్‌గా కర్నె ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. అసెంబ్లీ అవరణలో సోమవారం జరిగిన ఈ కార్యాలయాన్ని హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. హోంశాఖ మంత్రితోపాటు విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, అసెంబ్లీ వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి.. కర్నె ప్రభాకర్‌ను సీట్లో కూర్చోబెట్టి అభినందించారు. ఆయనను అభినందించినవారిలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నర్సింహాచార్యులు, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీలు ఎం శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, శంభీపూర్ రాజు, తేరా చిన్నపురెడ్డి, టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

మండలి విప్ కర్నె ప్రభాకర్‌ను అభినందిస్తున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మహమూద్‌అలీ, మాజీమంత్రి నాయిని నర్సింహారెడ్డి తదితరులు

సోమవారం హైదరాబాద్‌లో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు -బంజారాహిల్స్

హైదరాబాద్‌కు ప్రపంచ గుర్తింపు

- ఎఫ్‌టీసీసీఐ ఆవిష్కరణలో నల్సార్ వర్సిటీ వీసీ ఫైజన్ ముస్తఫా
- సీఐడీఆర్ కేంద్రం ఏర్పాటుకు ఎంవోయూ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహానగరమని నల్సార్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఫైజన్ ముస్తఫా అన్నారు. హైదరాబాద్‌లో మంచి ఆతిథ్యం లభిస్తుందని, ఇక్కడి ప్రజలు అందరినీ కలుపుకొనిపోతారని సంతోషాన్ని వ్యక్తంచేశారు. సోమవారం ఆయన హైదరాబాద్ రెడ్‌హిల్స్‌లో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ)ని ఆవిష్కరించారు. ఇప్పటివరకు ఫెడరేషన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీగా ఉన్న ఈ సంస్థ ఇకపై తెలంగాణలో ఎఫ్‌టీసీసీఐగా కొనసాగనున్నది. ఈ సందర్భంగా ఎఫ్‌టీసీసీఐకి, నల్సార్ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ అల్టర్నేట్ డిస్ప్యూట్ రిజల్యూషన్ (సీఐడీఆర్)కి మధ్య అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఎఫ్‌టీసీసీఐలో సీఐడీఆర్ కేంద్రం ఏర్పాటుకు ఉద్దేశించిన ఈ ఒప్పంద పత్రాలపై నల్సార్ యూనివర్సిటీ వీసీ ముస్తఫా, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు కరుణేంద్ర జాస్తి సంతకాలుచేశారు. అనంతరం ఫైజన్ ముస్తఫా మాట్లాడుతూ.. ఎఫ్‌టీసీసీఐతో ఎంవోయూ కుదుర్చుకోవడం సంతోషకరమన్నారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు కరుణేంద్ర జాస్తి మాట్లాడుతూ.. తమ సంస్థకు వందేండ్ల చరిత్ర ఉన్నదని, రాష్ట్ర విభజన జరగడంతో ఏపీ, తెలంగాణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటుచేశామని తెలిపారు. ఎఫ్‌టీసీసీఐ సీనియర్ ఉపాధ్యక్షుడు రామాకాంత్ ఇనాని, ఉపాధ్యక్షుడు కే భాస్కర్‌రెడ్డి, సీఈవో క్యాతి, డిప్యూటీ సీఈవో సుజాత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎఫ్‌టీసీసీఐని జ్యోతివెలిగించి ఆవిష్కరిస్తున్న నల్సార్ వర్సిటీ వీసీ ఫైజన్ ముస్తఫా. చిత్రంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు కరుణేంద్ర జాస్తి, సీనియర్ ఉపాధ్యక్షుడు రామాకాంత్ ఇనాని ఉన్నారు.

తొమ్మిది వర్సిటీలకు సెర్చ్ కమిటీలు ఏర్పాటు

- ఒక్కో యూనివర్సిటీకి ఒక్కో ప్రత్యేక కమిటీ
- వర్సిటీల వీసీల భర్తీ ప్రక్రియ ప్రారంభం
- ప్రభుత్వ నామినీగా సోమేశ్‌కుమార్ నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నత విద్యాశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని తొమ్మిది యూనివర్సిటీలలో వైస్ చాన్స్‌లర్ల నియామకానికి రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొమ్మిది యూనివర్సిటీలకు వైస్ ఛాన్స్‌లర్ల ఎంపిక కోసం ఒక్కొక్క యూనివర్సిటీకి ఒక్కొక్క సెర్చ్ కమిటీ చొప్పున తొమ్మిది సెర్చ్ కమిటీలను నియమించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తొమ్మిది యూనివర్సిటీలకు ప్రభుత్వ నామినీగా రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. సాధ్యమైనంత త్వరలోనే సెర్చ్ కమిటీల ప్రక్రియ ముగించి, ప్రతి యూనివర్సిటీ వీసీ కోసం ముగ్గురి పేర్లతో ప్రతిపాదనలు సెర్చ్ కమిటీ ప్రభుత్వానికి నివేదిస్తుంది. వీరిలో నుంచి ఒకరి పేరును రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి ఆమోదం కోసం రాష్ట్ర గవర్నర్‌కు పంపుతుంది. ఈ ప్రక్రియను వీలైనంత త్వరలోనే పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

యూనివర్సిటీలవారీగా సెర్చ్ కమిటీల వివరాలు

1) మహాత్మాగాంధీ యూనివర్సిటీ
యూనివర్సిటీ నామినీ: ప్రొఫెసర్ జయప్రకాశ్‌రావు, రిటైర్డ్, ఓయూ
యూజీసీ నామినీ: ప్రొఫెసర్ ఆర్సీరెడ్డి కుహద్, వీసీ, హర్యాన సెంట్రల్ వర్సిటీ

2) కాకతీయ యూనివర్సిటీ
యూనివర్సిటీ నామినీ: ప్రొఫెసర్ రామేశ్వర్‌రావు, జేఎన్టీయూ, రిటైర్డ్ వీసీ.
యూజీసీ నామినీ: ప్రొఫెసర్ రాఘవేందర్ పీ తివారీ, వీసీ, డాక్టర్ హరిసింగ్ గౌర్ వర్సిటీ (ఎంపీ)

3) బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ
యూనివర్సిటీ నామినీ: ప్రొఫెసర్ మహ్మద్ సులేమాన్ సిద్దిఖీ
యూజీసీ నామినీ: ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, వీసీ, ఇగ్నో.

4) పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ
యూనివర్సిటీ నామినీ: ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్, మాజీ డైరెక్టర్, న్యాక్
యూజీసీ నామినీ: ప్రొఫెసర్ టీ తిరుపతిరావు, మాజీ వీసీ, ఓయూ

5) ఉస్మానియా యూనివర్సిటీ
యూనివర్సిటీ నామినీ: డాక్టర్ విజయ్‌ప్రసాద్, డీఐఎంఆర్ఐ, మాజీ డైరెక్టర్, ఎన్‌జీఆర్ఐ
యూజీసీ నామినీ: ప్రొఫెసర్ జగదీశ్ కుమార్, వీసీ, జేఎన్‌యూ, న్యూఢిల్లీ

6) జేఎన్టీయూ, హైదరాబాద్
యూనివర్సిటీ నామినీ: ప్రొఫెసర్ పీ జయప్రకాశ్‌రావు, మాజీ ప్రొఫెసర్, ఓయూ
యూజీసీ నామినీ: ప్రొఫెసర్ యోగేశ్‌సింగ్, వీసీ, ఢిల్లీ టెక్నాలజీ యూనివర్సిటీ, న్యూఢిల్లీ

7) పాలమూరు యూనివర్సిటీ
యూనివర్సిటీ నామినీ: ప్రొఫెసర్ సులేమాన్ సిద్దిఖీ,
యూజీసీ నామినీ: ప్రొఫెసర్ రాజేశ్‌భట్నాగర్, ఐఏసీ, ఎన్ఏసీ,

8) తెలంగాణ యూనివర్సిటీ
యూనివర్సిటీ నామినీ: ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్, మాజీ డైరెక్టర్, న్యాక్
యూజీసీ నామినీ: ప్రొఫెసర్ అప్పారావు పొదిలి, వీసీ, సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్

9) శాతవాహన యూనివర్సిటీ
యూనివర్సిటీ నామినీ: ప్రొఫెసర్ రామేశ్వరరావు, మాజీ వీసీ, జేఎన్టీయూహెచ్
యూజీసీ నామినీ: ప్రొఫెసర్ సుష్మా యాదవ్, వీసీ, భగాయత్‌పూల్ సింగ్, మహిళా వర్సిటీ, హర్యాన

పాల నురగలు.. బొగత పరవళ్లు

ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీప్రాంతంలో తెలంగాణ నయాగర.. బొగత జలపాతం పాల నురగలను తలపిస్తున్నది. పచ్చని ప్రకృతమ్మ ఒడిలో సేదతీరాలనుకొనే పర్యాటకులు పెద్దసంఖ్యలో బొగత జలపాతాన్ని సందర్శిస్తున్నారు. - వాజేడు(ములుగు)

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

- వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్
- గాంధీ వైద్య కళాశాల అధిపతులు, వైద్యులతో ముఖాముఖి

బన్సీలాల్‌పేట్: నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన సికిందరాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాలను సందర్శించారు. ఆ కళాశాల, అనుబంధ దవాఖానల అధిపతులు, వైద్యులతో దాదాపు ఏడు గంటలపాటు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. సర్కారు దవాఖానల్లో వైద్యులు, నర్సులు, సిబ్బందితోపాటు మందుల కొరత లేకుండా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైద్యుల పదోన్నతుల్లో జాప్యం ఉండరాదని డీఎంఈని ఆదేశించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల హెచ్‌వోడీలు తమ సమస్యలను మంత్రికి వివరించారు. సమావేశంలో డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ పీ శ్రావణ్‌కుమార్, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సులేమాన్, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పీ ప్రవీణ్, గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ రాథోడ్, కార్యదర్శి డాక్టర్ వసంత్‌కుమార్, డాక్టర్ సుబోధ్ పాల్గొన్నారు.

దామాషా ప్రకారం అవకాశం ఇవ్వాలి

చీఫ్ జస్టిస్ ఆర్‌ఎస్ చౌహాన్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ న్యాయవాదుల విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: న్యాయమూర్తుల నియామకాల్లో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆయా వర్గాలకు చెందిన న్యాయవాదులు హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్‌ను కలిసి విజ్ఞప్తిచేశారు. సోమవారం సీజేను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతమున్న జడ్జీల్లో బీసీ వర్గాలకు చెందినవారు ముగ్గురే ఉన్నారని, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఒక్కరూ లేరని పేర్కొన్నారు.

24, 25 తేదీల్లో 'పోస్టు టెస్ట్' పరీక్ష

డీఈవోలకు కమిషనర్ విజయ్‌కుమార్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాఠశాల విద్యాశాఖలో విద్యార్థులకు సం బంధించిన పోస్టు టెస్ట్ పరీక్షలను (మూలాల్లోకి వెళ్దాం) ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్నారు. ఇం దుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్‌కుమార్ ఆదేశించారు. 27న ఫలితాలు విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకొంటున్నారు.

ఓపెన్ డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్టు యూనివర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఫలితాలు www.braou.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

రహదారుల విస్తరణలో మసీదులను తొలగించొద్దు

వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా మసీదులను తొలగించొద్దని వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్‌సలీం అధికారులకు సూచించారు. సోమవారం వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ యాక్ట్ ప్రకారం మసీదు తొలగింపు నేరమని పేర్కొన్నారు.

ఎంసీఆర్‌హెచ్చార్డీలో జరిగిన జిల్లా పశువైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించండి

- జిల్లా అధికారుల సదస్సులో మంత్రి తలసాని
- డ్రగ్ మేనేజ్‌మెంట్ సిస్టం యాప్ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినట్టు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. గొర్రెల పెంపకందారులు నష్టపోకుండా అధికారులు దగ్గరుండి వచ్చే నెల ఐదో తేదీలోగా బీమా క్లెయిమ్‌లను పరిష్కరించాలని సూచించారు. సోమవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్చార్డీ)లో జరిగిన జిల్లా పశువైద్యాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోట్ల రూపాయల బీమా సొమ్మును ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లిస్తుందని, మన నిర్లక్ష్యం కారణంగా రైతులు నష్టపోవద్దన్నారు. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

క్షేత్రస్థాయిలో పర్యటించండి

జిల్లా పశువైద్యాధికారులు వారంలో మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యక్రమాలు అమలుతోపాటు సంచార పశువైద్యశాలలను పర్యవేక్షించాలని మంత్రి శ్రీనివాస్ యాదవ్ సూచించారు. రాష్ట్రంలోని పశువైద్యశాలలకు కావాల్సిన మందులు ఆర్డర్ ఇచ్చేందుకు రూపొందించిన 'డ్రగ్ మేనేజ్‌మెంట్ సిస్టం' యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు.

ఈ-సిగరెట్లను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించండి

డీజీపీ కార్యాలయం సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ-సిగరెట్లను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ-సిగరెట్లు, ఈ-హుక్కా వంటివి ఎవరు కలిగి ఉన్నా స్వచ్ఛందంగా సమీప పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని డీజీపీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ-సిగరెట్ల తయారీ, ఎగుమతి, దిగుమతి, రవాణా, అమ్మకం, పంపిణీ, ప్రకటనలు సైతం నిషేధంలో భాగమేనని ప్రభుత్వం ఈ నెల 18వ తేదీన విడుదల చేసిన గెజిట్‌లో పేర్కొంది. పోలీసుశాఖలోని అధీకృత అధికారులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుగా నియమించినట్టు డీజీపీ కార్యాలయం తెలిపింది. ఈ-సిగరెట్ల ద్వారా కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించింది.

దోపిడీ దొంగల హల్‌చల్



దోపిడీకి ఉపయోగించిన మారుతీ ఈకో వ్యాన్, వాహనాన్ని స్టార్ట్‌చేసేందుకు తాళంచెవిగా ఉపయోగించిన కత్తెర, వ్యాన్‌లో లభ్యమైన కట్టర్, రాళ్లు

- పట్టుకొనేందుకు యత్నించిన ఎస్‌ఐపై హత్యాయత్నం
- సినిమా తరహాలో పోలీసుల చేజింగ్
- చెట్టుకు ఢీకొట్టి కారును వదిలి పరారైన దొంగలు
- నగర శివారులోని దూలపల్లిలో ఘటన

దుండిగల్: హైదరాబాద్ నగర శివారులోని దూలపల్లిలోని ఓ నగల దుకాణంలో చోరీకి దొంగలు విఫలయత్నం చేశారు. తమను పట్టుకొనేందుకు యత్నించిన ఎస్‌ఐని వ్యాన్‌తో ఢీకొట్టేందుకు యత్నించి పరారయ్యారు. సినిమా చేజింగ్ తరహాలో పోలీసులు రెండు కిలోమీటర్ల దూరం వెంబడించడంతో అదుపుతప్పి అడవిలో చెట్టును ఢీకొట్టి కారును వదిలి పలాయనం చిత్తగించారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డివిజనల్ నైట్ పెట్రోలింగ్ విధుల్లో ఉన్న దుండిగల్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి సిబ్బందితో కలిసి.. మేడ్చల్, అల్వాల్, పేట్‌బషీరాబాద్ పీఎస్‌ల నుంచి కొంపల్లి మీదుగా బహదూర్‌పల్లి వైపు వెళ్తున్నారు. తెల్లవారుజామున 2.10 గంటల సమయంలో దూలపల్లిలోని గణేశ్ జ్యూయలరీ దుకాణం ముందు నిలిపి ఉంచిన మారుతి ఈకో వ్యాన్(టీఎస్ 10ఈజీ 7029)పై పోలీసుల దృష్టిపడింది. ఏదో జరుగుతుందని అప్రమత్తమైన ఎస్‌ఐ పెట్రోలింగ్ వాహనం దిగి దొంగలను పట్టుకొనేందుకు యత్నించారు. అయితే తమ వైపుగా రావడాన్ని గమనించిన దొంగలు.. ఒక్కసారిగా వ్యాన్‌తో ఉడాయించేందుకు ముందుకు దూసుకెళ్లారు. అడ్డుకోబోయిన ఎస్‌ఐ శేఖర్‌రెడ్డిని వ్యాన్‌తో ఢీకొట్టాలని చూశారు. ప్రమాదాన్ని గ్రహించిన ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి.. వెంటనే పక్కకు తప్పుకొని తన సిబ్బందితో వారిని వెంబడించాడు. దూలపల్లి నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లిన తర్వాత దొంగలు ప్రయాణిస్తున్న వ్యాన్ ఫారెస్ట్ అకాడమీ వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఆ ప్రాంతమంతా చీకటిగా ఉండటంతో దొంగలు.. పోలీసులకు దొరుకకుండా పారిపోయారు.

కారు కూడా దొంగిలించిందే..

అడవిలో దొంగలు వదిలివెళ్లిన మారుతీ ఈకో వ్యాన్‌ను ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తనిఖీ చేయగా.. ఇనుపరాడ్, కట్టర్, దుకాణం షట్టర్ తెరిచేందుకు ఉపయోగించే సామగ్రితోపాటు బండరాళ్లు దొరికాయి. దొంగలు జ్యూయలరీ షాపులో దోపిడి చేసేందుకే వచ్చినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దుండగులు వాడిన వ్యాన్ ఇటీవల అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైనట్టు తేల్చారు. అలాగే ఇదే పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక ఏటీఎంను బద్దలుకొట్టేందుకు కూడా తీవ్రంగా యత్నించినట్టు సమాచారం. కత్తెరను ఉపయోగించి మారుతీ ఈకో వ్యాన్‌ను స్టార్ట్ చేసినట్టు పోలీసులు భావిస్తున్నారు.

దొంగల కారు వెనుక మరో వాహనం

దూలపల్లి జ్యూయలరీ షాపులో దోపిడీకి యత్నించిన దొంగలు పారిపోతుండగా.. వీరి వెనుకాలే మరో కారు అదే స్పీడ్‌తో వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. దుండగులు రెండు కార్లలో పరారైనట్టు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది. మారుతీ ఈకో వ్యాన్‌లో నలుగురు దుండగులు ముఖాలకు మాస్కులు వేసుకొని ఉన్నట్లు పోలీసులు చెప్తున్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీ సాయంతో దొంగలను పట్టుకొనేందుకు పోలీసులు గాలిస్తున్నారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి ప్రదర్శించిన ధైర్యసాహసానికి అధికారులు ప్రశంసించారు.

చరిత్ర సృష్టించిన జెన్‌కో

- జల విద్యుదుత్పత్తిలో సరికొత్త రికార్డు
- ఒకేరోజు 51.61 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి

ఆత్మకూరు: జలవిద్యుదుత్పత్తిలో జెన్‌కో చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు ఉన్న రికార్డులన్నీ బ్రేక్‌చేసి కొత్త చరిత్రను నెలకొల్పింది. ఈ నెల 9న ఒకేరోజు 50 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నిర్వహించిన రాష్ట్ర హైడల్ ప్రాజెక్టులు.. ఆదివారం మరో అడుగు ముందుకేసి 51.61 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తితో సరికొత్త రికార్డును నెలకొల్పాయి. కృష్ణానదిపై ఉన్న ఆరు ప్రాజెక్టుల్లో ఇప్పటివరకు మొత్తంగా 1660 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగింది. ఈ ఏడాది ఇదే అత్యధిక విద్యుదుత్పత్తి. ప్రస్తుత సీజన్‌లో ఎగువ జూరాల విద్యుత్ కేంద్రంలో 5.15 మిలియన్ యూనిట్లు, దిగువ జూరాలలో 4.5 మిలియన్ యూనిట్లు, శ్రీశైలం పవర్ ప్రాజెక్టులో 19.86 మిలియన్ యూనిట్లు, నాగార్జునసాగర్‌లో 19.58 మిలియన్ యూనిట్లు, ఎడమ కాల్వపై 55 మిలియన్ యూని ట్లు, పులిచింతల ప్రాజెక్టులో 1.98 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరుగడంతో కొత్త రికార్డు సాధ్యమైం ది. ఈ ఏడాది ఎగువ జూరాల (120 మిలియన్ యూనిట్లు), దిగువ జూరా ల (100 మిలియన్ యూనిట్లు) కేంద్రాలు 100 మిలియన్ యూనిట్ల మైలురాయిని అధిగమించడంతో సోమవారం ఆయా కేంద్రాల్లోని జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు సంబురాలు జరుపుకొన్నారు. రాష్ట్ర హైడల్ ప్రాజెక్టుల సీఈ సురేశ్, సీఈ మంగేశ్‌కుమార్, ఎస్ఈలు, ఈఈ, డీఈ, ఏడీలు, ఏఈలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వానకాలంలో 50 లక్షల టన్నుల ధాన్యం కొంటాం

పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ చేపట్టిన రైతు సంక్షేమ చర్యలతో రాష్ట్రంలో ధాన్యం దిగుబడి భారీగా పెరుగుతున్నదని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గతేడాది వానకాలంలో 40.41 లక్షల టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేసిందని, ఈ ఏడాది 50 లక్షల టన్నులు కొనాలని నిర్ణయించిందని తెలిపారు. 2019-20 వానకాలం కార్యాచరణపై సోమవారం పౌరసరఫరాల భవన్‌లో రాష్ట్ర రైస్‌మిల్లర్ల అసోసియేషన్‌తో చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సమావేశమయ్యారు. సంస్థ గతేడాది వానకాలం, యాసంగిలో 77 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి దేశంలోనే రెండోస్థానంలో నిలిచిందని తెలిపారు. రాబోయేరోజుల్లో మొదటిస్థానం సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు. ధాన్యం దిగుబడులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వానికి సహకరించాలని రైస్‌మిల్లర్లను కోరారు. వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించటానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే సదుద్దేశంతో సీఎం కేసీఆర్ సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారని, ఇందుకు మిల్లర్ల నుంచి ఏడాదికి 1.20 లక్షల టన్నుల సన్న బియ్యాన్ని సేకరిస్తున్నామని పేర్కొన్నారు.



రైస్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతున్న మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో అకున్ సభర్వాల్

రూ.125 కోట్ల విడుదలపై మిల్లర్ల హర్షం

తెలంగాణ పౌరసరఫరాల సంస్థ నుంచి రైస్ మిల్లర్లకు ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ చార్జీల కింద రూ.125 కోట్లు విడుదల చేయడంపై రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘం హర్షం వ్యక్తం చేసింది. నిధుల విడుదలకు సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ అకున్ సభర్వాల్‌కు ధన్యవాదాలు తెలిపింది.

41ఏ సీఆర్పీసీని సవరించాలి

హైకోర్టు వద్ద న్యాయవాదుల ధర్నా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీసులకు స్టేషన్ బెయిల్ ఇచ్చే అధికారాన్ని కట్టబెట్టిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ)లోని 41ఏ ను సవరించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. సోమవారం హైకోర్టు వద్ద ధర్నా చేపట్టారు. స్టేషన్ బెయిల్ వల్ల పేదలకు అన్యాయం జరుగుతున్నదని, న్యాయవాదులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. బెయిల్ ఇచ్చే అధికారం పోలీసుల వద్ద ఉండటం వల్ల అవినీతి జరుగుతున్నదని, వెంటనే దీనిని సవరించి బెయిల్ ఇచ్చే అధికారం కోర్టులకే కట్టబెట్టాలని, అలాగే జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

థర్డ్‌డిగ్రీ ప్రయోగంపై హైకోర్టు ఆగ్రహం

దర్యాప్తు బాధ్యత నుంచి వెస్ట్‌జోన్ పోలీసులను తప్పించి సైబరాబాద్ కమిషనరేట్‌కు అప్పగింత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దొంగతనం సహా పలు కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరు సోదరులపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చాంద్రాయణగుట్టకు చెందిన సయ్యద్ సొహైల్, సయ్యద్ మహమ్మద్ దొంగతనం, ఇతర కేసుల్లో నిందితులుగా ఉన్నారు. బెయిల్‌పై బయటికి వచ్చిన వీరిపై పీడీ కేసు నమోదైంది. అందులోనూ వారికి బెయిల్ లభించింది. పోలీసులు వారిని మళ్లీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయకపోవడంతో వారి బంధువులు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వారికయిన గాయాలపై ఆరా తీసింది. అరెస్టుకు ముందే గాయాలున్నాయని పోలీసుల తరపు న్యాయవాది పేర్కొనడంతో ఉస్మానియా వైద్యశాల నుంచి ముగ్గురు వైద్య నిపుణులను పిలిపించిన హైకోర్టు.. గాయాలను పరిశీలించి భోజన విరామం తర్వాత నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. నిందితులకు గాయాలు తాజాగా అయినవేనని, పాతవి కాదని వైద్యనిపుణులు పేర్కొనడంతో వెస్ట్‌జోన్ పోలీసులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసుల విచారణ నుంచి వెస్ట్‌జోన్ పోలీసులను తప్పిస్తున్నట్టు పేర్కొన్నది. సైబరాబాద్ కమిషనరేట్ ఈ కేసులపై విచారణ చేపట్టాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై రెండువారాల్లో నివేదిక ఇవ్వాలని, నిందితులను గాయపర్చిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నది.

నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 24 సెప్టెంబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

ప్రతీకాత్మక చిత్రం

ఆ తల్లిదండ్రులకు ఓ కొత్త దారి..

తల్లిగర్భంలో శిశువు కదలిక ప్రతిదీ అద్భుతమే. ప్రతి నెలా, ప్రతి దశ పెద్ద సంబురమే. పుట్టిన తర్వాత ప్రతిరోజూ ఓ పండుగే. బిడ్డ చేసే ప్రతి సైగా ఓ అపురూప దృశ్యమే. ఇలాంటివి అన్నీ సాఫీగా ఉంటేనే ఆనందం. కానీ బిడ్డ కదలకపోతే, నవ్వించినా నవ్వకపోతే. ఎక్కడో ఏదో వెలితి, బాధ. అలాంటప్పుడు తల్లిదండ్రులు ఏం చేయాలి? వాటిని ఎలా అధిగమించాలి? ఇలాంటి అనేక విషయాలపై తల్లిదండ్రులకు సరైన మార్గాన్ని చూపిస్తున్నది నయీ దిశ.

ప్రాచీ, ఫౌండర్

బుడి బుడి అడుగులతో, చిట్టిపొట్టి మాటలతో ఇల్లంతా సందడి చేయాల్సిన ఆ పాప నిశ్శబ్దంగా ఉంటున్నది. అందరికీ దూరంగా నిల్చుంటున్నది. ఇట్లా పిల్లలు ఒంటరితనానికి అలవాటు పడుతుంటే తల్లిదండ్రుల బాధ వర్ణణాతీతం. ఆ ఆందోళన ఎక్కడ, ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితులు. చిన్న పిల్లల్లో కనిపించే ఈ మేధోపరమైన ఎదుగుదల పట్ల ఎన్నో అనుమానాలు మొదలవుతాయి. ఆలోచిస్తే ఇది సమస్యనే కాదు అంటున్నారు నయీ దిశ ఫౌండర్ ప్రాచీ డియో. ఈ లక్షణాలను తొలిదశలోనే తుంచివేస్తే ఎలాంటి సమస్యా ఉండదంటుందామె. అందుకే ఇలాంటి 'స్పెషల్ కిడ్స్' తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌లు, సూచనలు, సలహాలు ఇస్తున్నది.. ఆన్‌లైన్ వేదికగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. దేశవ్యాప్తంగా ఈవెంట్లు నిర్వహిస్తూ స్పెషల్ కిడ్స్‌ను ఎలా పెంచాలి?, ఆటిజమ్, డౌన్‌సిండ్రోమ్ లక్షణాలనుంచి పిల్లల్ని ఎలా దూరం చేయాలి అనే విషయాలపై భయాందోళలు తొలగిస్తుంది ప్రాచీ.

ఎక్కడ మొదలైంది?

ఆటిజమ్ లక్షణాలున్న సోదరుడు ప్రాచీకి ఉన్నాడు. ఈ లక్షణాల మీద అవగాహన ఉన్న ప్రాచీ సోదరుని ప్రత్యేక థెరపీల ద్వారా పెంచేది. మరోవైపు ఎవరైనా స్పెషల్ కిడ్ అని తెలిసినప్పుడు తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతారు. ఆమె బంధువుల పిల్లలు కొందరు ఆటిజమ్‌తో బాధపడడాన్ని చూసింది. వారి తల్లిదండ్రులకు ఆ స్పెషల్ కిడ్ లక్షణాలు ఆందోళన కలిగించేవి. వారు తరచూ బాధపడడం చూసి వారికి ప్రాచీ సలహాలు ఇచ్చేది. అట్లాగే స్పెషల్ కిడ్స్‌ను ఎలా పెంచాలి? వారికి ఎలాంటి చికిత్స అందించాలి వంటి చాలా విషయాలు వారికి చెప్పేది. ఇది క్రమేనా 'నయీ దిశ' ఆర్గనైజేషన్ ఏర్పాటుకు కారణం అయింది.

ఎందుకు?

స్పెషల్ కిడ్స్‌ను ఎక్కడ? ఎవరికి చూపించాలి? అనేది చాలామంది తల్లిదండ్రులకు తెలియదు. ఒకవేళ డాక్టర్‌ను సంప్రదించినా మెరుగైన ఫలితం అందుతుందో లేదో అనే అనుమానం. ఇలాంటి ఎన్నో సందేహాలు, సవాళ్లు తల్లిదండ్రుల చుట్టూ చేరుతాయి. అన్నిటికన్నా ముఖ్యమైనది ఇలాంటి పిల్లలకు అవసరమైన సేవలు ఎక్కడ దొరుకుతాయి అనేది పెద్ద ప్రశ్న. ఇలా ఒక్కో దశలో తల్లిదండ్రులు ఒక్కో సవాల్‌ను ఎదుర్కొంటారు. ఇలాంటి కుటుంబాలకు సాయపడేందుకే ప్రాచీ నయీ దిశను ప్రారంభించింది. www.nayi-disha.org వెబ్‌సైట్ ద్వారా తల్లిదండ్రులకు మార్గాన్ని వెతికి పెడుతున్నది. ఆన్‌లైన్ ద్వారానే ఎక్కువ మందికి తమ సేవలు అందించగలమనే ఉద్దేశంతోనే వెబ్‌సైట్, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా తల్లిదండ్రులను సభ్యులుగా చేర్చుకుంటున్నామని చెప్తున్నది ప్రాచీ. కావాల్సిన సమాచారం అందించి సాయపడుతున్నది. నిరంతరం అందుబాటులో ఉంటూ పిల్లల పెంపక సామర్థ్యాన్ని మరింత పెంచగలుతున్నాం అని ఆమె చెప్తున్నది. ఆన్‌లైన్ వేదికగా నలుగురితో దీన్ని ప్రారంభించి ఇప్పుడు ముంబై, చెన్నయ్, బెంగళూర్, హైదరాబాద్ వంటి నగరాల్లో తల్లిదండ్రులకు సాయపడుతున్నది. వలంటరీల సాయంతో వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా కౌన్సెలింగ్, థెరపీల గురించి తల్లిదండ్రులకు చేరవస్తున్నది.

ఎలా?

నయీ దిశ మూడు లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని పని చేస్తున్నది. స్పెషల్ కిడ్స్ ఉన్న తల్లిదండ్రులను అందరినీ ఏకం చేయడం. నయీ దిశ దగ్గర ఉన్న సమాచారం వారికి అందించడం. స్పెషల్ కిడ్స్ కోసం ప్రభుత్వం అందించే సదుపాయాలు, పథకాలు, సమాచారాన్ని తల్లిదండ్రులకు చేరవేయడం అనే అంశాల మీద నయీ దిశ పని చేస్తున్నది. స్పెషల్ కిడ్స్ అని తెలిసిన అవసరయ్యే ఫిజియోథెరపిస్టు, న్యూరాలజీ, క్రీడలు, మ్యూజిక్, స్పెషల్ స్కూల్ వివరాలు అన్నీ నయీ దిశలో ఉంటాయి. ఈ సమాచారం అంతా క్షేత్రస్థాయిలో ధృవీకరించిన తర్వాతే తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం అని చెప్తున్నది ప్రాచీ. క్షేత్ర స్థాయి సమాచారాన్ని తమ వలంటీర్లు సేకరిస్తారనీ, తల్లిదండ్రులను సభ్యులుగా చేర్చడంలో వారే కీలకంగా పని చేస్తారని చెప్తున్నది. ఇలా నయీ దిశ నిర్వాహకులు, వలంటరీలు డాక్టర్లతో, నిపుణులతో నేరుగా మాట్లాడతారు. వైద్య వివరాలతోపాటు విద్య, పెంపకం వివరాలు కూడా అందించడంలో నయీదిశ ప్రాముఖ్యం పొందింది. రకరకాల రుగ్మతలకు సంబంధించిన సమాచారం అంతా తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో పొందుపరిచి నాలెడ్జి బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు.

...✍ వినోద్ మామిడాల

ఎంతో ఉపయోగపడుతున్నది

స్పెషల్ కిడ్ అని తెలిసిన వెంటనే ఏం చేయాలనే సమాచారం తల్లిదండ్రులకు దొరకదు. ఒకవేళ ఉన్నా అది అందరికీ చేరడం లేదు. నాకు తొమ్మిదేండ్ల బాబు ఉన్నాడు. స్పెషల్ కిడ్. ఐదేండ్ల క్రితం నయీ దిశ వెబ్‌సైట్ చూశాను. అక్కడ ఉన్న సమాచారం అంతా వాస్తవ ఆధారాలతో ఉంది. అప్పటి నుంచి నయీ దిశలో సభ్యురాలిగా ఉన్నాను. పిల్లలకు కావాల్సిన ప్రత్యేక థెరపీలు నయీ దిశ ద్వారా తెలుసుకున్నాను. ఆ సమాచారంతోనే స్పెషల్ స్కూల్‌లో మా బాబును చేర్పించాను. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా పేరెంట్స్ వలంటరీగా చేస్తున్నాను. స్పెషల్ కిడ్స్ తల్లిదండ్రులను కలుసుకోవడం, వారికి నయీ దిశ సేవల గురించి సాయం అందించడంలో నావంతు కృషి చేస్తున్నాను. స్పెషల్ కిడ్స్ తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తున్నది. నయీ దిశ మాలాంటి వారికి ఎంతగానో ఉపయోగపడుతున్నది.

-ప్రశాంతి, స్పెషల్ కిడ్ పేరెంట్, హైదరాబాద్

హైదరాబాద్‌లో..

ప్రస్తుతం నయీ దిశ హైదరాబాద్ మీద దృష్టి సారించింది. హైదరాబాద్‌లో ఉన్న స్పెషల్ కిడ్స్ తల్లిదండ్రులను ఏకం చేస్తున్నది. వెబ్‌సైట్, వాట్సాప్ గ్రూప్ ద్వారా స్పెషల్ కిడ్స్ తల్లిదండ్రులను గ్రూప్‌గా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకూ హైదరాబాద్ నుంచి సుమారు 600 కుటుంబాలు నయీ దిశలో సభ్యులుగా ఉన్నట్టు ప్రాచీ చెప్తున్నది. అక్టోబర్ 13న హైటెక్ సిటీలోని 'ఫోనిక్స్ అరేనా'లో స్పెషల్ కిడ్స్ కుటుంబాల కోసం ఈవెంట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో పిల్లలతో పలు కార్యక్రమాలు చేయిస్తారు. స్పెషల్ కిడ్స్ ఏం చేస్తారు? ఎలా చేస్తారు? అనేది చూపిస్తారు. నృత్యం, సంగీతం, ఫ్యాషన్ షో, ఆర్ట్-క్రాఫ్ట్ ప్రదర్శనలు ఈ కార్యక్రమంలో ఉంటాయి. స్పెషల్ కిడ్స్‌ను ఎలా పెంచాలి? వారిని ఎలా చూడాలి అనే కార్యక్రమాలూ ఉంటాయి. ఆసక్తి ఉన్న అందరికీ ఈ కార్యక్రమం ఆహ్వానం పలుకుతున్నది. వివరాలకు నయీదిశ వెబ్‌సైట్‌ను చూడొచ్చు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఈ కార్యక్రమానికి హాజరుకావాలి.

Nayi Disha
inform · connect · empower

ఈ పండ్లు తప్పక తినండి

బరువు తగ్గాలన్నా.. రోగనిరోధక శక్తి పెరగాలన్నా పండ్లు తినాలి. ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధుల్ని ఎదుర్కొనేందుకు కొన్ని పండ్లు తప్పకుండా తినాలి. సీజనల్ పండ్లను తింటే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండొచ్చని చెబుతున్నారు వైద్యులు. అవేం పండ్లంటే..

- చాలామంది వర్షాకాలంలో వేడి వేడి టీనో, మిరపకాయ బజ్జీనో తినడానికి ఇష్టపడుతుంటారు. కానీ పండ్లు తినడానికి మాత్రం ఆసక్తి చూపరు. కాలం ఏదైనా పండ్లను తింటే ఆరోగ్యంగా ఉంటాం. ముఖ్యంగా వర్షాకాలంలో దొరికే అన్ని పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.
- వర్షాకాలంలో ఎక్కువగా దొరికేవి నేరేడు పండ్లు. నేరేడు పండ్లలో కేలొరీలు తక్కువగా ఉంటాయి. ఇనుము, ఫోలేట్, పొటాషియం, విటమిన్లు అధికంగా ఉంటాయి. బరువు తగ్గాలనుకునే వారు నేరేడును తీసుకోవాలి. అజీర్ణ సమస్యల్ని కూడా ఇవి తగ్గిస్తాయి.
- రోగనిరోధక శక్తిని పెంచడంలో దానిమ్మ కీలకపాత్ర పోషిస్తుంది. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ రోజూ ఓ పండు తింటే ఆరోగ్యంగా ఉంటారు. దానిమ్మ జ్యూస్ తాగినా ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.
- వర్షాకాలంలో జీవక్రియల రేటు కాస్త నిదానంగా ఉంటుంది. దీంతో శరీరం కూడా చురుగ్గా ఉండదు. అందుకని వర్షాకాలంలో ఆపిల్ ముక్కలు తింటే ఆరోగ్యంగా చురుగ్గా ఉండవచ్చు. కొందరు ఆపిల్‌ను పొట్టు తీసి తింటారు. ఇలా తినడం మంచిది కాదు. పొట్టు తీయకుండా తింటే పోషకాలు అందుతాయి.
- అరటిలో విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. అజీర్తి సమస్య ఉండదు. పిల్లలకు రోజూ ఓ పండు తినిపించాలి. దీంతో వారికి కావాల్సిన శక్తి అందుతుంది. పొట్ట నిండిన భావన కూడా కలుగుతుంది.
- బొప్పాయిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి ఉపయోగపడుతుంది. వానాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలను బొప్పాయి దూరం చేస్తుంది. ఇందులో పీచు ఎక్కువగా ఉంటుంది. బొప్పాయిని మితంగా రోజుకు వంద గ్రాముల వరకు తీసుకుంటేనే మంచిది. అధికంగా తింటే వేడి చేస్తుంది.

చిన్నారులకు అండగా..

ఉత్సాహంగా ఆడుకుంటున్న బాబుకు ఒక్కసారిగా 106 డిగ్రీల సెల్సియస్ జ్వరం వచ్చింది. వైద్య పరీక్షల్లో లుకేమియా అని తేలింది. ముందు భయపడినా, ఆ తర్వాత గుండెనిబ్బరంతో ఉన్నారు. తమలా ఈ వ్యాధి గురించి తెలియకుండా బాధపడే తల్లిదండ్రులకు అండగా నిలువాలనుకున్నారు.



ఢిల్లీకి చెందిన మోనిక, అరవింద్ పోహ్రా దంపతుల 5 ఏండ్ల కుమారుడు ఆర్యన్‌కు లుకేమియా వ్యాధి వచ్చింది. తమ పిల్లవాడిలా ఈ వ్యాధితో బాధపడే పేద పిల్లలను ఆదుకోవాలనుకున్నారు. అందుకోసం 'లుకేమియా క్రుసేడర్స్' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. క్రుసేడర్స్ అంటే పోరాటయోధులు అని అర్థం. 14 ఏండ్ల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు రక్త క్యాన్సర్ నుంచి బయటపడే అవకాశం ఉన్నది. అందుకోసమే బాధితులతోపాటు వారి కుటుంబ సభ్యులను కలిసి రక్త క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ వారికి ఆర్థిక సాయం కూడా అందిస్తున్నారు. 2013లో ప్రారంభమయిన 'లుకేమియా క్రుసేడర్స్' సంస్థ 17 రాష్ట్రాల్లోని 42 ఆసుపత్రుల్లో 1,240 మంది పిల్లలకు చికిత్స అందిస్తున్నారు. బాధితుల గురించి పూర్తి సమాచారం అందుకున్న 48 గంటలలోపే తమ సంస్థకు చెందిన వలంటీర్లు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందిస్తారు. 'ప్రభుత్వాలు అందిస్తున్న అనేక పథకాలు మారుమూల గ్రామాల వరకూ చేరడం లేదని, దీనివల్ల ఆయా పథకాలకు కేటాయించిన నిధులు పక్కదారి పడుతున్నాయని' మోనికా అంటున్నది. లుకేమియా క్రుసేడర్స్ సంస్థ దేశవ్యాప్తంగా ఉన్న పలు ఆసుపత్రులతో కలిసి దీనితో బాధపడే చిన్నారులకు అవసరమయిన, చికిత్స, ఆర్థిక సాయం అందిస్తున్నది. మోనిక కుమారుడు ఆర్యన్‌కు ఇప్పుడు 13 ఏండ్లు. లుకేమియా నుంచి పూర్తిగా కోలుకున్నాడు.

కిచెన్ గార్డెన్ నిర్వహణ ఇలా

కిచెన్ గార్డెనింగ్ ఇప్పడొక ట్రెండ్. కాలక్షేపం కోసం మొక్కల్ని పెంచుతున్నారు. రోజూ మొక్కలకు నీళ్లు పట్టడం, చెత్తను శుభ్రం చేయడం వంటి పనులు చేస్తుంటే వ్యాయామం సైతం అవుతుంది. కిచెన్ గార్డెన్ అంటే కిచెన్‌లోనో, కిచెన్ సమీపంలోనో మొక్కలు పెంచుకోవడం కాదు. ఇంటి పరిసరాల్లో, ఖాళీ స్థలంలో కూరగాయలు, పండ్ల మొక్కల్ని పెంచుకోవడం. కొత్తగా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలనుకునే వారికి చిట్కాలు.

- కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేద్దామనుకునే ప్రదేశంలో ఎల్లప్పుడూ సూర్యకాంతి పుష్కలంగా ఉండేట్లు చూసుకోవాలి. పెరటి మొక్కలు పెరగడానికి సూర్యరశ్మి ప్రధానం. మొక్కలకు రోజులో కనీసం 5– 6 గంటలు సూర్యకాంతి అవసరం ఉంటుంది. అందువల్ల కూరగాయలను పెంచుకోవడానికి నీడ ప్రాంతాలను ఎంచుకోవద్దు.
- మొక్కలకు సరిపడా నీళ్లు సహజంగా, క్రమం తప్పకుండా పట్టాలి. కిచెన్ గార్డెన్‌కు చాలా ఎక్కువ నీళ్లు లేదా చాలా తక్కువ నీళ్లను పట్టకూడదు. గార్డెనింగ్‌కు ఎంపిక చేసుకునే మట్టి నాణ్యమైందిగా ఉండాలి. ఇందులో ఆవుపేడ కలిస్తే మరింత మంచిది.
- మొక్కలకు ప్రతిరోజూ నీళ్లు పట్టాలి. ఒక్కరోజు నీళ్లు పట్టకపోయినా మొక్కలు ఎండిపోయే అవకాశం ఉంటుంది. ప్రారంభ దశలో కుండీల్లోని మట్టి మొత్తం తడిసేలా ప్రతిరోజు నీళ్లుపోయాలి. ఆరు నెలల తర్వాత రోజు విడిచి రోజు నీళ్లు పోయవచ్చు.
- ప్రతి మొక్కకు సీజన్ ఉంటుంది. సీజన్‌ను బట్టి మొక్కలు నాటాలి. వాటి పెరుగుదలకు కనీసం నెలకోసారైనా ఎరువులు వేయాలి. ఎప్పటికప్పుడు ఎండిన, రాలిన ఆకుల్ని తొలగించాలి.
- కిచెన్ గార్డెన్‌ను ప్రతిరోజు శుభ్రం చేయాలి. పేరుకుపోయే చెత్తనుంచి దోమలు పెరుగుతాయి. ప్రతిరోజు పర్యవేక్షణ అవసరం.

స్పెషల్ ఇంటర్వ్యూ

అది ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్ ఫంక్షన్. వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పలు కేటగిరీల్లో పలువురు అవార్డులు సొంతం చేసుకున్నారు. ఈ వేడుకలకు అనుకోకుండా ఓ కుక్క గెస్ట్‌గా వచ్చింది. దాన్ని ప్రముఖ నటి, మోడల్ అదితి భాటియా ఇంటర్వ్యూ చేసింది.

ఇటీవల ముంబైలో ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్ వేడుకలు జరిగాయి. అదేనండీ.. ఐఫా అవార్డులు. ఈ కార్యక్రమానికి సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. భారీ బందోబస్తు నడుమ ఓ వీధికుక్క అవార్డు ఫంక్షన్ జరిగే వేదిక వద్దకు వచ్చింది. అది గమనించిన నటి అదితి భాటియా ''అనుకోకుండా ఇక్కడికి స్పెషల్ గెస్ట్ ఒకరు వచ్చారు. తనను ఇంటర్వ్యూ చేసి బోలెడు విషయాలు తెలుసుకుందాం'' అంటూ స్టేజి దిగి వచ్చింది. కుక్క భాటియాకు షేక్ హ్యాండ్ ఇచ్చింది. ఆ కుక్కను భాటియా రకరకాల ప్రశ్నలు అడిగింది. వాటిలో కొన్నింటికి సమాధానంగా కుక్క తలూపింది. ఏ మాత్రం భయపడకుండా కుక్క అక్కడే ఉంది. ఇదంతా వీడియో తీసి ఆమె సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. రెండు రోజుల్లోనే దాదాపు 8 లక్షల మంది ఈ వీడియోను చూశారు. కుక్కను ఇంటర్వ్యూ చేస్తున్న భాటియా ఫొటో సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు వైరల్‌గా మారింది. భాటియాతో పాటు ఆ కుక్క సెలెబ్రిటీల లిస్ట్‌లో చేరిపోయింది.

నలుపు తగ్గించుకోండిలా

కొందరి శరీరం తళ తళా మెరుస్తుంటుంది. కానీ మోచేతులు, మోకాళ్ల వద్ద మాత్రం నలుపు ఉంటుంది. వారు ఎన్నో బ్యూటీ పార్లర్స్ చుట్టూ తిరుగుతుంటారు. ఏవేవో క్రీమ్స్ వాడుతుంటారు. అయినా మోచేతులు, మోకాలి వద్ద నలుపు పోదు. ఇలాంటి వారు ఇంటి చిట్కాలను పాటిస్తే మంచిది.

- బేకింగ్ సోడాలో కాసిన్ని పాలు కలపాలి. కొద్దిసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మోకాళ్లు, మోచేతులపై అప్లై చేయాలి. ఇలా వారంపాటు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- నిమ్మరసం కూడా నలుపుదనం తగ్గించడంలో ఉపయోగపడుతుంది. కాబట్టి నిమ్మరసం తీసుకొని అందులో కాస్త రోజ్‌వాటర్ కలిపి అప్లై చేస్తే నలుపుదనం తగ్గుతుంది.
- కాసింత శనగపిండిలో పెరుగు కలిపి పేస్ట్‌లా చేయాలి. ఇది చర్మంపై ఎక్స్‌ఫోలియేట్‌లా పనిచేస్తుంది. వీటిని మోచేతులు, మోకాళ్లపై అప్లై చేయాలి. కాస్త ఆరాక కాసిన్ని నీళ్లు చల్లి క్లీన్ చేస్తే నలుపుదనం తగ్గుతుంది.
- కొబ్బరి నూనె రాయడం వల్ల శరీరంపై ఉండే నలుపుదనం తగ్గిపోతుంది. స్నానం చేశాక కొబ్బరినూనెని మోచేతులు, మోకాలిపై రోజూ అప్లై చేస్తే మెల్లిగా నలుపుదనం తగ్గుతుంది.
- అలోవెరాజెల్ రాయడం వల్ల ఒంటిపై ఉండే నలుపుదనం తగ్గుతుంది. కాబట్టి అలోవెరాలో కాస్త బియ్యంపిండి కలిపి మోచేతులు, మోకాలిపై అప్లై చేయాలి. ఇలా వారం రోజులపాటు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

II.

నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[కరీంనగర్]
మంగళవారం 24 సెప్టెంబర్ 2019

మెదడులో కణితికి కోతలేని సర్జరీ

ఆపరేషన్ అంటే ఎవరికైనా సరే ఒకింత భయం ఉంటుంది. ఇక శరీరంలోనే అతి సున్నితమైన భాగం అయిన మెదడుకు సంబంధించిన సర్జరీలంటే ఆ భయం రెట్టింపు అవుతుంది. మెదడులో ఏర్పడే ట్యూమర్లను తీసేయడానికి గతంలో సర్జరీ తప్ప మరో ప్రత్యామ్నాయం ఉండేది కాదు. కాని సర్జరీ కోసం చిన్న కోత కూడా లేకుండా మెదడును ఆపరేట్ చేయడం ఇప్పుడు సుసాధ్యమవుతోంది. ముఖ్యంగా ఆరోగ్యకరమైన మెదడు కణాలు దెబ్బతినకుండా మెదడులో ఏర్పడే కణితులను నాశనం చేయడం సులభమైంది. పదేళ్లుగా అందుబాటులోకి వచ్చిన ఆ చికిత్సే స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ. పూర్తిగా నాన్ ఇన్వేసివ్ పద్ధతిలో చేసే ఈ చికిత్స ఆసియాలోనే మొట్ట మొదటిసారి హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్‌లో అందుబాటులోకి వచ్చింది. పదేళ్లుగా ఎందరో పేషెంట్లను మెదడు సమస్యల నుంచి బయటపడేసిన స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ గురించి..

'ఐ ఆర్ సారీ.. ఇక ఏం చేయలేం.. ట్యూమర్ చాలా ముఖ్యమైన భాగంలో ఉంది.. సర్జరీ చేసినా సమస్య మరింత పెద్దది కావొచ్చు..'

మెదడులో కణితి ఏర్పడితే గతంలో అయితే డాక్టర్ల దగ్గరి నుంచి ఇలాంటి మాటలు వినాల్సి వచ్చేది. బ్రెయిన్‌లో ట్యూమర్ ఉందంటే ఇక వాళ్ల పని అయిపోయిందనుకునేవాళ్లు.

కానీ ఆధునిక వైద్యరంగ ఆవిష్కరణలతో మెదడుకు సంబంధించిన సర్జరీలంటే కూడా భయం నెమ్మదిగా పోయింది. ఎంఆర్ఐ, సిటి స్కాన్, బ్రెయిన్ ఆంజియోగ్రామ్ లాంటి పరీక్షలు వచ్చిన తరువాత మెదడు, వెన్నుపాములో ఏముంది, ఏమవుతోంది అనే విషయాలు తెలిశాయి. దాంతో సర్జరీ కూడా సురక్షితం అయింది.

పెద్ద కోత నుంచి కోత లేని దశకు..

మెదడు చాలా సున్నితమైన భాగం. అందుకే మెదడులో ఏమైనా అయిందంటే ఇక ప్రాణాలతో బయటపడడం కష్టం అనే దశ ఉండేది. దానికి ఆపరేషన్ చేయాలన్నా దాని తరువాత పరిణామాలు ఎలా ఉంటాయోననే భయం ఉండేది. మళ్లీ కాళ్లూ చేతులు సవ్యంగా ఉండేట్టు పనిచేస్తాయా లేదా, ఆరోగ్యంగా బయటపడతారో లేదోనన్న ఆందోళన ఉండేది. బ్రెయిన్ ని తెరిచి సర్జరీ చేయడం చాలా సంక్లిష్టంగా ఉండేది. కాని కీహోల్ సర్జరీ వచ్చిన తరువాత పరిస్థితి కొంత మెరుగయింది. పెద్ద కోత పెట్టాల్సిన అవసరం పోయింది. మైక్రోస్కోప్, ఎండోస్కోప్ వచ్చిన తరువాత కోత చిన్నది అయింది. ఓపెన్ సర్జరీకి 10సెం.మీ. కోత పెట్టాల్సి వస్తే దీనికి 1 నుంచి 1.5సెం.మీ. కోత చాలు. ఆ తరువాత కీహోల్ సర్జరీ కన్నా కూడా మెరుగైన నాన్ ఇన్వేసివ్ పద్ధతి వచ్చింది. అదే రేడియోసర్జరీ. దీనిలో గామా నైఫ్ రేడియో సర్జరీ ఎక్కువ ప్రాచుర్యం పొందింది. ఇప్పుడు దానికన్నా కూడా ఆధునికమైన స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ అందుబాటులోకి వచ్చింది.

స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ అంటే..?

ఆరోగ్యకరమైన కణజాలాన్ని కాపాడుతూ అసాధారణమైనదాన్ని తొలగించడమే సర్జరీ లక్ష్యం. అందుకే రేడియోసర్జరీ సక్సెస్ అయింది. గామా నైఫ్ రేడియోసర్జరీ కన్నా మెరుగైన ఫలితాలను ఇస్తుంది స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ (ఎస్ఆర్ఎస్). దీనిలో ఎక్స్‌రేల నుంచి ఫొటాన్ శక్తిని ట్యూమర్ పైకి పంపిస్తారు. మెదడుకు 2 గ్రేల రేడియేషన్‌ని మాత్రమే తట్టుకునే శక్తి ఉంటుంది. కాని ట్యూమర్‌ని చంపాలంటే అంతకన్నా ఎక్కువ రేడియేషన్ కావాలి. అందుకే స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీలో ఒక ప్రత్యేకమైన ఫిల్టర్ గుండా రేడియేషన్ కిరణాలన్నీ ట్యూమర్ పైన మాత్రమే కేంద్రీకృతం అయ్యేలా చేస్తారు. ఇందుకోసం 13 నుంచి 22 గ్రే ల రేడియేషన్‌ని వాడుతారు. ఇది హైడోస్ రేడియేషన్ అయినప్పటికీ రేడియేషన్ అంతా ప్రతి కిరణంలోనూ వందోవంతుకు విభజించబడి, ట్యూమర్ పైకి మాత్రం మొత్తం రేడియేషన్ టార్గెట్ అవుతుంది. కాబట్టి ట్యూమర్ మాత్రమే రేడియేషన్‌కి లోనవుతాయి. మిగిలిన కణాలపై దీని ప్రభావం ఉండదు. దీనిలో ట్రిపుల్ ఎఫ్ టెక్నాలజీని ఉపయోగిస్తారు. దీనికి ప్రత్యేక ఫిల్టర్ ఉపయోగిస్తారు. ఈ రేడియోసర్జరీలో ఫ్రేమ్ వాడరు. అందుకే ఫ్రేమ్‌లెస్ స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ అంటారు. అయితే ఈ సర్జరీ చేయాలంటే ట్యూమర్ పరిమాణం 3 సెం.మీ. కన్నా తక్కువగా ఉండాలి. కాని అంతకన్నా ఎక్కువ సైజులో ఉంటే సర్జరీ చేసి దాన్ని తగ్గించి ఆ తరువాత రేడియోసర్జరీ ద్వారా మొత్తం ట్యూమర్‌ని తీసేయవచ్చు. రేడియేషన్ పంపించిన తరువాత రెండేళ్లకి కణితి పూర్తిగా కుంచించుకుపోతుంది. 3 నుంచి 5 ఏళ్లలో 60నుంచి 70 శాతం తగ్గుతుంది. చివరికి మచ్చలాగా మిగుల్తుంది. రెండు లేదా అంతకన్నా ఎక్కువ ట్యూమర్లు ఉన్నప్పుడు కూడా ఒకే సిట్టింగ్‌లో రేడియోసర్జరీ ద్వారా తొలగించవచ్చు. 5 ట్యూమర్లను ఒకేసారి తొలగించవచ్చు. ఈ రేడియేషన్ 1 మి.మీ. కన్నా తక్కువ కచ్చితత్వంతో ట్యూమర్‌ని చంపేస్తుంది.

ఏ కణుతులకు అవసరం?

- పిట్యూటరీ గ్రంథి నుంచి మొదలయ్యే ట్యూమర్లు
- మెనింజియోమాస్ – మెదడు, వెన్నుపాముల పైన ఉండే పొరలను మెనింజెస్ అంటారు. ఈ మెనింజెస్ నుంచి పెరిగే కణుతులను మెనింజియోమాస్ అంటారు. ఇవి క్యాన్సర్ కణుతులు కాదు. ఇవి నెమ్మదిగా పెరుగుతాయి. వీటివల్ల ఏ లక్షణాలూ కనిపించవు.
- అకాస్టిక్ షావనోమాస్ – వెస్టిబ్యులార్ నరం నుంచి పెరిగే కణుతులివి. బ్రెయిన్ స్టెమ్, క్రేనియల్ నరాల వంటి సున్నితమైన భాగాలకు ఇవి దగ్గరగా ఉంటాయి.
- హేమాంజియోబ్లాస్టోమాస్ – కేంద్రనాడీవ్యవస్థ అంటే మెదడు, వెన్నుపాములకు సంబంధించిన రక్తనాళాల దగ్గర పెరిగే కణుతులు.
- కావెన్‌నోమాస్ – అసాధారణ రక్తనాళాలన్నీ కలిసి గుంపుగా కణితిగా ఏర్పడుతాయి. వీటివల్ల ఫిట్స్ వస్తాయి.
- ఆర్టరియోవీనస్ మాల్‌ఫార్మేషన్స్ – రక్తనాళాలన్నీ చిక్కుకుపోయి, రక్తం లీక్ అవుతుంది. ఇది సాధారణ రక్తప్రసరణకు ఆటంకం కలిగిస్తుంది.
- సర్జరీతో పూర్తిగా పోకుండా మిగిలిపోయిన కణుతులు, సర్జరీ తరువాత మళ్లీ ఏర్పడిన కణుతులు
- ట్రైజెమినల్ న్యూరాల్జియా లాంటి న్యూరలాజికల్ సమస్యలకు కూడా స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ అవసరం అవుతుంది.

క్యాన్సర్ కణుతులకు పనికొస్తుందా?

స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ ద్వారా రేడియేషన్ కిరణాలన్నీ కేవలం కణితిపైనే ఫోకస్ అవుతాయి. కాబట్టి కణితి నాశనం అయిపోతుంది. క్యాన్సర్ కణితి ఏర్పడినప్పుడు ఈ చికిత్స వాడలేము. ఎందుకంటే క్యాన్సర్ కణితి చుట్టుపక్కల కొన్ని కణాల వరకు కూడా క్యాన్సర్ కణాలు ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి క్యాన్సర్ కణితిపై మాత్రమే రేడియేషన్ ఫోకస్ అయ్యేలా చేయడం కష్టం. అందువల్ల క్యాన్సర్ కణితికి రేడియోసర్జరీ పనికిరాదు. క్యాన్సర్ కణితిని నాశనం చేయడానికి రేడియోథెరపీ ఉపయోగిస్తారు.

లాభాలేంటి?

- స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ కోసం హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరం లేదు. దీన్ని ఔట్ పేషెంట్‌గా చేయొచ్చు.
- రేడియోసర్జరీ పూర్తిగా నాన్ ఇన్వేసివ్ ప్రక్రియ. దీనికోసం కోత పెట్టాల్సిన అవసరం ఉండదు.
- ఆపరేషన్ అంటే సాధారణంగా రక్తస్రావం జరుగుతుంది. కానీ ఈ రేడియోసర్జరీలో కోత ఉండదు కాబట్టి దీని వల్ల రక్తస్రావం ఉండదు.
- ఈ చికిత్స చేసేటప్పుడు ట్యూమర్ కణాలు తప్ప, దాని చుట్టు పక్కల ఉండే ఆరోగ్యకరమైన మెదడు కణాలకు ఎటువంటి ప్రమాదమూ ఉండదు.
- చికిత్స చాలా కచ్చితత్వాన్ని కలిగివుంటుంది.
- సాధారణ సర్జరీతో చికిత్స అందించలేని ట్యూమర్లను కూడా దీని ద్వారా నాశనం చేయవచ్చు.
- ఒకేసారి రెండు కన్నా ఎక్కువ కణుతులను తీసేయొచ్చు.
- ఓపెన్ సర్జరీ ద్వారా చికిత్స చేసేటప్పుడు కణితిలోని కణాలు పక్కకు వెళ్లేందుకు ఆస్కారం ఉంటుంది. కాని ఇందులో ఆ రిస్కు ఉండదు.
- కోత ఉండదు కాబట్టి ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉండదు.
- సంప్రదాయిక సర్జరీలో పొరపాటున మిగిలిపోయిన ట్యూమర్ కణాలను కూడా దీనిద్వారా నాశనం చేయవచ్చు.
- వృద్ధులకు, సర్జరీ చేయలేని పేషెంట్లకు కూడా ఈ రేడియోసర్జరీ చేయవచ్చు.

ఎప్పుడవసరం?

చిన్న చిన్న కణితులు, మెదడులో చాలా లోపలికి ఏర్పడిన వాటికి చికిత్స చేయడం కోసం ఈ స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ అభివృద్ధి చేశారు. అయితే క్రమంగా బ్రెయిన్ ట్యూమర్లతో పాటుగా ఆర్టరియోవీనస్ మాల్ ఫార్మేషన్స్ లాంటి రక్తనాళాల్లో ఏర్పడే సమస్యలకు కూడా దీన్ని వాడుతున్నారు. హేమాంజియోబ్లాస్టోమా, కావర్‌నోమా లాంటి వాటికి ఎస్ఆర్‌సితోనే చికిత్స చేస్తున్నారు. అంతేకాదు కొన్ని రకాల తీవ్రమైన బ్రెయిన్ డిజార్డర్లకు కూడా ఈ చికిత్స మంచి ఫలితాలను ఇస్తోంది. ట్రైజెమినల్ న్యూరాల్జియా ఉన్నప్పుడు కూడా స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ ద్వారా పరిష్కరించవచ్చు.

మెదడులోని సంక్లిష్టమైన, కీలకమైన భాగాల్లో కణుతులు ఏర్పడితే గతంలో సర్జరీ చేస్తే తీవ్రమైన దుష్ప్రభావాలు కలిగేందుకు అవకాశం ఉండేది. మాట, చూపు దెబ్బతినడం, కాళ్లూ చేతులు పడిపోవడం లాంటి సమస్యలు కూడా వచ్చేవి. అందుకే అలాంటి పరిస్థితి ఉంటే సర్జరీ చేయకుండా వదిలేసేవాళ్లు. ఏం చేయలేక బతికినన్నాళ్లు బతుకుతారన్న నిస్పృహతో ఉండేవాళ్లు. కాని స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ వచ్చిన తరువాత మెదడులో చాలా లోపల ఏర్పడిన కణుతులైనా, ముఖ్యమైన అవయవాలకు సంబంధించిన నరాలున్న భాగంలో కణితి ఏర్పడినా, కంటికి సంబంధించిన నరాలు, మాటకు సంబంధించిన భాగాల్లో ఏర్పడినా, చిన్నమెదడులో ఏర్పడిన కణుతులకు కూడా స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీతో చికిత్స చేయవచ్చు. పుర్రె మూల భాగంలో మాట్లాడడం, తినడం లాంటి పనులకు సంబంధించిన నరాలుంటాయి. ఇక్కడి కణితిని తీసేయడం ఒక ప్పుడు కష్టంగా ఉండేది. కాని ఎస్ఆర్‌సితో ఇప్పుడిది సాధ్యమవుతున్నది.

కావెర్నస్ సైనస్ ట్యూమర్లు, బ్రెయిన్ స్టెమ్ భాగంలో ట్యూమర్లు ఉన్నప్పుడు సంప్రదాయిక సర్జరీ చేస్తే ప్రాణాపాయం ఎక్కువగా ఉంటుంది. ఇది చాలా క్లిష్టమైనది. అంతేగాక ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ కాబట్టి యాంటిబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. సర్జరీ తరువాత కనీసం 16 గంటలు ఐసియులో పెట్టాల్సి వస్తుంది. ఇక వయసు ఎక్కువగా ఉన్నవాళ్లయితే రిస్కు మరింత ఎక్కువ. సర్జరీ చేయడమే రిస్కు అనుకుంటే వాళ్లకు మత్తుమందు ఇవ్వడంలో కూడా ఇబ్బందులుంటాయి. అనెస్థీషియా వల్ల దుష్ప్రభావం కలిగేందుకు ఆస్కారం ఉంటుంది. కణితి క్రిటికల్ భాగంలో అంటే రక్తనాళాల దగ్గర ఉన్నా, చిన్న మెదడు దగ్గరున్నా సర్జరీ చేసి ట్యూమర్‌ను తీయలేము. దీనివల్ల పేషెంటు కోమాలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. ఇలాంటప్పుడు స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ మంచి ఫలితాలను ఇస్తుంది.

ఏది బెస్ట్?

- గామా నైఫ్ రేడియోసర్జరీ
- గామా నైఫ్ రేడియోసర్జరీలో కోబాల్ట్ నుంచి కిరణాలను పంపిస్తారు.
- దీనిలో ఫ్రేమ్ ఉంటుంది. దీన్ని తలకు ఫిక్స్ చేస్తారు.
- సర్జరీకి 3 నుంచి 5 గంటల సమయం పడుతుంది. అంతసేపూ ఈ ఫ్రేమ్‌ని అలా పెట్టుకునే ఉండాలి.
- ఇది న్యూరో సమస్యలకి మాత్రమే పనికొస్తుంది.
- దీనికి ఖర్చు ఎక్కువ

స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ

- గామా నైఫ్ రేడియోసర్జరీ కన్నా స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ దానికన్నా ఆధునికమైనది.
- స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీలో ఎక్స్‌రేల నుంచి ఫొటాన్ ఎనర్జీని పంపిస్తారు.
- దీనిలో ఫ్రేమ్ ఉండదు. కాబట్టి కంఫర్టబుల్‌గా ఉంటుంది.
- సర్జరీకి మల్టిపుల్ డోస్ అయితే 5 నిమిషాలు, సింగిల్ డోస్ అయితే 15 నిమిషాల సమయం పడుతుంది.
- దీన్ని వెన్నుపాములో వచ్చిన ట్యూమర్లకు కూడా వాడొచ్చు.
- ఈ సర్జరీకి అయ్యే ఖర్చు కూడా తక్కువ.
- స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ వల్ల సాధారణంగా సమస్యలుండవు. అంతకుముందే ఫిట్స్ వచ్చే సమస్య ఉన్న వాళ్లకి సర్జరీ తరువాత ఫిట్స్ వచ్చే అవకాశం ఉంటుంది. కాని దీనికి కూడా మందులు వాడితే సరిపోతుంది.

ట్యూమర్ ఎందుకు ఏర్పడుతుంది?

కణాలు కంట్రోల్ తప్పి విభజన చెంది పెరిగితే కణితి ఏర్పడుతుంది. కణుతులు అన్నీ క్యాన్సర్ కాదు. క్యాన్సర్ కాని కణుతులను బినైన్ ట్యూమర్లు అంటారు. క్యాన్సర్ కణాలైతే కణితి ఏర్పడిన చోటి నుంచి ఇతర భాగాలకు వ్యాపిస్తాయి. కాని బినైన్ కణితి కణాలు అలా వ్యాపించవు. కాని కణితి పక్కనున్న నరంపై ఒత్తిడి పడడం వల్ల ఇతర సమస్యలు రావొచ్చు. అందుకే బినైన్ కణితులకు కూడా చికిత్స అందించాలి. క్యాన్సర్‌ని పూర్తిగా నయం చేయలేము. కాని బినైన్ ట్యూమర్లను ఒకసారి తొలగిస్తే ఇక జీవితాంతం సమస్య ఉండదు. సాధారణంగా ఈ ట్యూమర్లు జన్యుపరమైన కారణాల వల్ల ఏర్పడుతాయి. వీటికి ఎన్విరాన్‌మెంటల్ కారణాలు తోడవుతాయి. కాలుష్యం, స్ట్రెస్, ఫుడ్ లాంటివి కణితి ఏర్పడే జన్యుతత్వాన్ని ట్రిగ్గర్ చేస్తాయి. అందువల్ల బ్రెయిన్ ట్యూమర్లు ఏర్పడకుండా నివారించలేము. మంచి ఆహారం తీసుకుంటూ, మనసు ప్రశాంతంగా ఉంచుకుంటే కొంతవరకు మేలు.



ఎలా గుర్తించొచ్చు?

మెదడులో ట్యూమర్ ఉన్నప్పుడు సాధారణంగా ఎటువంటి లక్షణాలూ కనిపించవు. చాలావరకు ఇవి పరీక్షల్లో మాత్రమే బయటపడుతుంటాయి. కణితి పెరిగి మరీ పెద్దగా అయినప్పుడు చాలా రోజుల తర్వాత మాత్రమే ఇబ్బందులు తలెత్తవచ్చు. పదే పదే తలనొప్పి వస్తున్నదంటే మెదడులో ఏమైనా సమస్య ఉందేమోనని అనుమానించవచ్చు. తలనొప్పితో పాటుగా వికారంగా ఉండటం, వాంతులు అయితే తప్పనిసరిగా డాక్టర్‌ను కలవాలి. ట్యూమర్ పెద్ద సైజులో ఉన్నా, కీలకమైన నరాల దగ్గర ఏర్పడినా ఫిట్స్ రావొచ్చు. మెదడులో ట్యూమర్ వల్ల కొన్నిసార్లు కాళ్లూ చేతులు పడిపోవడం లాంటి ప్రమాదం కూడా ఉండొచ్చు.

డాక్టర్ రవి సుమన్ రెడ్డి
సీనియర్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్
ఫోన్ : 8121022333

నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

ఇస్రోలో

ఇస్రో ప్రాపెల్షన్ కాంప్లెక్స్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 22
- పోస్టుల వారీగా... ఫార్మసిస్ట్–1, హిందీ టైపిస్ట్–1, ఫిట్టర్–6, ఎలక్ట్రానిక్ మెకానిక్–2, వెల్డర్–4, కార్పెంటర్–1, మెకానికల్–1, డ్రైవర్ కమ్ ఆపరేటర్–2, ఫైర్‌మ్యాన్–2, కుక్–1, లైట్ వెహికిల్ డ్రైవర్–1 ఖాళీ ఉన్నాయి.
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 14
- వెబ్‌సైట్: http://www.iprc.gov.in

పంజాబ్ & సింధ్ బ్యాంకులో స్పెషలిస్ట్ ఆఫీసర్, సీఎస్, రాజభాష అధికారి పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

పంజాబ్ & సింధ్ బ్యాంకులో

- మొత్తం ఖాళీలు: 168

విభాగాల వారీగా ఖాళీలు–అర్హతలు:

- ఏజీఎం లా– 1
- అర్హత: లా డిగ్రీతోపాటు అనుభవం, 35–45 ఏండ్ల మధ్య ఉండాలి.
- కంపెనీ సెక్రటరీ–1
- అర్హత: డిగ్రీతోపాటు సంబంధిత రంగంలో అనుభవం. వయస్సు 30–40 ఏండ్ల మధ్య ఉండాలి.
- రాజభాష అధికారి–1
- అర్హత: పీజీతోపాటు సంబంధిత రంగంలో అనుభవం. వయస్సు 30–40 ఏండ్ల మధ్య ఉండాలి.
- లా మేనేజర్–10
- అర్హత: డిగ్రీ (లా)తోపాటు అనుభవం
- ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ –1
- అర్హత: బీఈ/బీటెక్ (ఫైర్ ఇంజినీరింగ్)తోపాటు అనుభవం.
- సెక్యూరిటీ ఆఫీసర్–15
- అర్హతలు: డిగ్రీతోపాటు అనుభవం
- అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్–50
- అర్హతలు: నాలుగేండ్ల డిగ్రీ (అగ్రికల్చర్/హార్టికల్చర్ లేదా తత్సమాన)
- చార్టెడ్ అకౌంటెంట్–50
- అర్హతలు: సీఏ ఉత్తీర్ణత
- సాఫ్ట్‌వేర్ డెవలపర్/ఐటీ ప్రోగ్రామర్–30
- అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా పీజీలో సీఎస్/ఐటీ ఉత్తీర్ణత.
- రాజభాషా అధికారి–5
- అర్హతలు: పీజీ (హిందీ)తోపాటు ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. లేదా తత్సమాన కోర్సు.
- టెక్నికల్ ఆఫీసర్ (సివిల్)–2
- టెక్నికల్ ఆఫీసర్ (ఎలక్ట్రికల్)–2
- అర్హతలు: పై రెండు పోస్టులకు బీఈ/బీటెక్‌లో సంబంధిత బ్రాంచీలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 26 నుంచి
- చివరితేదీ: అక్టోబర్ 10
- వెబ్‌సైట్: https://www.psbindia.com

భారత ప్రభుత్వ సంస్థ రెపో్కమైక్రో ఫైనాన్స్ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

రెపో్కలో

- మొత్తం ఖాళీలు: 50

విభాగాల వారీగా...

- జూనియర్ అసిస్టెంట్–25
- అర్హత: డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాలి.
- అసిస్టెంట్ మేనేజర్–25
- అర్హతలు: డిగ్రీ ఉత్తీర్ణత. కంప్యూటర్ నాలెడ్జ్, ఫైనాన్షియల్ సంస్థల్లో పనిచేసిన అనుభవంతోపాటు టూవీలర్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- వయస్సు: పై రెండు పోస్టులకు 30 ఏండ్లు మించరాదు.
- ఎంపిక: క్లర్క్ పోస్టులకు రాతపరీక్ష, అసిస్టెంట్ మేనేజర్‌కు రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి
- చివరితేదీ: సెప్టెంబర్ 25
- వెబ్‌సైట్: https://repcomicrofin.co.in

epaper.ntnews.com

కెన్యాలో కుప్పకూలిన పాఠశాల భవనం

ఏడుగురు విద్యార్థులు మృతి, 57 మందికి గాయాలు

నైరోబి, సెప్టెంబర్ 23: కెన్యాలో సోమవారం ఓ పాఠశాల భవనం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు విద్యార్థులు మృతిచెందగా, 57 మందికి గాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. డాగోర్టీలోని టాలెంట్ అకాడమీ అనే ప్రైవేటు స్కూలు భవనంలోని మొదటి అంతస్తు పైకప్పు కూలిపోయిందని, దాని కిందనున్న తరగతి గది నేలమట్టమైందని అధికారులు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న విద్యార్థులను సహాయ సిబ్బంది వెలికి తీసినట్లు చెప్పారు. మరోవైపు ఈ ఘటన గురించి తెలిసిన స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి వచ్చారు. ప్రమాదంలో తమ పిల్లలు మృతిచెందడంపై తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. గాయపడిన చిన్నారులను అంబులెన్స్‌లలో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాణాల మేరకు భవనాన్ని నిర్మించని స్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

కెన్యాలోని డాగోర్టీలో కుప్పకూలిన టాలెంట్ అకాడమీ స్కూలు భవనం

హెలికాప్టర్ క్రాష్ ల్యాండింగ్

గాయాలతో బయటపడిన ఆరుగురు ప్రయాణికులు.. ఉత్తరాఖండ్‌లో ఘటన

కేదారినాథ్, సెప్టెంబర్ 23: ఉత్తరాఖండ్‌లోని కేదారినాథ్ సందర్శనకు వచ్చిన ఆరుగురు యాత్రికులకు త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. కేదారినాథ్‌ను సందర్శించిన ఈ యాత్రికులు సోమవారం ప్రైవేట్ హెలికాప్టర్‌లో ఫతాకు బయలుదేరారు. హెలికాప్టర్ టేకాఫ్ అవుతుండగా దాని ముందు భాగాన్ని ఒక వస్తువు ఢీకొట్టడంతో సాంకేతిక లోపం తలెత్తింది. సమస్యను గుర్తించిన హెలికాప్టర్ పైలట్ వెంటనే కేదారినాథ్ హెలీప్యాడ్‌పై అత్యవసరంగా ల్యాండ్ చేశారని రుద్ర ప్రయాగ్ జిల్లా విపత్తు నివారణ సంస్థ అధికారి హరీశ్ చంద్ర శర్మ చెప్పారు. పైలట్ జాగ్రత్తగా దించడానికి ప్రయత్నించినప్పటికీ హెలికాప్టర్ క్రాష్ ల్యాండ్ అయిందన్నారు. అయినప్పటికీ, అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులు, పైలట్ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారని హరీశ్ చంద్రశర్మ తెలిపారు.

కేదార్‌నాథ్‌లో క్రాష్ ల్యాండింగ్ అయిన ప్రైవేట్ హెలికాప్టర్

స్వల్పంగా తగ్గనున్న దిగుబడులు

- తృణ ధాన్యాలు మినహా అన్నీ తగ్గుముఖమే
- వాణిజ్య పంటల దిగుబడి యథాతథం
- కేంద్ర వ్యవసాయశాఖ వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పంటల దిగుబడులు స్వల్పంగా తగ్గుతాయని కేంద్ర వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 2018-19 (జూలై- జూన్)లో ఆహార ధాన్యాల దిగుబడి 141.71 మిలియన్ టన్నులు (ఎంటీ) నమోదు కాగా, 2019-20లో 140.57 మిలియన్ టన్నులకు పరిమితం అవుతుంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో విత్తనాలు నాటడం దాదాపు పూర్తయిందని, వచ్చే నెలలో నూర్పిళ్లు ప్రారంభం అవుతాయని వ్యవసాయ శాఖ భావిస్తున్నది. ఆహార ధాన్యాల కేటగిరీలో వరి ధాన్యం, పప్పులు, తృణ ధాన్యాలు వస్తాయి. పంటల దిగుబడిపై వ్యవసాయశాఖ వివిధ దశల్లో నాలుగు రకాల అంచనాలను ఖరారు చేసింది. తొలి అంచనా ప్రకారం గతేడాది 102.13 మిలియన్ టన్నుల వరిధాన్యం దిగుబడి వస్తే, ఈ ఏడాది 100.35 మిలియన్ టన్నులకు పడిపోతుందని భావిస్తున్నది. ఇక గతేడాది పప్పు ధాన్యాల దిగుబడి 8.59 మిలియన్ టన్నులు లభిస్తే, ఈ ఏడాది 8.23 మిలియన్ టన్నులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుందని పేర్కొంది. అయితే, తృణ ధాన్యాల దిగుబడి మాత్రం గతేడాదిలో 30.99 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించగా, ఈ ఏడాది 32 మిలియన్ టన్నులకు పెరుగుతుందని అంచనా. ఇక వాణిజ్య పంటల్లో పత్తి గతేడాది 32.26 మిలియన్ బేళ్ల దిగుబడి సాధిస్తే, ఈ ఏడాది స్వల్పంగా 32.27 మిలియన్ బేళ్లకు పెరుగనున్నది. జనప నార ఉత్పత్తి కూడా 9.95 మిలియన్ బేళ్ల నుంచి 9.96 మిలియన్ బేళ్లకు పెరుగనున్నది. గతేడాది మాదిరిగానే ఈ వానాకాలం సీజన్‌లో 377.7 టన్నుల చెరుకు దిగుబడి లభిస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. తొలుత నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమైనా తర్వాత పుంజుకున్నదని, ఈ ఏడాది సాధారణ వర్షపాతమే నమోదైందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనావేసింది. కర్ణాటక, కేరళ, గుజరాత్, బీహార్, అసోం, మహారాష్ట్రల్లో కురిసిన భారీ వర్షాలతో పోటెత్తిన వరదల వల్ల వానాకాలం పంటలపై ప్రభావం పడుతుందని ఐఎండీ భావిస్తున్నది. దీర్ఘ కాల సగటు (ఎల్పీఏ) ప్రకారం ఈ నెల రెండో వారం వరకు వానాకాలంలో నాలుగు శాతం ఎక్కువ వర్షాలు కురిశాయని కేంద్ర వ్యవసాయశాఖ తెలిపింది. ఎక్కువగా వర్షాలు కురవడంతో 2019-20లో అంచనాలకంటే ఎక్కువగా పంటల దిగుబడులు సాధిస్తామని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది.

బాలాకోట్‌లో మళ్లీ ఉగ్ర శిక్షణ

- భారత్‌లోకి చొరబడేందుకు సిద్ధంగా 500 మంది
- ఉగ్రవాదులను ఏరివేసేందుకు భారత బలగాలు రెడీ
- కశ్మీర్ ఇప్పటికీ స్తంభించిందన్న వార్తల్లో నిజం లేదు
- ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్

మీడియాతో మాట్లాడుతున్న ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్



పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో ఉన్న జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ శిక్షణ శిబిరం శాటిలైట్ చిత్రం (ఫైల్)

చెన్నై, సెప్టెంబర్ 23: పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో ఉగ్రవాద శిబిరాన్ని ఇటీవల మళ్లీ ప్రారంభించారని భారత సైన్యాధిపతి బిపిన్ రావత్ పేర్కొన్నారు. 500 మందికిపైగా చొరబాటుదారులు భారత్‌లోకి చొరబడేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం ఉన్నదన్నారు. ఆయన సోమవారం చెన్నైలోని ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీని సందర్శించారు. యువ సైనికులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పాకిస్థాన్‌లోని నూతన ఉగ్రవాద శిబిరాల గురించి ప్రశ్నించగా.. 'పాకిస్థాన్ ఇటీవలే బాలాకోట్‌లో ఉగ్రవాద శిబిరాలను మళ్లీ ప్రారంభించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బాలాకోట్‌పై భారత యుద్ధ విమానాలు చేసిన దాడిలో ఉగ్రవాద శిబిరం ధ్వంసమైంది. దీంతో అక్కడి ఉగ్రవాదులు తలోదిక్కు వెళ్లిపోయారు. ఇప్పుడు మళ్లీ ఒక్కదగ్గరికి చేరుతున్నారు' అని రావత్ పేర్కొన్నారు. గతంలో బాలాకోట్‌పై వైమానిక దాడులకు దిగినట్టుగానే ఏవైనా చర్యలు చేపడుతారా? అన్న విలేకరుల ప్రశ్నకు.. ఇప్పుడే ఏమీ చెప్పలేమన్నారు. 'బాలాకోట్‌పై గతంలో చేసినట్టే మళ్లీ దాడిచేయాలని ఎందుకు అనుకుంటున్నారు? వేరే మార్గంలో దెబ్బతీయొచ్చు కదా? అయినా మనం ఏం చేస్తామో వారికి ఎందుకు చెప్పాలి? భారత్ ఏం చేయబోతున్నది?? అంటూ అవతలి వాళ్లు (పాకిస్థాన్) మధనపడాలి' అని చెప్పారు. భారత్‌లోకి చొరబడేందుకు సరిహద్దు వద్ద ఎంత మంది ఉగ్రవాదులు పొంచి ఉన్నారనేది వాతావరణ పరిస్థితులను బట్టి ఆధారపడి ఉంటుందన్నారు. ప్రస్తుతం కనీసం 500 మంది కశ్మీర్‌లోకి చొరబడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎండాకాలంలో మంచు కరిగే సమయంలో ఉత్తర కశ్మీర్‌వైపు చొరబాట్లు ఎక్కువగా ఉంటాయని, శీతాకాలంలో మంచు కురిసే సమయంలో ఆ సంఖ్య తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ సరిహద్దు రేఖ వెంబడి సైతం చొరబాటుదారులు సిద్ధంగా ఉన్నారన్నారు. వారందరినీ ఏరివేసేందుకు నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి బలగాల సంఖ్యను పెంచామని రావత్ తెలిపారు.

చొరబాటుదారుల కోసమే కాల్పులు

భారత బలగాల దృష్టిని మరల్చి తమ చొరబాటుదారులను జమ్ముకశ్మీర్‌లోకి పంపేందుకు పాక్ సైన్యం తరుచూ కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడుతున్నదని రావత్ మండిపడ్డారు. ముఖ్యంగా ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఇలాంటి ఘటనలు పెరిగాయన్నారు. వాటిని ఎలా ధీటుగా ఎదుర్కోవాలో, ఎలాంటి సమాధానం ఇవ్వాలో భారత సైన్యానికి తెలుసని చెప్పారు. అదే సమయంలో జవాన్ల రక్షణకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో సరైన జాగ్రత్తలు తీసుకుంటూ అనేకసార్లు భారత జవాన్లు షెల్స్ దాడుల నుంచి తప్పించుకున్నారని తెలిపారు. దీంతో పాకిస్థాన్ సాధారణ పౌరులను, వారి ఆస్తులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నదని పేర్కొన్నారు. సరిహద్దులో చొరబాట్లు, కాల్పుల గురించి ముందస్తుగా తెలుసుకొనేందుకు సైన్యానికి అత్యాధునిక సాంకేతికతను అందించామని, ఇంటెలిజెన్స్, సర్వెయిలెన్స్, రీకానిజెన్స్‌ను(ఐఎస్ఆర్) పెంచామన్నారు. చైనాతో సరిహద్దు సమస్యలను ఎప్పటికప్పుడు చర్చల ద్వారా పరిష్కరించుకుంటున్నామని చెప్పారు.

కశ్మీర్‌లో ప్రశాంతంగా జనజీవనం

జమ్ముకశ్మీర్ మొత్తం స్తంభించిపోయిందన్న వార్తలను బిపిన్‌రావత్ కొట్టిపారేశారు. జనజీవనం ప్రశాంతంగా కొనసాగుతున్నదన్నారు. కశ్మీర్‌లో ఏదో జరిగిపోతున్నదంటూ బయటి ప్రపంచాన్ని నమ్మించేందుకు ఉగ్రవాదులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. వాస్తవానికి కశ్మీర్‌లో హింస, రక్తపాతం అదుపులోకి వచ్చిందని, ఉగ్రవాదాన్ని ఒక ప్రాంతానికే పరిమితం చేయగలిగామని చెప్పారు. ప్రజలందరికీ సమాచార వ్యవస్థ అందుబాటులో ఉన్నదని, కానీ.. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులకు, కశ్మీర్ లోయలోని సానుభూతి పరులకు మధ్య సంబంధాలు తెగిపోయాయని పేర్కొన్నారు. సైనికులందరు తమ కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. కశ్మీర్ ప్రజలు తమ పనులను తాము చేసుకుంటున్నారని చెప్పారు. 'ప్రజలంతా స్వేచ్ఛగా బయటికి వస్తున్నారు. ఆర్థిక కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ఆపిల్ పండ్ల తోటల్లో కూలీలు పనులు చేసుకుంటున్నారు. ఆపిల్ పండ్లను లారీల్లో నింపి దేశం నలుమూలలకు పంపిస్తున్నారు. వ్యాపారులు జీలం నది నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇటుకల తయారీ స్వేచ్ఛగా నడుస్తున్నది' అని వెల్లడించారు. కార్లు, బస్సులు, విమానాలు గతంలో మాదిరిగానే సజావుగా నడుస్తున్నాయని, ఎక్కడా స్థంభించిపోయిన పరిస్థితులు లేవని స్పష్టం చేశారు. కశ్మీర్ నుంచి రోజూ వందల సంఖ్యలో ఆపిల్ పండ్ల లారీలు బయటికి వస్తున్నాయని, ఒకవేళ వారి ప్రచారమే నిజమైతే.. పండ్లను ఎవరు తెంపుతున్నారు? ఎవరు ప్యాక్ చేస్తున్నారు? ఎవరు లోడ్ చేస్తున్నారు? లారీలను ఎవరు నడుపుతున్నారు? అని రావత్ ప్రశ్నించారు. ఉగ్రవాదులు కావాలనే ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దుకాణాలను మూసివేయాలని ఉగ్రవాదులు బెదిరించినా వ్యాపారులు బెదరడం లేదని, తెరిచే ఉంచుతున్నారని చెప్పారు.

స్కూలును అనుసంధానించిన వంతెన!

ఔరంగబాద్: ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి కట్టుగా తీసుకున్న ఓ నిర్ణయం ఆ బడి పిల్లల చదువును సాఫీగా సాగేలా చేస్తున్నది. మహారాష్ట్రలోని ఔరంగబాద్ జిల్లాలోని నిమ్ చౌకీ ఖోర్ అనే గ్రామంలో ఓ ప్రాథమిక పాఠశాల ఉన్నది. కొండ ప్రాంతంలో ఉన్న ఈ పాఠశాలను చేరుకోవాలంటే ఓ కాలువను దాటాలి. వర్షకాలం కావడంతో ఆ కాలువ ఈ మధ్యకాలంలో ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో చదువుకోవడానికి వచ్చే దాదాపు 15 మంది విద్యార్థులు కాలువను దాటలేక పాఠశాలకు వెళ్లలేకపోతున్నారు. దీంతో వాళ్ల చదువు అటకెక్కింది. విద్యార్థుల సమస్యను గమనించిన ఆ పాఠశాల ఉపాధ్యాయులు.. విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో వెదురు బొంగులను సేకరించారు. రూ. 50 పెట్టి కొనుగోలు చేసిన వైరుతో ఆ వెదురు బొంగులను ఒక మోపుగా కట్టి కాలువపై వంతెన నిర్మించారు. దీంతో కాలువను దాటే కష్టాలు విద్యార్థులకు తప్పినట్టైంది. 'వర్షకాలంలో పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. దీనికి కారణం.. పాఠశాల సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువే. విద్యార్థులు ఆ కాలువను దాటలేక పాఠశాలకు వచ్చేవారు కాదు. ఈ మధ్య జిల్లా కేంద్రంలో ప్రారంభించిన 'డిజైన్ ఫర్ ఛేంజ్' కార్యక్రమంలో భాగంగా వెదురు బొంగులతో వంతెనను ఎలా నిర్మించాలో ఉపాధ్యాయులం అందరం నేర్చుకున్నాం. విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో కాలువపై వంతెనను నిర్మించాం' అని దత్తా అనే టీచర్ చెప్పారు. 'కాలువను దాటేప్పుడు అప్పుడప్పుడు మా పుస్తకాలు కొట్టుకుపోయేవి. మా దుస్తులు బురదగా మారేవి. ఇప్పుడు అలాంటి సమస్యలు లేవు' అని ప్రదీప్ బగుల్ అనే విద్యార్థి నవ్వుతూ చెబుతున్నాడు.

భూ పంపిణీతో దళితుల పురోగతి

- ఐదేండ్లలో 5,798 కుటుంబాలకు 14వేల ఎకరాలు పంపిణీ
- ఇందుకోసం రూ.641.80కోట్లు వెచ్చించిన సర్కారు

2014 నుంచి ఐదేండ్లలో భూమి పంపిణీ వివరాలు

ఏడాది	లబ్ధిదారుల సంఖ్య	భూమి పంపిణీ (ఎకరాల్లో)	వ్యయం (రూ.కోట్లల్లో)
2014-15	771	2,034.32	74.64
2015-16	1,800	4,665.21	199.70
2016-17	852	2,278.27	104.17
2017-18	1,462	3,470.17	158.16
2018-19	913	2,254.26	105.13
మొత్తం	5,798	14,702.23	641.80

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ సర్కారు అమలుచేస్తున్న మూడెకరాల వ్యవసాయ భూ పంపిణీ పథకంతో ఆర్థికంగా నిలదొక్కుకొంటున్నారు. ఏండ్ల తరబడి కూలీలుగా మగ్గిపోతున్న ఎస్సీ కుటుంబాలకు వంద శాతం సబ్సిడీతో మూడెకరాల వ్యవసాయ భూమిని అందజేస్తున్న కేసీఆర్ సర్కారు.. పంటల సాగు కోసం కూడా ఆర్థిక సహకారం అందిస్తున్నది. పంటల సాగు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీలకు ఈ పథకం బతుకు దారి చూపుతున్నది. వ్యవసాయ భూమిలేని నిరుపేద ఎస్సీ మహిళలకు మొదటి దశలో మూడెకరాల భూమిని కేటాయించారు. ఈ పథకం కింద ఐదేండ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 5,798 ఎస్సీ కుటుంబాలకు లబ్ధి చేకూరింది. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ ఆధారిత దళిత కుటుంబాలకు ఎకరాకు రూ.2లక్షల నుంచి రూ.7లక్షల వరకు వెచ్చించి మూడెకరాల వ్యవసాయ భూమి పంపిణీ పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. 2014లో మొదలైన ఈ పథకం అమలుకు ఐదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.641.80కోట్లు వెచ్చించింది. 14,702.23 ఎకరాల భూమిని సేకరించి పంపిణీ చేసింది. ప్రభుత్వం అందజేసిన భూమిని సాగు చేసుకొంటూ వేల కుటుంబాలు ఆర్థిక పురోగతి వైపు దూసుకెళ్తున్నాయి.

తెలంగాణలో పరిశ్రమలకు విస్తృత అవకాశాలు

సీఎస్ జోషితో అమెరికన్ కాన్సుల్ జనరల్ రిఫ్‌మన్ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తెలిపారు. అమెరికన్ కాన్సుల్ జనరల్ జోయల్ రిఫ్‌మన్ సోమవారం బీఆర్కేభవన్‌లో సీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూఎస్ కాన్సులేట్ భవన నిర్మాణం పరిస్థితిపై ఇరువురు చర్చించారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నామని, ముఖ్యంగా సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి వివరించారు. విద్య, వైద్య, ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర రంగాల్లో సహకారం అందిపుచ్చుకోవడానికి విస్తృతమైన అవకాశాలున్నాయని తెలిపారు. తెలంగాణతో అమెరికా స్నేహపూర్వక వాతావరణం కొనసాగాలని ఆశించారు. ఈ సందర్భంగా అమెరికన్ కాన్సుల్ జనరల్ జోయల్ రిఫ్‌మన్ మాట్లాడుతూ.. అమెరికా, తెలంగాణ స్నేహపూర్వక మైత్రి మరింత పెంపొందించేలా కృషిచేస్తామని చెప్పారు.

బీఆర్కే భవన్‌లో సీఎస్ ఎస్కే జోషిని కలిసిన అమెరికన్ కాన్సుల్ జనరల్ జోయల్ రిఫ్‌మన్



బీఆర్కేభవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ ఎస్కే జోషితో 2018 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు

ఐఏఎస్‌లకు ఐఫోన్, ఐపాడ్‌లు పంపిణీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారులకు యాపిల్ మాక్ బుక్, ఐఫోన్, ఐపాడ్‌లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి పంపిణీ చేశారు. సోమవారం బీఆర్కే భవన్‌లోని తన కార్యాలయంలో సీఎస్ యువ ఐఏఎస్ అధికారులకు వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలన్నారు. రోజువారీ కార్యకలాపాల్లో సాంకేతికను ఉపయోగించుకొని, కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. గ్రామాల్లో అమలవుతున్న 30రోజుల ప్రణాళిక గురించి యువ ఐఏఎస్‌లను సీఎస్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అదర్‌సిన్హా, డిప్యూటీ సెక్రటరీ చిట్టిరాణి, యువ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

టెంపో, బస్సు ఢీ: 9 మంది మృతి

పలువురికి గాయాలు.. అసోంలో ఘటన

డెమోవ్ (అసోం), సెప్టెంబర్ 23: అసోంలోని శివసాగర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం 8.35 గంటలకు గోలాఘాట్ నుంచి దిబ్రూగఢ్ వైపు వెళుతున్న ఒక ప్రైవేట్ బస్సు.. 37వ నంబర్ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న టెంపో వ్యాన్‌ను ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు రోడ్డు పక్కకు ఒరిగాయి. ప్రమాదం సంగతి తెలియగానే అక్కడికి చేరుకున్న పోలీసులు సహాయ చర్యలు చేపట్టారు. రెండు వాహనాల్లోని మృతదేహాలను, క్షతగాత్రులను వెలికి తీశారు. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స కోసం దవాఖానకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మరణించారు. మృతుల్లో అత్యధికులు టెంపో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న వారేనని పోలీసులు చెప్పారు. క్షతగాత్రులను తొలుత సమీప డెమోవ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి 15 మందిని దిబ్రూగఢ్‌లోని అసోం మెడికల్ కాలేజీ దవాఖానకు పంపినట్లు వైద్యాధికారులు తెలిపారు.

కారును ఢీకొట్టిన బొగ్గు లారీ

ముగ్గురు సజీవ దహనం.. జార్ఖండ్‌లో ఘటన

రాంచి, సెప్టెంబర్ 23: జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లా పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం గిరిధ్ జిల్లా నుంచి హజారీబాగ్ వైపు వెళుతున్న ఒక కారును బొగ్గుతో కూడిన లారీ ఢీకొట్టి దానిపై పడింది. ఆ వెంటనే కారులో మంటలు చెలరేగాయి. ఆ మంటల్లో ముగ్గురు ఆహుతయ్యారు. మృతులను మహ్మద్ జలాలుద్దీన్, మహ్మద్ తౌఫిక్, లారీ డ్రైవర్ కైలాష్ పాశ్వాన్‌గా గుర్తించారు. కారును బేణి నదిపై నిర్మించిన వంతెన వద్ద బొగ్గు లారీ ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు.

విజయశాంతి సీజనల్ పొలిటీషియన్

టీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు గుండు సుధారాణి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ అభివృద్ధిని కాంక్షించి, నిబంధనలకు లోబడే అప్పులు తీసుకొచ్చినట్టు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అసెంబ్లీలో స్పష్టంగా ప్రకటించారని.. అయినప్పటికీ ప్రతిపక్షాలు అవగాహన లేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని టీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు గుండు సుధారాణి అన్నారు. సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ విజయశాంతి సీజనల్ పొలిటీషియన్ అని విమర్శించారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చేసే కార్యక్రమాలపై ఆరోపణలు చేయడం తగదన్నారు. తెలంగాణ ఏర్పడేనాటికే రూ.75,575 కోట్లు అప్పు ఉన్నదని పేర్కొన్నారు. రైతుల పెట్టుబడికోసం ఎకరానికి రూ.10వేలు ఇచ్చే ప్రభుత్వం దేశంలో ఎక్కడనైనా ఉన్నదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు ఏదో ఒక విమర్శ చేయాలనే ఉద్దేశంతోనే అర్థపర్థం లేని విమర్శలు చేస్తున్నాయని అన్నారు.

మంద కృష్ణ నోటిని ఫినాయిల్‌తో కడగాలి

- టీఆర్ఎస్ నేత పిడమర్తి రవి ధ్వజం
- మాదిగలకు పెద్దదిక్కు సీఎం కేసీఆరేనని స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణపై టీఆర్ఎస్ నాయకుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును పలికినందుకు మంద కృష్ణ నోటిని ఫినాయిల్‌తో కడగాలని అన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఎస్సీల వర్గీకరణకు మద్దతుగా సీఎం కేసీఆర్ గతంలోనే అసెంబ్లీలో తీర్మానం చేయించడంతోపాటు ప్రధానికి వినతిపత్రాన్ని సమర్పించిన విషయాన్ని గుర్తుచేశారు. మాదిగలకు పెద్దదిక్కు సీఎం కేసీఆరేనని పేర్కొన్నారు. అంబేద్కర్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న మంద కృష్ణ గత 25 ఏండ్ల నుంచి కాంగ్రెస్, బీజేపీకి వత్తాసు పలుకుతున్నారని రవి నిప్పులుచెరిగారు. ఎస్సీల వర్గీకరణకు బిల్లు పెట్టాలని బీజేపీని అడుగకుండా ఆ పార్టీ నేతలతో మంద కృష్ణ ఎందుకు కలిసి తిరుగుతున్నారని నిలదీశారు. ఎన్నికల్లో పోటీచేసి కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయిన మంద కృష్ణ టీఆర్ఎస్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదని పిడమర్తి రవి ఎద్దేవా చేశారు.

అక్టోబర్15 నుంచి టెరిటోరియల్ ఆర్మీ రిక్రూట్‌మెంట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టెరిటోరియల్ ఆర్మీలో సైనికులు, క్లర్క్, చెఫ్ కమ్యూనిటీ, చెఫ్ స్పెషల్, హెయిర్‌డ్రెస్సర్ పోస్టులకు అక్టోబర్ 15 నుంచి 25వ తేదీవరకు రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నట్టు ఆర్మీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఏపీ, గుజరాత్, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, గోవా, కేంద్రపాలిత ప్రాంతాలైన దాద్రానగర్‌హవేలి, డామన్ డయ్యూ, లక్షద్వీప్, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని అభ్యర్థులకు ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లో నిర్వహించే ఈ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనాలనుకునేవారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తులకు అక్టోబర్ 7 వరకు గడువు ఉన్నదని, 18 నుంచి 42 ఏండ్ల మధ్య వయస్సువారు మాత్రమే అర్హులని తెలిపారు.

అక్రమ కట్టడాలన్నీ తొలగిస్తాం

- లింగమనేని నివాసం అక్రమ కట్టడమే
- ఏపీ మంత్రి బొత్స స్పష్టీకరణ

అమరావతి, నమస్తే తెలంగాణ: కృష్ణా నది కరకట్టపై ఉన్న అక్రమ కట్టడాల విషయంలో చట్టప్రకా రం చర్యలు తీసుకొంటున్నామని మున్సిపల్‌శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టంచేశారు. కృష్ణానది కరకట్ట లోపల ఉన్న అక్రమ కట్టడాలకు గతంలోనే నోటీసులు ఇచ్చామని తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నోటీసులపై కొందరు కోర్టుకు కూడా వెళ్లారని, కోర్టు సూచనలను పరిగణనలోకి తీసుకొని ఇప్పుడు చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. ఉండవల్లిలో ఉన్న చంద్రబాబు నివాసాన్ని కూల్చేస్తున్నామంటూ కొంద రు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పాతూరి కోటేశ్వర రావు భవనంలోని అక్రమ కట్టడాలు తొలగించామన్నారు. చంద్రబాబు ఉంటున్న లింగమనేని ఎస్టేట్ అక్రమ కట్టడమేనని, బాబు కూడా గతంలో ఇదే విషయాన్ని చెప్పారని గుర్తుచేశారు. రాజధాని ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా ఆ రోజు ఈ భవనాన్ని ప్రభుత్వానికి ఇచ్చారని బాబు అంగీకరించారని, కానీ, ఇప్పుడేమో దానిపై మాట మారుస్తున్నారని తప్పుబట్టారు. లింగమనేని నివాసానికి కూడా నోటీసులు ఇచ్చామని, చట్టప్రకారం అన్ని అక్రమ కట్టడాలను తొలగిస్తామని తేల్చిచెప్పారు.

పోలవరం పనులు మేఘాకు

రివర్స్ టెండరింగ్‌లో 12.6 శాతం తక్కువ కోట్‌చేసిన సంస్థ

అమరావతి/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలవరం ప్రధాన డ్యాం వద్ద మిగిలిన పనులతోపాటు జల విద్యుత్ కేంద్రాలకు సంబంధించి చేపట్టిన రివర్స్ టెండరింగ్‌లో మేఘా సంస్థ 12.6శాతం తక్కువకే ఈ పనులు చేపట్టేందుకు ముందుకొచ్చింది. రూ.4,987.55 కోట్లు విలువచేసే పనులకు టెండర్లు పిలువగా.. మేఘా సంస్థ రూ.4,358.11కోట్లు కోట్ చేస్తూ బిడ్డింగ్ వేసింది. ఈ మేరకు ఆర్థిక బిడ్‌ను ఏపీ ప్రభుత్వం సోమవారం తెరిచింది. దీంతో ఏపీ ఖజానాకు రూ.628.43 కోట్లు ఆదా కాగా.. గతంలో 4.8శాతం ఎక్సెస్ ధరకు తన అస్మదీయులకు చంద్రబాబు సర్కారు ఈ టెండర్లను కట్టబెట్టిందని, దీనివల్ల ఖజానాపై రూ.154 కోట్ల అదనపు భారం పడిందని వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ భారాన్ని కూడా కలుపుకొంటే ప్రస్తుతం ఖజానాకు రూ.782 కోట్లు ఆదా అయినట్టు అయింది. కాగా, ఈ రివర్స్ టెండరింగ్‌పై ఏపీ ప్రభుత్వ మంత్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాపై భారం పడకుండా పోలవరం రివర్స్ టెండరింగ్ నిర్వహించినట్టు పేర్కొన్నారు. అయితే ఏపీలోని ప్రతిపక్షం మాత్రం యథావిధిగా ఆరోపణలకు దిగింది.

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
మంగళవారం 24 సెప్టెంబర్ 2019

ప్రతి భారతీయుడు గర్వించే సినిమా 'సైరా'

'సెప్టెంబర్ 22 నా జీవితంలో చిరస్మరణీయమైనది. ఓ మైలురాయివంటిది. 1978 న ఇదేరోజు నా మొదటి సినిమా 'ప్రాణం ఖరీదు' విడుదలైంది. ఆ సమయంలో సినిమా ఫలితం ఎలా ఉంటుందో, నా భవిష్యత్తు ఏమిటో అని ఉద్విగ్నతకు లోనయ్యాను. 41 సంవ్సతరాల తర్వాత మళ్లీ అలాంటి ఉద్విగ్నత, టెన్షన్ ఫీలవుతున్నానేది వాస్తవం. దానికి కారణం 'సైరా'' అన్నారు చిరంజీవి. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'సైరా నర సింహారెడ్డి'. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకుడు. నయనతార, తమన్నా కథానాయికలు. అమితాబ్‌బచ్చన్, సుదీప్, విజయ్ సేతుపతి కీలక పాత్రల్ని పోషించారు. అక్టోబర్ 2న విడుదలకానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'పుష్కర కాలం నుంచి ఈ సినిమా నా మదిలో మెదులుతున్నది. స్వాతంత్ర్య సమరయోధుడి పాత్ర చేయాలన్నది నా ఇరవైఏళ్ల కల. ఎవరైనా అడిగితే భగత్‌సింగ్ పాత్ర చేయాలనుందని చెప్పేవాడిని. అయితే ఆ కోరిక అలా మిగిలిపోయింది. 12 ఏళ్ల క్రితం పరుచూరి బ్రదర్స్ ఈ కథ గురించి చెప్పారు. ఓ యోగి, స్వాతంత్ర్యసమరయోధుడు..భారతీయులందరూ తెలుసుకోవాల్సిన కథ అని తెలిపారు. నరసింహారెడ్డి చరిత్ర మరచిన హీరో. ఆయన కథ ప్రపంచానికి తెలియాజెప్పాలనుకున్నా. ఓ తెలుగు యోధుడి కథ తెరమరుగైపోకూడదని భావించా. పరోక్షంగా ఈ సినిమాకు శ్రీకారం చుట్టించింది, మద్దతు ఇచ్చింది రాజమౌళి. ఆయన గనుక 'బాహుబలి' తీసుండకపోతే ఈ రోజు 'సైరా' వచ్చేది కాదు.'బాహుబలి'తో రాజమౌళి తెలుగు సినిమాకు ఓ కొత్త బాట వేశారు. ఎన్ని వందలకోట్లు ఖర్చు పెట్టినా సరే లాభాల్ని రాబట్టుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని సభాముఖంగా చెప్పాలనుకున్నా. ఈ సినిమాను ఎవరికో అప్పజెప్పడం ఎందుకు మనమే చేద్దామని రామ్‌చరణ్ ముందుకొచ్చాడు. నేను సై అన్నాను. 'ధ్రువ' సినిమాలో సురేందర్‌రెడ్డి పనితనం నచ్చి రామ్‌చరణ్ ఆయనకే దర్శకత్వ బాధ్యతలు అప్పజెప్పారు. సురేందర్‌రెడ్డి ఈ సినిమా కోసం ఎంతో పరిశోధన చేశారు. చరిత్రను వక్రీకరించకుండా యథార్థగాథను అద్భుతంగా దృశ్యమానం చేశారు. ఆయనకు హ్యాట్సాఫ్. నేను పోరాట ఘట్టాల విషయంలో డూప్‌ని ఇష్టపడను. అభిమానులు కూడా అలా చేస్తే ఒప్పుకోరు. ఎంతో హింసపెట్టి నా నుంచి యాక్షన్ ఘట్టాల్ని రాబట్టుకున్నారు (నవ్వుతూ). కత్తి, డాలు పట్టుకొని ఒక్కసారి గుర్రమెక్కితే నేను ఒళ్లు మర్చిపోతాను. నా వయసూ మర్చిపోతాను. అప్పుడు నాకు గుర్తొచ్చేది నా అభిమానులు, ఇమేజ్ మాత్రమే. 'శంకరాభరణం' తెలుగు సినిమాకు ఎనలేని గౌరవాన్ని తీసుకొచ్చింది. ఆ తర్వాత కొన్ని సినిమాలు వచ్చినా అంత గౌరవాన్ని పొందలేదు. 'శంకరాభరణం తర్వాత తిరిగి 'బాహుబలి' అలాంటి గౌరవం తీసుకొచ్చింది. వాటి స్థాయిలో 'సైరా' మేము ఆశించిన గౌరవాన్ని తెస్తుందని అనుకుంటున్నా. ఈ సినిమాలో వచ్చే జాతీయగీతం దేశంకోసం త్యాగం చేసిన మహనుభావులకు నివాళిగా ఉంటుంది. ప్రతి భారతీయుడు గర్వపడే సినిమా ఇది. దేశభక్తి ప్రధానంగా ఇలాంటి ఉత్తమ చిత్రాన్ని నిర్మించినందుకు రామ్‌చరణ్‌ను అభినందిస్తున్నాను. మహాత్మగాంధీ 150వ జయంతి రోజున ఈ సినిమా విడుదల చేయడం ఓ మరపురాని ఘట్టంగా భావిస్తున్నాను' అన్నారు.

సతీమణితో దర్శకుడు సురేందర్‌రెడ్డి

ఉపాసన, సురేఖ, శ్రీజ

దేశం గొప్పతనాన్ని చాటిచెప్పే సినిమా

పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ 'పోటీతత్వం ఉన్న ఈ పరిశ్రమలో అన్నయ్య అందరూ బాగుండాలని కోరుకుంటారు. హీరోగా నేను తెలుగు ప్రేక్షకుల అభిమానం సంపాదించుకోవడానికి అన్నయ్య నేర్పించిన పాఠాలే కారణం. అన్నయ్య దేశం గర్వించే సినిమాలు చేయాలని ఎప్పుడూ కోరుకునే వాణ్ణి. స్టార్‌డమ్ వచ్చినా నేను అలాంటి సినిమాలు చేయలేకపోయాను. కానీ స్వార్థం చూసుకోకుండా వందల కోట్లు ఖర్చుపెట్టి రామ్‌చరణ్ ఈ సినిమాను తీసి నా కోరిక నెరవేర్చాడు. దేశం గొప్పతనాన్ని చాటిచెప్పే సినిమా ఇది. ఓ గొప్ప వీరుడి చరిత్రతో సురేందర్‌రెడ్డి ఈ సినిమాను అత్యద్భుతంగా తెరకెక్కించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అంటే చిరంజీవే గుర్తొచ్చారు. అనుభవానికి నేను పెద్దపీట వేస్తాను. ఇండస్ట్రీలోకి ఎంతమంది కొత్తవాళ్లు వచ్చినా, ఎన్ని రికార్డులు బద్దలుకొట్టినా అన్నయ్య అనుభవాన్ని అధిగమించలేరు. దేశం కోసం ప్రజల కోసం తీసిన సినిమా ఇది. ఇలాంటి గొప్ప సినిమాలో నేను భాగస్వామినవ్వడం ఆనందంగా ఉంది. ఎవరైనా విజయాల్ని సాధిస్తే మేము అసూయ చెందకుండా ఆనంద పడతాం. రాజమౌళి, సురేందర్‌రెడ్డి ఎవరూ గెలిచిన, రికార్డులు బద్దలు కొట్టినా మాకు ఆనందం గానే ఉంటుంది' అన్నారు.

పవన్‌కల్యాణ్, రాజమౌళి, చిరంజీవి, రామ్‌చరణ్

చిరంజీవికి రుణపడి ఉంటా

దర్శకుడు సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ '200రోజుల పాటు ఈ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఓ కుటుంబంలా శ్రమించారు. తన డ్రీమ్‌ప్రాజెక్ట్ అయిన ఈ సినిమాను డైరెక్ట్ చేసే అవకాశం నాకు ఇచ్చినందుకు చిరంజీవిగారికి రుణపడి ఉంటాను. ఈ సినిమా నిర్మాణానికి సంబంధించిన ప్రతి విషయంలో నాకు ఎంతో స్వేచ్ఛనిచ్చి ముందుకు నడిపించిన రామ్‌చరణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు' అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ ' రెండు వందల రోజులు చిత్రీకరణ జరిపాం. ఈ ప్రయాణంలో ప్రతి రోజు సాంకేతిక నిపుణులందరికి కృతజ్ఞతలు చెబుతూనే ఉన్నాను. సమిష్టి కృషి వల్లే నాన్న కల నెరవేరింది' అని తెలిపారు. తెలుగులో తన మొదటి సినిమా చిరంజీవితో చేయడం గౌరవం, అదృష్టంగా భావిస్తున్నానని విజయ్ సేతుపతి పేర్కొన్నారు.

తెలుగువాళ్లందరికి బహుమతి ఇది..

రాజమౌళి మాట్లాడుతూ 'ఇంతటి చారిత్రక సినిమా వేడుక జరుగుతున్నదంటే మొట్టమొదట గుర్తుంచుకోవాల్సింది, కృతజ్ఞతలు చెప్పాల్సింది పరుచూరి బ్రదర్స్‌కు. ఎందుకంటే ఎన్నో సంవత్సరాలుగా వారు ఈ కథను తమ గుండెల్లో మోశారు. కేవలం తన తండ్రి చిరంజీవిగారికే కాదు.. మొత్తం తెలుగువాళ్లందరికి రామ్‌చరణ్ అందిస్తున్న బహుమతి ఇది. ఈ తరహా సినిమాలు తీయడం ఎంత కష్టమో నాకు తెలుసు. 'బాహుబలి'లో 2300 వీఎఫ్‌ఎక్స్ షాట్స్ ఉంటే 'సైరా'లో 3800 వీఎఫ్‌ఎక్స్ షాట్స్ ఉన్నాయని వీఎఫ్‌ఎక్స్ సూపర్‌వైజర్ కమల్‌కణ్ణన్ నాతో చెప్పారు. అయితే వీఎఫ్‌ఎక్స్ షాట్స్ చేయడం కష్టమైన పనికాదు. వాటి మధ్య ఎమోషన్‌ను మర్చిపోకుండా చూపించడం ముఖ్యం. ఎందుకంటే సినిమాను ప్రజలకు దగ్గర చేసేవి ఎమోషన్స్. వాటిని బలంగా, అద్భుతంగా చెప్పడం దర్శకుడి భుజస్కంధాలపై ఉంటుంది. ట్రైలర్ చూసిన వెంటనే సినిమా మీద అందరికి కాన్ఫిడెన్స్ వచ్చింది. ఈ క్రెడిట్ అంతా సురేందర్‌రెడ్డిదే. 'సైరా' యూనిట్ మీద పై నుంచి ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగారు పైనుంచి వేసిన అక్షింతలు' అన్నారు. ఈ కార్యక్రమంలో జగపతిబాబు, అల్లు అరవింద్, రత్నవేలు, పరుచూరి గోపాలకృష్ణ, సాయిమాధవ్‌బుర్రా, రామ్‌లక్ష్మణ్, అమిత్ త్రివేది, శ్రీకర్‌ప్రసాద్, ఎన్వీప్రసాద్, రవిశంకర్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హారర్ కామెడీ 'వదలడు'


సిద్ధార్థ్, కేథరిన్ థెరిస్సా

'సిద్ధార్థ్ కథానాయకుడిగా నటిస్తున్న తమిళ చిత్రం 'అరువమ్' తెలుగులో 'వదలడు' పేరుతో అనువాదమవుతున్నది. సాయిశేఖర్ దర్శకుడు. పారిజాత క్రియేషన్స్ పతాకంపై టి.నరేష్‌కుమార్, టి.శ్రీధర్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. కేథరిన్ థెరిస్సా కథానాయిక. టి. అంజయ్య సమర్పకుడు. అక్టోబర్ 11న తమిళ, తెలుగు భాషల్లో విడుదలకానుంది. నిర్మాతలు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'హారర్ కామెడీ కథాంశమిది. సిద్ధార్థ్, కేథరిన్ మధ్య ప్రేమకథ అలరిస్తుంది. దెయ్యంగా మారి తనకు అన్యాయం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకునే వ్యక్తి కథ ఇది. దాదాపు 450 థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. నరేన్, మధుసూదనరావు, సతీష్, కబీర్‌సింగ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎన్.కె.ఏకాంబరం, సంగీతం: తమన్.


కొండారెడ్డి బురుజు సెట్ వద్ద మహేష్‌బాబు

16 ఏళ్ల తర్వాత..

'మహేష్‌బాబు కెరీర్‌లో 'ఒక్కడు' చిత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. గుణశేఖర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మహేష్ కెరీర్‌లో చిరస్మరణీయమైన విజయంగా నిలిచిపోయింది. రాయలసీమ ఫ్యాక్షన్ నేపథ్య ఇతివృత్తంతో రూపొందించిన ఈ సినిమాలో కర్నూల్ కొండారెడ్డి బురుజు వద్ద చిత్రీకరించిన సన్నివేశాలు ప్రధానాకర్షణగా నిలిచాయి. ఆ సెంటర్‌లో మహేష్‌బాబు, ప్రకాష్‌రాజ్ మధ్య తెరకెక్కించిన సన్నివేశాలు రొమాంచితంగా అనిపిస్తాయి. మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలోని ముఖ్య సన్నివేశాల్ని కొండారెడ్డి బురుజు నేపథ్యంలో చిత్రీకరించబోతున్నారట. దీనికోసం హైదరాబాద్ రామోజీఫిల్మ్ సిటీలో కళా దర్శకుడు ఏఎస్ ప్రకాశ్ నేతృత్వంలో కొండారెడ్డి బురుజు సెటింను సృష్టించారు. ఈ విషయాన్ని చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. 'పదహారేళ్ల క్రితం కొండారెడ్డి బురుజు సెంటర్ వెండితెరపై ఓ చెరగని గుర్తుగా నిలిచిపోయింది. ఇప్పుడు అదే నేపథ్యాన్ని పునఃసృష్టిస్తూ అద్భుతమైన సెట్‌ను రూపొందించాం' అంటూ బురుజు వద్ద మహేష్‌బాబు నిల్చొని చూస్తున్న ఓ ఫొటోను పంచుకున్నారు. ప్రస్తుతం ఈ స్టిల్ సోషల్‌మీడియాలో అభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో జి.ఎం.బి.ఎంటర్‌టైన్‌మెంట్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రామబ్రహ్మం సుంకర నిర్మాత. రష్మిక మందన్న కథానాయిక. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మహేష్‌బాబు

వన్స్‌మోర్!

పరశురామ్


విజయ్ దేవరకొండ

'క్రేజీ యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కలయికలో రూపొందిన 'గీతగోవిందం' ఎంతటి ఘనవిజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పటి వరకు క్రేజీ యూత్‌స్టార్‌గా వున్న విజయ్‌ని 'గీత గోవిందం' చిత్ర సక్సెస్ కుటుంబ ప్రేక్షకులకు చేరువ చేసింది. 100 కోట్లకు పైగా వసూలు చేసిన ఈ చిత్రం విజయ్, పరశురామ్ కెరీర్‌లో మైల్‌స్టోన్ సినిమాగా నిలిచింది. కాగా ఈ కాంబినేషన్‌లో మరో చిత్రం రాబోతుందని తెలిసింది. ఇటీవల పరశురామ్ చెప్పిన కథ నచ్చడంతో విజయ్ దేవరకొండ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడట. అయితే ప్రస్తుతం వరల్డ్ ఫేమస్ లవర్, హీరో, పూరీ దర్శకత్వంలో ఓ చిత్రం ఇలా వరుస సినిమాలతో బిజీగా వున్న విజయ్ ఈ గ్యాప్‌లోనే పరశురామ్ చిత్రాన్ని కూడా పూర్తిచేయాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. అయితే అఖిల్ హీరోగా పరశురామ్ దర్శకత్వంలో ఓ సినిమా ఖరారైనట్లు సమాచారం. అది పూర్తయిన తర్వాతే పరశురామ్-విజయ్‌దేవరకొండ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉందని చెబుతున్నారు.

మాతృత్వపు మాధుర్యంలో..

కాబోయే భర్తతో అమీజాక్సన్

'శ్వేతసుందరి అమీజాక్సన్ సోమవారం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించింది. చిన్నారి బాబుకు ఆండ్రియాస్ అని నామకరణం చేస్తున్నట్లు తెలిపింది. 'నా ఏంజెల్ ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టింది. ఆండ్రియాస్‌కు స్వాగతం' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొంది. ఈ సందర్భంగా కాబోయే భర్త జార్జి పనయోటుతో ఆసుపత్రిలో తీయించుకున్న ఫొటోను పోస్ట్ చేసింది. ఈ ఏడాది జనవరిలో బ్రిటన్‌కు చెందిన వ్యాపారవేత్త జార్జి పనయోటుతో అమీజాక్సన్‌కు నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది గ్రీస్‌లో ఈ జంట పెళ్లిపీటలెక్కడానికి సిద్ధమవుతున్నారు. సంతానం కోసం తామిద్దరం ప్లాన్ చేసుకోలేదని, గర్భం దాల్చినందుకు సంతోషపడ్డానని కొద్ది నెలల క్రితం మీడియాతో చెప్పింది అమీజాక్సన్. 'మదరాసిపట్టణం' 'రోబో-2' 'ఎవడు' 'ఐ' వంటి సినిమాలతో ఈ బ్రిటీష్ భామ దక్షిణాది ప్రేక్షకులకు చేరువైంది.

'విఠల్‌వాడి' ప్రేమకథ

'విఠల్‌వాడి' చిత్రంలో ఓ దృశ్యం

'రోహిత్, సుధా రావత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'విఠల్‌వాడి'. టి.నాగేందర్ దర్శకుడు. నరేష్ రెడ్డి.జి నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను నటుడు జగపతిబాబు విడుదలచేశారు. ఆయన మాట్లాడుతూ 'ఫస్ట్‌లుక్ ఆసక్తిని రేకెత్తిస్తున్నది. హీరోగా రోహిత్‌కు ఈ చిత్రం చక్కటి శుభారంభాన్ని అందించాలి' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'హైదరాబాద్‌లోని విఠల్‌వాడి అనే ప్రాంతంలో జరిగిన యథార్థ ఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. కథ, కథనాల్లో వాస్తవికతకు పెద్దపీట వేస్తున్నాం. త్వరలో టీజర్‌ను విడుదలచేస్తాం'అని చెప్పారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రోషన్ సాలూరి, కెమెరామెన్: సతీష్ అడపా.

'తొలి ప్రేమ' స్ఫూర్తితో..

సుకృతవాగ్లే

'నేను నటించిన తొలి కమర్షియల్ చిత్రమిది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని చెప్పింది సుకృత వాగ్లే. ఆమె కథానాయికగా నటిస్తున్న చిత్రం 'రామ చక్కని సీత'. శ్రీహర్ష మంద దర్శకుడు. ఇంద్ర కథానాయకుడు. ఫణికాంత్, విశాలక్ష్మి మంద ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెల 27 విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో సుకృత వాగ్లే పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'తెలుగులో నా తొలి చిత్రమిది. ఇదివరకు కన్నడంలో ఏడు సినిమాలు చేశాను. మహిళా ప్రధాన ఇతివృత్తాలతో తెరకెక్కిన ఈ చిత్రాలు నటిగా నాకు ప్రశంసలతో పాటు పురస్కారాల్ని తెచ్చిపెట్టాయి. పర్ ఫార్మెన్స్ ఓరియెంటెడ్ హీరోయిన్ అనే ముద్రవేశాయి. ఆ పంథాకు భిన్నంగా నేను చేసిన సినిమా ఇది. 'తొలి ప్రేమ' సినిమా స్ఫూర్తితో దర్శకుడు ఈ సినిమాలో నాయకానాయికలకు అను, బాలు అనే పేర్లు పెట్టారు. భిన్న మనస్తత్వాలు కలిగిన వారు ఎలా ప్రేమలో పడ్డారన్నది ఆకట్టుకుంటుంది. సినిమాలో నా పాత్రకు ఎక్కువగా పంచ్ డైలాగ్స్ ఉంటాయి. కుటుంబవిలువలు, వినోదం, ప్రేమ, సెంటిమెంట్ అంశాలతో దర్శకుడు శ్రీహర్ష ఈ సినిమాను రూపొందించారు. తెలుగు ఇండస్ట్రీలోని పోటీతత్వం, ఐకమత్యం నన్ను ఆకట్టుకున్నాయి. హీరోయిన్స్‌ను ఆరాధించే గుణం తెలుగు ప్రేక్షకుల్లో ఎక్కువగా కనిపించింది. తెలుగులో కొత్త కథలు వింటున్నాను. తమిళంలో ఓ సినిమా చేయబోతున్నాను' అని తెలిపింది.

టైటిల్ మార్చాలంటూ..

పావని, వెంకట్

'రాయలసీమ ప్రాంతాన్ని కించపరుస్తూ తీసిన సినిమా కాదిది. ఆ ప్రాంతం గొప్పతనాన్ని చాటి చెబుతూ అశ్లీలత, అసభ్యతకు తావు లేకుండా రూపొందించాం'అని అన్నారు దర్శకుడు రామ్ రణధీర్. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రాయలసీమ లవ్‌స్టోరీ'. వెంకట్, వృశాలి, పావని నాయకానాయికలు. రాయల్ చిన్నా, నాగరాజు నిర్మాతలు. ఈ నెల 27న విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ 'రాయలసీమ ప్రాంతం వారి మనోభావాలను దెబ్బతీసేలా ట్రైలర్, పోస్టర్స్ ఉన్నాయని టైటిల్‌ను మార్చాలంటూ కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారు. సినిమా చూడకుండా అలాంటి అభిప్రాయానికి రావడం సరికాదు. రాయలసీమ నేపథ్యంలో ఇప్పటివరకు రాని సరికొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. భావోద్వేగభరిత ప్రేమకథగా రూపొందించాం'అని చెప్పారు.